ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698



తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

శనివారం 09.05.2026 | సంపుటి : 12 సంచిక : 289 | పేజీలు : 12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370






హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్




# సర్ కుట్రలు తెలంగాణలో సాగనివ్వం

**ఎస్ఐఆర్‌తో రాష్ట్రంలో ఓట్లు తొలగించాలని చూస్తున్నారు**

**దీనిని అందరం కలసికట్టుగా ఎదుర్కోవాలి : సీఎం రేవంత్**



- మైనారిటీలసంక్షేమానికి పెద్దపీట
- మూసీ అభివృద్ధిలో గుడితో పాటు మసీద్, చర్చి, గురుద్వారాల నిర్మాణం
- దేశ విశిష్టతను, తెలంగాణలోని గంగా జమునా తెహ్‌జీబ్‌ను తెలియజేసేలా కట్టడాలు ఉండాలి
- ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో నైపుణ్య శిక్షణాభివృద్ధి కోర్సులతో డిగ్రీ కళాశాలలు
- మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులకు పోత్సాహకాలు
- మైనారిటీ సంక్షేమ శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- హాజ్ యాత్ర బస్సు ప్రారంభించిన ముఖ్యమంత్రి

> ఓటర్ల ప్రత్యేక సవరణ పేరుతో తెలంగాణలో ఓట్లు తొలగించాలని చూస్తున్నారు. ఇతర రాష్ట్రాల్లో జరిగిన విధంగా తెలంగాణలో జరగనీయవద్దు. అందరూ కలిసి కట్టుగా ఎదుర్కోవాలి. మూసీ రివర్ ఫ్రంట్‌లో భాగంగా గుడితో పాటు మసీద్, చర్చి, గురుద్వారా నిర్మాణాలు చేపట్టాలని అధికారులను ఆదేశించాను. ఆయా మతాలకు సంబంధించిన సంస్కృతుల అధ్యయనం, భారత దేశ విశిష్టతను, తెలంగాణలోని గంగా జమునా తెహ్‌జీబ్‌ను తెలియజేసేలా ఆ కట్టడాలు ఉండాలి. మన సంస్కృతులను అధ్యయనం చేసే గొప్ప అధ్యయన కేంద్రాలుగా అవి పరిఢవిల్లాలి. మైనారిటీ పాఠశాలల్లో బోధనలో ఏఐకు ప్రాధాన్యమివ్వాలి. భూ లభ్యత ఉన్న చోట ఖబరస్తాన్‌లకు స్థలాలను కేటాయిస్తాం
> - సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్(జనంసాక్షి):**ఓటర్ల ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్) పేరుతో తెలంగాణలో ఓట్లు తొలగించాలని చూస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఇతర రాష్ట్రాల్లో జరిగిన విధంగా తెలంగాణలో జరగనీయవద్దని, అందరూ కలిసి కట్టుగా ఎదుర్కోవాలని మైనారిటీల కార్యక్రమంలో ముఖ్యమంత్రి పేర్కొన్నారు. హజ్ వెళ్తున్న బస్సులకు సీఎం రేవంత్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. సంక్షేమం, ఉద్యోగాల్లో మైనారిటీల వాటా వారికి ఇస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. ఇరాన్, ఇరాక్ యుద్ధంతో పెరిగిన విమాన ఛార్జీల భారం హజ్ యాత్రికులపై పడకుండా ప్రభుత్వమే భరిస్తోందన్నారు. గతేడాది హజ్‌కు వెళ్లిన బస్సు ప్రమాదంలో 44 మంది మరణిస్తే మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం ఇచ్చినట్లు ప్రస్తావించారు. ప్రస్తుతం వైట్ కాలర్ జాబ్స్ కంటే బ్లూ కాలర్

మిగతా 2లో..



# మూసీ తొలిదశకు లైన్‌క్లియర్

**ప్రాజెక్టు పనులకు రూ.7,055 కోట్లు కేటాయింపు**

- తొలిదశలో హిమాయత్ సాగర్ నుంచి బాపుఘాట్ వరకు పనులు
- తొలి 5 కి.మీ పనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశం
- ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ద్వారా నిధుల కేటాయింపు
- కేబినెట్ సబ్‌కమిటీ భేటీలో నిర్ణయం

**హైదరాబాద్(జనంసాక్షి):**
మూసీ నది పునరుజ్జీవనం ప్రాజెక్టును మొత్తం 55 కిలోమీటర్ల మేర 5 దశల్లో అభివృద్ధి చేపట్టనున్నారు. ఫేజ్-1కు 7,055 కోట్ల రూపాయల వ్యయం అంచనా వేశారు. ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ నిధుల కోసం సాంకేతిక, ఆర్థిక చర్చలు పూర్తి అయ్యాయి. ప్రజా భవన్‌లో మూసీ నది పునరుజ్జీవనం ప్రాజెక్టుపై కేబినెట్ సబ్ కమిటీ శుక్రవారం సమావేశమైంది. ఈ సమావేశంలో మంత్రులు భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. మూసీ పునరుజ్జీవనం ప్రాజెక్టును ప్రజల

మిగతా 2లో..

## దేశంలోని గొప్ప పరిశ్రమలన్నీ కొడంగల్‌కు తీసుకొస్తున్నాం

- నియోజకవర్గాన్ని గొప్ప ఎడ్యుకేషన్ హబ్‌గా మారుస్తా
- 430 పడకల ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన
- మహలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణం
- పలు అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ శంకుస్థాపనలు

2లో..



## విజయ్‌కు గవర్నర్ ఆహ్వానం

# అంతులేని కథ



**మరోసారి సందిగ్ధత**

**నేడు ప్రమాణస్వీకారం లేదని లోక్‌భవన్ వెల్లడి**

**చెన్నై(జనంసాక్షి):**తమిళనాడు రాజకీయాల్లో మరో ట్విస్ట్..! ప్రభుత్వ ఏర్పాటుపై ఇంకా అనిశ్చితి పూర్తిగా వీడలేదు. ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు టీవీకే చీఫ్ విజయ్‌కు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్‌ను గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు వార్తలు వచ్చినప్పటికీ.. లోక్‌భవన్ నుంచి ఇంకా అధికారిక ప్రకటన రాకపోవడంపై మళ్లీ సందిగ్ధత నెలకొంది. ఇటీవల జరిగిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలిచి అతిపెద్ద పార్టీగా అవతరించిన టీవీకేకు.. తొలుత కాంగ్రెస్, తాజాగా సీపీఐ, సీపీఎంతో పాటు వీసీకే పార్టీలు మద్దతు ప్రకటించడంతో మెజార్టీ మార్కును చేరుకున్నట్లయింది. అయితే, వీసీకే అధికారికంగా లేఖ ఇవ్వకపోడం వల్లే ఈ సందిగ్ధత నెలకొన్నట్లు తెలుస్తోంది. మరోవైపు, శనివారం ఉదయం 11గంటలకు తమిళనాడు ముఖ్యమంత్రిగా విజయ్ ప్రమాణస్వీకారం చేస్తారని సీపీఎం నేత కె.బాలకృష్ణన్ వెల్లడించారు. ఈ ప్రమాణస్వీకారోత్సవానికి కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ హాజరయ్యే అవకాశం ఉన్నట్లు కాంగ్రెస్ వర్గాలు పేర్కొన్నాయి. తాజా పరిణామంతో ప్రమాణస్వీకారం ఎప్పుడనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది.

**వామపక్షాలకు విజయ్ థాంక్స్**

వామపక్షాలు మద్దతు ప్రకటించడంతో ప్రభుత్వ ఏర్పాటు విషయంలో నెలకొన్న అనిశ్చితి తొలగింది. దీంతో గవర్నర్‌తో సమావేశం ముగిసిన వెంటనే విజయ్ నేరుగా చెన్నైలోని సీపీఐ, సీపీఎం

మిగతా 2లో..



# హడలెత్తిస్తున్న హంటా వైరస్

క్రూజ్ నౌక ఎంవీ హ్యాండియస్ కారణంగా తెరపైకి వచ్చిన హంటావైరస్ ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా కలకలం సృష్టిస్తోంది. ఈ నౌకతో ప్రమేయమున్న వారిలో ఎనిమిది మందికి హంటావైరస్ సోకినట్లు డబ్ల్యూహెచ్‌వో గుర్తించింది. వారిలో ముగ్గురు చనిపోయారు. ఈ నౌకలో 23 దేశాలకు చెందిన 146 మంది ఉన్నారు. వారు స్పెయిన్‌లోని క్యానరీ దీవుల నుంచి స్వదేశాలకు చేరుకోనున్నారు. కరోనా వైరస్ మిగిల్చిన చేదు అనుభవాల దృష్ట్యా ఈ వైరస్‌పైనా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

9లో..

**హంటావైరస్‌తో భారత్‌కు తక్షణ ముప్పు లేదు**

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ డైరెక్టర్ నవీన్ కుమార్

## వికసిత భారత్‌లో 'ప్రాణహిత'ను

# పరిశీలించండి

**ప్రాజెక్టు అవశ్యకతను బీజేపీ ప్రజాప్రతినిధులు ప్రధాని మోడీకి వివరించాలి**

- ప్రాజెక్టు అవశ్యకతను బీజేపీ ప్రజాప్రతినిధులు ప్రధానికి వివరించాలి
- కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందించాలి
- తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టును పరిశీలించిన మంత్రులు

**కొమురంభీం ఆసిఫాబాద్ ప్రతినిధి(జనంసాక్షి):**
ప్రాణహిత ప్రాజెక్ట్ నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. శుక్రవారం ఉదయం తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత బ్యారేజీ నిర్మాణ స్థలాన్ని మంత్రులు జూపల్లి కృష్ణారావు, గడ్డం వివేక్ వెంకట స్వామి, ఎమ్మెల్యేలు, అధికారులు పరిశీలించారు. నీటి లభ్యతపై ఇరిగేషన్ అధికారులతో చర్చించారు. నాటు పడవలపై నదీ ప్రవాహాన్ని మంత్రులు పరిశీలించారు. అనంతరం మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. ఈ నెల 10న ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటనకు వస్తున్న నేపథ్యంలో, వికసిత్ భారత్ అని చెప్పుకునే కేంద్రం ఈ ప్రాజెక్టు విషయంలో పెద్ద మనసు చాటుకోవాలని కోరారు. బీజేపీ ప్రజాప్రతినిధులు ఈ అంశాన్ని ప్రధాని దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఒక్క

మిగతా 2లో..





## ఇండియా కూటమికి డీఎంకే గుడ్‌బై

- పొత్తు ముగిసిందని ప్రకటన
- టీవీకేకు మద్దతివ్వడంపై ఆగ్రహం

## బెంగాల్ సీఎంగా సువేందు అధికారి

- నేడు ప్రమాణ స్వీకారం
- మోడీ, అమిత్ షా హాజరు
- శాసనసభాపక్ష నేతగా ఏకగ్రవ ఎన్నిక

2లో..

## పుదుచ్చేరి సీఎంగా రంగసామి

- 13న ప్రమాణస్వీకారం
- కేరళం ముఖ్యమంత్రి రేసులో కేసీ వేణుగోపాల్!

**టారీఫ్‌లపై ట్రంప్‌కు**

# మళ్లీ ఎదురుదెబ్బ

- ప్రపంచ దేశాలపై విధించిన 10% సుంకాలు చట్ట విరుద్ధం
- కొట్టివేసిన అమెరికా న్యాయస్థానం



**వాషింగ్టన్(జనంసాక్షి):**టారిఫ్‌ల విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. ప్రపంచ దేశాలపై ఆయన విధించిన 10 శాతం సుంకాలు చట్టవిరుద్ధమని పేర్కొంటూ.. అమెరికా న్యాయస్థానం వాటిని కొట్టివేసింది. ఈ మేరకు ముగ్గురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం 2-1 తేడాతో తీర్పునిచ్చింది. ప్రపంచ దేశాలపై ట్రంప్ విధించిన సుంకాలు చెల్లవని అమెరికా సుప్రీంకోర్టు ఫిబ్రవరిలో సంచలన తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత ట్రంప్ యంత్రాంగం ప్రపంచదేశాలపై మళ్లీ 10 శాతం తాత్కాలిక టారిఫ్‌లను విధించారు. ఇవి జులై 24తో ముగియ నున్నాయి. ఈ క్రమంలో సుంకాలు విధించడాన్ని వ్యతిరేకిస్తూ.. 24 అమెరికా రాష్ట్రాలు న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. దీనిపై తాజాగా విచారణ జరిపిన ఒక ఫెడరల్ కోర్టు.. అధ్యక్షుడికి కాంగ్రెస్ కల్పించిన సుంకాల అధికార పరిధిని ట్రంప్ అతిక్రమించారని పేర్కొంది. ట్రంప్ విధించిన సుంకాలు చట్ట విరుద్ధమని.. దీంతో అవి చెల్లవని తీర్పునిచ్చింది. అయితే, ధర్మాసనంలోని ఒక న్యాయమూర్తి ఈ తీర్పును విభేదించారు.

## పర్షియన్ గల్ఫ్‌లో చిక్కుకున్న నౌకలు

- దాదాపు 1,500 నౌకలు ఆగిపోయినట్లు యూఎన్
- ఇంటర్నేషనల్ మారిటైమ్ ఆర్గనైజేషన్ చీఫ్ వెల్లడి


2లో..

## మా ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలి

**హర్మూజ్‌పై ఇరాన్ నిబంధనలు**

**టెహ్రాన్(జనంసాక్షి):**హర్మూజ్ జలసంధిలో ఇరాన్ తన సొంత నిబంధనలను అమల్లోకి తీసుకువచ్చింది. ఈ మొత్తం వ్యవహారాలను చూసేందుకు పర్షియన్ గల్ఫ్ స్ట్రేట్ అథారిటీని ఏర్పాటుచేసింది. ఇక్కడి నుంచి పయనించే నౌకలు కచ్చితంగా 40 ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సిందేనని ఇరాన్ డిమాండ్ చేస్తోందని

మిగతా 2లో..



## రాష్ట్రంలో శాంతిభద్రతలు దారుణంగా క్షీణించాయి

**నరగంలో వరుస హత్యలు ఆందోళనకరం: కేటీఆర్**



**హైదరాబాద్(జనంసాక్షి):**
రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో శాంతిభద్రతలు ప్రమాదకర స్థాయికి పడిపోయాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా వరుసగా జరుగుతున్న ఘోరమైన నేరాల పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పోలీస్ యంత్రాంగం మొత్తాన్ని

మిగతా 2లో..

# 'తార' జువ్వలా..

- డీఆర్‌డీవో-వాయుసేన ఆధ్వర్యంలో సమష్టిగా నిర్వహించిన పరీక్ష విజయవంతం
- దేశ క్షిపణి వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా భారత్ మరో ముందడుగు



9లో..

## తెలంగాణకు కేంద్ర సహకారంపై

# చర్చకు సిద్ధం

9లో..


కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు విమర్శలు మానితే మంచిది: కిషన్ రెడ్డి

## మహనీయుల కలలు

# సాకారం చేస్తాం

- దశాబ్దాలుగా బెంగాల్ భయం గుప్పిట్లో గడిపింది
- చొరబాటు దారులను పూర్తిగా తరిమికొడతాం
- సరిహద్దుల్లో గట్టి నిఘా పెట్టి దేశాన్ని రక్షిస్తాం
- కక్షసాధింపు రాజకీయాలకు బిజెపి దూరం
- బీజేపీ లెజిస్లేచర్ పార్టీ భేటీలో అమిత్ షా స్పష్టీకరణ

2లో..





# 'వికసిత భారత్'లో 'ప్రాణహిత'ను పరిశీలించండి

యూనిట్ కరెంటు కూ డా ఖర్చు లేకుండా గ్రావిటీ ద్వారా శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి నీటిని తరలించే ఈ బృహత్తర కార్యాన్ని పూర్తి చేస్తామని, ఈ విషయంలో ప్రతిపక్షాలు రాజకీయ విమర్శలు మానుకుని సహకరించాలని మంత్రి జూపల్లి కోరారు. ఉమ్మడి ఆదిలాబాద్‌లోని మూడు జిల్లాలకు సాగు నీరు అందించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. 150 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణం జరుగుతుందని మంత్రి వెల్లడించారు. మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరుపుతామని అన్నారు. ముంపుకు గురయ్యే ప్రాంతాలకు నష్ట పరిహారం చెల్లిస్తామని చెప్పారు. ఎల్లుండి(మే 10) తెలంగాణకు వస్తున్న ప్రధాని మోదీ పెద్దమనసుతో ప్రాజెక్ట్ నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని కోరారు. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నా ప్రాణహిత ప్రాజెక్ట్ నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్తామని మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన ఈ ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ పట్టాలెక్కిస్తుందని ఆయన స్పష్టం చేశారు. సాగునీటి రంగంలో గ్రావిటీ ద్వారా నీటిని అందించే గొప్ప అవకాశాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం కాలరాసిందని ఆయన విమర్శించారు.మంత్రి జూపల్లి మాట్లాడుతూ, 2008లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి.. డా. బీఆర్. అంబేద్కర్ ప్రాణహిత–చేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టుకు భూమిపూజ చేశారు. రూ. 38,500 కోట్ల అంచనా వ్యయంతో 16 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టును చేపట్టారు. 106 కిలోమీటర్ల కాలువ పనులకు గానూ ఇప్పటికే 71.5 కిలోమీటర్ల మేర భూసేకరణ పూర్తయ్యి, 46 కిలోమీటర్ల మేర పనులు కూడా జరిగాయి. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును పక్కన పెట్టి, కాళేశ్వరం పేరుతో లక్షల కోట్లు ఖర్చు పెట్టి ఆర్థిక భారం మోపిందని మండిపడ్డారు. గ్రావిటీ ద్వారా వెళ్లాల్సిన నీటిని పంపుల ద్వారా ఎత్తిపోయడం వల్ల అంచనా వ్యయం గణనీయంగా పెరిగిందని మంత్రి వివరించారు. దీనివల్ల రాష్ట్రంపై భారీగా ఆర్థిక భారం పడటమే కాకుండా, కరెంట్ బిల్లులు కూడా భారంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. నది తలాపునే ఉన్న సిర్పూర్, ఆసిఫాబాద్, బెల్లంపల్లి, చెన్నూరు నియోజకవర్గాల రైతులకు తీరని అన్యాయం జరిగిందని ఆయన పేర్కొన్నారు. మేడిగడ్డ పిల్లర్లు కుంగిపోవడంతో ప్రస్తుతం ఆ నీటిని వినియోగించుకునే అవకాశం కూడా లేకుండా పోయిందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును పూర్తి చేయడానికి కృత నిశ్చయంతో ఉందని జూపల్లి తెలిపారు. 150 మీటర్ల బరాజ్ నిర్మాణానికి అంగీకరించాలని మహారాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతాం. దీనివల్ల మహారాష్ట్రలోని శివిని గ్రామానికి ఎలాంటి ముంపు సమస్య ఉండదు. భూములు నష్టపోయిన వారికి పరిహారం ఇచ్చేందుకు మేము సిద్ధంగా ఉన్నాం. ఈ ప్రాజెక్టు వల్ల రెండు రాష్ట్రాల్లోనూ భూగర్భ జలాలు పెరుగుతాయి. తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలు మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించేందుకు కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రాణహిత ప్రాజెక్ట్ మరుగున పడటానికి కారణం మాజీ సీఎం కేసీఆర్ అని మంత్రి వివేక్ వెంకట స్వామి ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌తో రూ.లక్ష కోట్లు దోచుకున్నారన్నారు. ప్రాణహిత ప్రాజెక్ట్ కూడా నిర్మిస్తామని ఈ ప్రాంత ప్రజలను మభ్యపెట్టారని వ్యాఖ్యానించారు. ప్రాజెక్ట్ నిర్మాణం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని తెలిపారు. తెలంగాణ బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలు కూడా సహకరించాలని మంత్రి వివేక్ కోరారు.

# పర్షియన్ గల్ఫ్‌లో చిక్కుకున్న నౌకలు

### దాదాపు 1,500 నౌకలు ఆగిపోయినట్లు యూఎన్

### ఇంటర్నేషనల్ మారిటైమ్ ఆర్గనైజేషన్ చీఫ్ వెల్లడి

టెహ్రాన్(జనంసాక్షి):ఇరాన్, అమెరికా – ఇజ్రాయెల్ సైనిక ఘర్షణ వల్ల పెద్ద సంఖ్యలో వాణిజ్య నౌకలు, ఆయిల్ ట్యాంకర్లు గల్ఫ్ దేశాల్లో చిక్కుకుపోయాయి. వీటిలో చాలావరకు నౌకలు, ట్యాంకర్లు పర్షియన్ గల్ఫ్‌లోనే ఉన్నాయి. దాదాపు 1,500 నౌకలు ఆగిపోయినట్లు యూఎన్ ఇంటర్నేషనల్ మారిటైమ్ ఆర్గనైజేషన్ చీఫ్ వెల్లడించారు. వాటిలో 20,000 మంది నావికులు ఉన్నట్లు తెలిపారు. రెండు నెలలకు పైగా వారు అందులోనే చిక్కుకుపోయారన్నారు. పర్షియన్ గల్ఫ్, గల్ఫ్ ఆఫ్ ఒమన్ ప్రాంతాల్లో ఇప్పటివరకు 30 నౌకలపై దాడులు జరగ్గా.. 10 మంది సెయిలర్లు మరణించినట్లు పేర్కొన్నారు. మరిన్ని ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే కొంతకాలం పాటు గల్ఫ్ దేశాలకు నౌకలను పంపకుండా ఉండాలని ఐఎంవో అధిపతి ప్రపంచ దేశాలకు సూచించారు. కాగా హర్మూజ్‌లో చిక్కుకుపోయిన నౌకలను సురక్షితంగా తరలించేందుకు చేపట్టిన నావికాదళ ఆపరేషన్‌ను అమెరికా తాత్కాలికంగా నిలిపివేసిన సంగతి తెలిసిందే. తమ గగనతలాన్ని ఉపయోగించుకునేందుకు సౌదీఅరేబియా ప్రభుత్వం నిరాకరించడంతోనే అగ్రరాజ్యం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.



# 'సర్' కుట్రలు తెలంగాణలో సాగనివ్వం

జాబ్స్‌కు డిమాండ్ ఎక్కువగా ఉందన్న సీఎం, అమెరికా కంటే జర్మనీ, జపాన్‌లో ఎక్కువ ఉద్యోగావకాశాలు ఉన్నాయన్నారు. అందుకే ఐటీఐలను ఏటీసీలుగా అప్‌గ్రేడ్ చేసి యువతకు నైపుణ్య శిక్షణ అందిస్తున్నామని సీఎం చెప్పారు. హైదరాబాద్‌లో చాలా మంది మైనారిటీలు ఆటోలు నడుపుతున్నారని, ఓఆర్ఆర్ లోపల ఉన్న అన్ని ఆటోలను ఉచితంగా ఈవీ ఆటోలుగా మార్చాలని నిర్ణయించినట్లు తెలిపారు. తమకు హిందూ, ముస్లిం బేధాభిప్రాయం లేదని, హిందూ, ముస్లిం భాయీభాయీ అని సీఎం అన్నారు. కార్యక్రమంలో మంత్రి అజారుద్దీన్, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ తదితరులు పాల్గొన్నారు.అంతకుముందు మైనారిటీ సంక్షేమ శాఖపై సచివాలయంలో సమీక్ష నిర్వహించిన సీఎం, ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో మైనార్టీలకు ప్రత్యేక డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేసి, వాటిలో నైపుణాభివృద్ధి, ఏఐ శిక్షణకు ప్రాధాన్యమివ్వాలని అధికారులను ఆదేశించారు. సంప్రదాయ కోర్సులు కాకుండా, జీవనోపాధికి ఉపయోగపడే శిక్షణ ఇప్పించాలన్నారు. ప్రతిభావంతులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల తరహాలోనే మైనారిటీలకూ ప్రోత్సాహకాలు ఇచ్చేందుకు ప్రత్యేకంగా ఒక కార్యక్రమం ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. ఆ కార్యక్రమానికి గ్రూప్స్‌నకు ఎంపికైన వారిని, క్రీడాకారులను ఆహ్వానించి విద్యా, క్రీడల ప్రాధాన్యతను తెలియజేయాలని సూచించారు. గ్రూప్–1, గ్రూప్–2, గ్రూప్–3కి ఎంపికైన మైనారిటీల్లో ఆసక్తి ఉన్న వారికి మైనారిటీ సంక్షేమ శాఖలో బాధ్యతలు అప్పగించి, ఆ శాఖ పరిధిలోని అన్ని కార్యక్రమాలపై పూర్తి అవగాహన కలిగించేలా వారిని తీర్చిదిద్దాలని సీఎం ఆదేశించారు. ఇమామ్, మౌజమ్‌లకు ఇచ్చే గౌరవ పారితోషికాలను క్రమం తప్పకుండా విడుదల చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. మైనారిటీ పాఠశాలల్లో బోధనలో ఏఐకి ప్రాధాన్యమివ్వాలని సూచించారు. భూమి అందుబాటులో ఉన్న చోట ఖబరస్తాన్‌లకు కేటాయిస్తామని సీఎం తెలిపారు. డీజిల్, పెట్రోల్ ఆటోలను ఎలక్ట్రిక్ ఇంజిన్లతో రీట్రోఫిట్టింగ్ చేయడం ద్వారా ఆటోడ్రైవర్లకు ఇంధన ఖర్చులు లేకుండా చేసి, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచే లక్ష్యంతో ప్రణాళిక రూపొందిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.మూసీ రివర్ ఫ్రంట్‌లో భాగంగా గుడితో పాటు మసీద్, చర్చి, గురుద్వారా నిర్మాణాలు చేపట్టాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఆయా మతాల సంస్కృతుల అధ్యయనం, భారత దేశ విశిష్టతను, తెలంగాణలోని గంగా జమునా తెహ్‌జీబ్‌ను తెలియజేసేలా ఆ కట్టడాలు ఉండాలని సీఎం అన్నారు. మన సంస్కృతులను అధ్యయనం చేసే గొప్ప కేంద్రాలుగా ఉండాలని ఆకాంక్షించారు. సమీక్షలో మంత్రి అజారుద్దీన్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సీఎస్ రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## దేశంలోని గొప్ప పరిశ్రమలన్నీ కొడంగల్‌కు తీసుకొస్తున్నాం



**కొడంగల్(జనంసాక్షి):** దేశం మొత్తం కొడంగల్ వైపు చూసేలా అభివృద్ధి చేస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కొడంగల్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా మారుస్తామని ఉద్ఘాటించారు. అందరి సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడుపుతున్నామని తెలిపారు. పేదల సంక్షేమం కోసం తాము పనిచేస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని వివరించారు. శుక్రవారం వికారాబాద్ జిల్లాలోని సొంత నియోజకవర్గం కొడంగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు. 430 పడకల ఆస్పత్రి నిర్మాణం, దౌల్తాబాద్ వేంకటేశ్వర ఆలయం, కోస్గి వేణుగోపాలస్వామి ఆలయాల అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, వాకిటి శ్రీహరి, పలువురు నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. పేదల తిరుపతిగా పేరు గాంచిన కొడంగల్ శ్రీ మహలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణం చేయటం అదృష్టమని చెప్పుకొచ్చారు. తెలంగాణ పేదల తిరుపతిగా ఈ ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఓవైపు గుడి.. మరోవైపు గడి ఏకమైన ఈ నియోజకవర్గాన్ని నందనవనంగా మార్చటానికి అందరు కలిసి రావటం అభినందనీయమని తెలిపారు. ఆగమశాస్త్ర పండితుడు సుందరవరదాచార్యులు కలలుగన్న గుడి నిర్మాణం సహకారం కావటం సంతోషమని చెప్పారు. తిరుపతిలో ఏ రకమైన పూజలు జరుగుతాయో ఇక్కడ అలాగే పూజలు జరుగుతాయని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ గుడికి కర్ణాటక, మహరాష్ట్ర నుంచి భక్తులు వస్తారని.. దీంతో కొడంగల్‌కు దేశంలో గుర్తింపు వస్తోందని తెలిపారు. కొడంగల్–నారాయణపేట ఎత్తిపోతల పథకానికి భూసేకరణ పూర్తయిందని తెలిపారు ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి నిధుల కొరత లేదన్నారు. ఈ ఎత్తిపోతల పథకానికి భూసేకరణ పూర్తయిందని.. అనుమతులు వచ్చాయని, ఏడాదిన్నరలోపు పూర్తి చేద్దామని చెప్పుకొచ్చారు. కృష్ణానదీ జలాలతో కొడంగల్ భూములు తడవాలన్నారు. కృష్ణా జలాలు ఇక్కడికి వచ్చే వరకు జిల్లా ఇన్చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ, మంత్రి శ్రీహరిని నిద్ర పోనీయొద్దని స్థానిక నేతలకు సూచించారు. కొడంగల్ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఈ నియోజకవర్గానికి ఇప్పటి వరకు ఒక్కసారి కూడా మంత్రి పదవి దక్కలేదని, ఇప్పుడు కొడంగల్ ఎమ్మెల్యేనైన తనకు సీఎం పదవి దక్కిందన్నారు. కొడంగల్ నుంచే దౌల్తాబాద్, కోస్గి ఆలయాల అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు.కృష్ణ– వికారాబాద్ రైల్వేలైన్ త్వరలో పూర్తవుతుందని స్పష్టం చేశారు. రేకులపాడు ప్రాంతంలో సిమెంట్ పరిశ్రమలను ఆరు నెలల్లో ఏర్పాటు చేసి ఉపాధి కల్పిస్తామని అన్నారు. 20 ఎకరాల్లో లగచర్ల వద్ద విద్యాహబ్‌గా మార్చుతున్నామని సీఎం ఉద్ఘాటించారు.

# మూసీ తొలిదశకు లైన్‌క్లియర్

భాగస్వామ్యంతోనే అమలు చేస్తామని కేబినెట్ సబ్ కమిటీ స్పష్టం చేసింది. అభివృద్ధి పేరుతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, ప్రజల ఆస్తులకు నష్టం లేకుండా ప్రాజెక్టును రూపొందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు అలైన్‌మెంట్ మార్పులు చేసి నిర్మాణాలపై ప్రభావం తగ్గించేలా ప్రణాళికలు సిద్ధం చేయనున్నారు. హిమాయత్ సాగర్ నుంచి బాపుఘాట్ వరకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. తొలి 5 కిలోమీటర్ల పనులను వెంటనే ప్రారంభించాలని అధికారులను కేబినెట్ సబ్ కమిటీ ఆదేశించింది. నదిలోని చెత్తను తొలగించి, రివర్ బెడ్ ప్రొఫైలింగ్‌ను ప్రభుత్వం చేపట్టనుంది. వరద నియంత్రణకు రిటైనింగ్ వాల్స్‌ను నిర్మించనున్నారు. మూసీ రెండు వైపులా రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం, నీటి నిల్వ కోసం బ్యారేజీలు, రివర్ ఫ్రంట్ అభివృద్ధి వంటి పనులు చేపట్టనున్నారు. నార్సింగి నుంచి గౌరెల్లి వరకు 55 కి.మీ. ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఉప్పల్ భగాయత్ నుంచి గౌరెల్లి వరకు విస్తరణకు డీపీఆర్‌ను తయారీకి నిర్ణయం తీసుకున్నారు. ప్రాజెక్టు వివరాలను నగరవ్యాప్తంగా ప్రచారం చేయాలని సబ్ కమిటీ ఆదేశించింది. బస్టాండ్లు, ప్రధాన రోడ్లు, థియేటర్లలో ప్రచార వీడియోలు ప్రదర్శించనున్నారు. 2026 ఆగస్టు నాటికి పనులు ప్రారంభించడం లక్ష్యంగా నిర్ణయించారు. డిసెంబర్ 2027 నాటికి ప్రాజెక్టును పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రాజెక్ట్ సాంకేతిక పర్యవేక్షణకు సహకారం తీసుకోనున్నారు. నిర్మాణాలపై ప్రభావం లేని 5.కి.మీ మేర పనులు ప్రారంభించాలని మంత్రివర్గ ఉపసంఘం అధికారులను ఆదేశించింది. నిర్మాణాలపై తక్కువ ప్రభావం పడేలా అలైన్‌మెంట్ మార్చాలని మంత్రులు సూచించారు. మూసీ ప్రాజెక్టు పనులను ఈ ఏడాది ఆగస్టులో ప్రారంభించి 2027 డిసెంబర్ నాటికి పూర్తిచేయాలని అధికారులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు.

# రాష్ట్రంలో శాంతిభద్రతలు దారుణంగా క్షీణించాయి

రాజకీయ కక్షసాధింపులు, ప్రతిపక్ష నాయకులను వేధించడం కోసమే మళ్లించడం వల్లనే, ప్రజల రక్షణ, భద్రత గాలిలో కలిసిపోయిందని విమర్శించారు. శాంతిభద్రతల క్షీణతపై బీఆర్ఎస్ ప్రతినిధి బృందం డీజీపీని కలిసి ఫిర్యాదు చేస్తున్న సమయంలోనే అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండే హైదరాబాద్‌లోని ప్రశాసన్ నగర్‌లో రిటైర్డ్ డీజీ ర్యాంక్ ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్ రాయ్ భార్య అత్యంత దారుణంగా హత్యకు గురైన వార్త రావడం దిగ్భ్రాంతికరమని పేర్కొన్నారు. అంతేకాకుండా, నిన్న రాత్రి సికింద్రాబాద్‌లో నడిరోడ్డుపై ఒక యువకుడిని అతి దారుణంగా కత్తితో పొడిచి చంపిన ఘటన నగరాన్ని ఉలిక్కిపడేలా చేసిందని, ఇది సామాన్య పౌరుల్లో పెరుగుతున్న అభద్రతా భావానికి అద్దం పడుతోందని స్పష్టం చేశారు. నేరాల నివారణ, ప్రజా భద్రతపై దృష్టి పెట్టాల్సిన పోలీస్, ఇంటెలిజెన్స్ వ్యవస్థలను కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ తీరును విమర్శించే సోషల్ మీడియా గొంతులపై అక్రమ కేసులు బనాయించేందుకు వాడుకుంటోందని ఆరోపించారు.

# మా ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలి

అంతర్జాతీయ మీడియాలో వార్తలు వచ్చాయి. సరకు వివ రాలు, యాజమాన్యం, సిబ్బం ది జాతీయత వంటి ప్రశ్నలు అడుగుతోంది. ఈ కొత్త నిబంధనలను ఎవరైనా ఉల్లంఘిస్తే.. డ్రోన్, క్షిపణి దాడుల్ని ఎదుర్కోవాల్సి వస్తుందని, ఆ నౌకలను స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించింది. ఫిబ్రవరి 28న ఘర్షణలు ప్రారంభమైన తర్వాత నుంచి హర్మూజ్‌కు కొత్త నిబంధనలు తీసుకొస్తామని ఇరాన్ హెచ్చరిస్తోంది. అన్నట్టుగానే పీజీఎస్ఏ ఏర్పాటుచేయడాన్ని టెహ్రాన్ తీసుకున్న ప్రధాన చర్య అని విశ్లేషణలు వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటివరకు అంతర్జాతీయ రవాణామార్గ నియమాల ఆధారంగా హర్మూజ్ జలసంధిలో రాకపోకలు నడిచేవి. ఇరాన్ నిబంధనల ప్రకారం.. నౌకలకు సంబంధించిన గుర్తింపు నంబర్లు, వాటి మునుపటి పేర్లు వంటి వివరాలను పీజీఎస్ఏకు మెయిల్ చేయాల్సిఉంది.ఈ పర్యవేక్షణతో పాటు భారీగా టోల్ ఫీజ్‌ను విధించడం ప్రారంభించిందని కొన్ని నివేదికలు పేర్కొంటున్నాయి. నౌకల సురక్షిత ప్రయాణానికి రూ.18 కోట్ల వరకు వసూలుచేస్తున్నట్లు తెలుస్తోంది. హర్మూజ్‌లో ఉద్రికత్తలు అంతర్జాతీయ ఇంధన సంక్షోభానికి దారితీస్తున్నాయి. ఈ యుద్ధం ప్రారంభం కావడానికి ముందు జలసంధి మీదుగా రోజుకు 120 నౌకలు వెళ్లేవి. మే నెలలో ఆ సంఖ్య 40కి పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది.

## విజయ్‌కు గరవ్నర్ ఆహ్వానం

# అంతులేని కథ


కార్యాలయాలకు వెళ్లారు. తనకు మద్దతు ప్రకటించిన ఉభయ కమ్యూ నిస్టు పార్టీల నేతలకు కృతజ్ఞతలు చెప్పారు.మరోవైపు, ఇప్పటికే టీవీకేకు కాంగ్రెస్ మద్దతు ప్రకటించగా.. తాజాగా సీపీఎం, సీపీఐ, వీసీకే సమ్మతి తెలపడంతో విజయ్ సారథ్యంలో ప్రభుత్వం కొలువు దీరేందుకు రంగం సిద్ధమవుతోంది. పార్టీల వారీగా సం ఖ్యాబలాలు పరిశీలిస్తే.. టీవీకే : 107; కాంగ్రెస్ : 5; సీపీఐ : 2; సీపీఎం : 2; వీసీకే : 2.

**బయటి నుంచే మద్దతు..** మంత్రివర్గంలో చేరం: లెఫ్ట్ టీవీకేకు బయట నుంచే తాము మద్దతిస్తామని.. ప్రభుత్వంలో చేరబోమని సీపీఎం నేత యు.వాసుకి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. "సీపీఐ, సీపీఎం రాష్ట్ర కమిటీలు ఈ రోజు సమావేశమయ్యాయి. టీవీకే ప్రభుత్వ ఏర్పాటుకు బయటి నుంచే మద్దతు ఇవ్వాలని నిర్ణయించు కున్నాయి. అసెంబ్లీలో బల పరీక్ష సమయంలో టీవీకేకు మద్దతుగానే కచ్చితంగా ఓటు వేస్తాం. కానీ, మంత్రివ ర్గంలో మాత్రం చేరం. ఇది కేవలం బయటి నుంచి మద్దతే. వామపక్షాలు ఏ నిర్ణయం తీసుకున్నా దానికి కట్టుబడి ఉంటామని వీసీకే సైతం చెప్పింది. అందువల్ల వారు కూడా అదే తరహాలో వ్యవహరిస్తారని ఆశిస్తు న్నాం. ప్రజలు టీవీకేకు అధిక మెజార్టీ ఇచ్చారు.. వారి విశ్వాసం మేరకు ప్రభుత్వ ఏర్పాటు కోసమే మేం మ ద్దతు తెలుపుతున్నాం. ప్రజా సమస్యల ఆధారంగానే మేం స్వతంత్రంగా వ్యవహరించి పనిచేస్తాం. లౌకికవాదం, ప్రజల ఐక్యత, రాష్ట్రాల హక్కులు.. ఏ అంశమైనా సరే ప్రస్తావనకు వచ్చినప్పుడు మాతో కలిసొచ్చే ఏ లౌకిక పార్టీతోనైనా కలిసి నడుస్తాం" అని తెలిపారు.

# ఇండియా కూటమికి డీఎంకే గుడ్‌బై

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఇండీ కూటమికి డీఎంకే గుడ్‌బై చెప్పింది. ఇక కాంగ్రెస్‌తో తమ పొత్తు ముగిసినట్లు వెల్లడించింది. తమకు లోక్‌సభలో ప్రత్యేక సీట్లు కేటాయించాలని స్పీకర్‌కు డీఎంకే ఎంపీ కనిమొళి తాజాగా లేఖ రాశారు. కాంగ్రెస్ ఎంపీల పక్కన కూర్చోలేమని అందులో పేర్కొన్నారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత టీవీకేకు కాంగ్రెస్ మద్దతు తెలపడంతో డీఎంకే ఈ నిర్ణయం తీసుకుంది.తమిళనాడులో విజయ్ నేతృత్వంలోని టీవీకేకు కాంగ్రెస్ మద్దతు ప్రకటించడంపై డీఎంకే ఎమ్మెల్యేలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి నుంచి ఆ పార్టీ వైదొలగడాన్ని ఖండించారు. కూటమికి కాంగ్రెస్ వెన్నుపోటు పొడిచి ద్రోహం చేసిందని.. పాత రాజకీయ స్వభావాన్ని ఆ పార్టీ మార్చుకోలేదని ఆక్షేపించారు. కూటమి వల్లే కాంగ్రెస్‌కు రాజ్యసభ ఎంపీ, అసెంబ్లీ సీట్లు వచ్చాయన్నారు. కాంగ్రెస్ ద్రోహాన్ని అధిగమించి బలమైన ప్రతిపక్షంగా వ్యవహరించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ నిర్ణయాన్ని ఉత్తర్‌ప్రదేశ్‌లోని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ సైతం వ్యతిరేకించారు.

# బెంగాల్ సీఎంగా సువేందు..



కోల్‌కతా(జనంసాక్షి):భాజపా శాసనసభాపక్ష నేతగా సువేందు అధికారి ఎన్నికయ్యారు. కోల్‌కతాలో అమిత్‌షా సమక్షంలో భాజపా శాసనసభాపక్ష సమావేశం జరిగింది. సమావేశం అనంతరం సువేందును బెంగాల్ కొత్త ముఖ్యమంత్రిగా అమిత్ షా ప్రకటించారు. రేపు బెంగాల్‌లో కొత్త ప్రభుత్వం కొలువుదీరనున్నట్లు తెలుస్తోంది. ప్రమాణస్వీకార కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్‌షా, ఇతర కేంద్ర మంత్రులు హాజరయ్యే అవకాశం ఉంది.సువేందు 1970 డిసెంబరు 15న తూర్పు మేదినీపుర్‌లోని కర్కులీలో జన్మించారు. ఎంఏ చదివారు. ఆయనది రాజకీయ నేపథ్యమున్న కుటుంబం. తండ్రి సిసిర్ అధికారి ఎమ్మెల్యేగా, ఎంపీగా పనిచేశారు. యూపీఏ హయాంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయమంత్రిగానూ ఉన్నారు. సువేందు 1995లో తొలిసారి కాంగ్రెస్ నుంచి కౌన్సిలర్‌గా గెలిచారు. 1998లో తండ్రితో కలిసి టీఎంసీలో చేరారు. సువేందు 2006–09 మధ్య రాజకీయాల్లో బాగా ఎదిగారు. 2006లో తొలిసారి కొంటాయి (దక్షిణ) నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలిచారు. అదే ఏడాది కొంటాయి మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్‌గానూ బాధ్యతలు చేపట్టి.. మూడేళ్లు ఆ పదవిలో కొనసాగారు. సువేందు రాజకీయ జీవితంలో 2007 నాటి నందిగ్రామ్ ఉద్యమానిది ప్రత్యేక పాత్ర. నందిగ్రామ్‌లో 10 వేల ఎకరాలు సమీకరించి సెజ్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్రంలోని అప్పటి వామపక్ష ప్రభుత్వం భావించింది. దానికి వ్యతిరేకంగా తృణమూల్ పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టింది. వాటిని సువేందు ముందుండి నడిపించారు. నందిగ్రామ్ ఉద్యమం విజయవంతం కావడంతో.. జంగల్ మహల్ (పశ్చిమ మేదినీపుర్, పురూలియా, బాంకురా జిల్లాలు) ప్రాంతానికి తృణమూల్ ఇంఛార్జిగా సువేందును మమత నియమించారు. మమతకు అత్యంత సన్నిహిత నేతల్లో ఒకరిగా ఎదిగారు. సువేందు 2009లో తమ్లుక్ స్థానం లోక్‌సభ ఎంపీగా గెలిచి జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశించారు. 2016లో నందిగ్రామ్ ఎమ్మెల్యేగా విజయం సాధించి.. మమత సర్కారులో మంత్రి పదవి చేపట్టారు.

**తృణమూల్ గూటిని వీడి..**

తృణమూల్ వ్యవస్థాపక సభ్యుడైన ముకుల్ రాయ్ 2017లో పార్టీని వీడారు. అప్పటి నుంచి తృణమూల్‌లో సువేందు ప్రభావం మరింత పెరిగింది. పార్టీలో మమత తర్వాత నంబర్–2 ఈయనేనని అంతా అనుకున్నారు. అయితే క్రమంగా పరిస్థితులు మారిపోయాయి. మమత తన మేనల్లుడు అభిషేక్ బెనర్జీకి పార్టీలో అధిక ప్రాధాన్యమివ్వడం, ఆయనకే పార్టీ పగ్గాలు అప్పగించేలా కనిపించడం సువేందుకు రుచించలేదు. అప్పటికే శారదా కుంభకోణంలో ఆరోపణలు రావడంతో కొంత ఉక్కిరిబిక్కిరయ్యారు. దీంతో 2020 చివర్లో అనూహ్యంగా తృణమూల్‌ను వీడి భాజపాలో చేరారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా తరఫున నందిగ్రామ్ నుంచి బరిలోకి దిగిన సువేందు.. మమతను ఓడించారు. అనంతరం రాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా వ్యవహరించారు. ఈ ఎన్నికల్లో భవానీపుర్‌లో మమతను మరోసారి ఓడించి, ఇప్పుడు ఏకంగా బెంగాల్ సీఎంగా బాధ్యతలు చేపట్టడానికి సిద్ధమయ్యారు.

# పుదుచ్చేరి ముఖ్యమంత్రిగా రంగసామి

యానాం(జనంసాక్షి):పుదుచ్చేరి ఎన్నార్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎన్.రంగసామి ముఖ్యమంత్రిగా ఈనెల 13న ప్రమాణస్వీకారం చేయనున్నారు. 30 సీట్లు ఉన్న పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల్లో 18 స్థానాలు గెలుచుకుని ఎన్డీయే కూటమి విజయం సాధించింది. ప్రభుత్వ ఏర్పాటుకు కేంద్రమంత్రి మాండవీయ, రంగసామి నేతృత్వంలో మిత్ర పక్ష నాయకులు, ఎమ్మెల్యేలు శుక్రవారం సమావేశమయ్యారు. పుదుచ్చేరి ఎన్డీయే కూటమి అధ్యక్షుడిగా ఎన్.రంగసామిని ఎన్నుకుని, తమ పార్టీల తరఫున ఆయనకు మద్దతు లేఖ అందజేశారు. అనంతరం లెఫ్టినెంట్ గవర్నర్ కైలాశ్‌నాథన్‌ను లోక్‌నివాస్‌లో కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని కూటమి నేతలు కోరారు. దీంతో ఈనెల 13న సీఎం రంగసామి ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఏర్పాట్లు మొదలయ్యాయి. మంత్రివర్గ సభ్యులు, ఇతర పదవులపై ఇంకా చర్చలు పూర్తికాలేదు. మంత్రుల ప్రమాణస్వీకారం మరో తేదీన జరపాలని నిర్ణయించారు.

**కేరళం సిఎం రేసులో కేసీ వేణుగోపాల్**

కేరళంలో కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ కూటమి విజయం సాధించడంతో ముఖ్యమంత్రి ఎంపికకు కసరత్తు జరుగుతోంది. ఈ రేసులో లోక్‌సభ ఎంపీ కేసీ వేణుగోపాల్ ముందున్నారని తెలుస్తోంది. ఈ మేరకు పార్టీ పరిశీలకులు అజయ్ మాకెన్, ముకుల్ వాస్నిక్‌లు తమ నివేదికను పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకు సమర్పించినట్లు పార్టీ వర్గాలు శుక్రవారంనాడు తెలిపాయి. పార్టీకి ఎన్నికైన ఎమ్మెల్యేలు, కూటమి భాగస్వాములు, ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకుని పార్టీ తుది నిర్ణయం తీసుకోనున్నట్టు తెలుస్తోంది. సీఎం అభ్యర్థుల రేసులో కేసీ వేణుగోపాల్‌తో పాటు గత అసెంబ్లీలో విపక్ష నేత వీడి సతీశన్, వెటన్ కాంగ్రెస్ నేత రమేష్ చెన్నితాల పోటీ పడ్డారు. అయితే పార్టీ అధిష్టానానికి అత్యంత విశ్వసనీయుడిగా పేరున్న 63 ఏళ్ల కేసీ వేణుగోపాల్ ముందు వరుసలో ఉన్నట్టు చెబుతున్నారు.

# మహనీయుల కలలు సాకారం చేస్తాం

కోల్‌కతా(జనంసాక్షి): సోనార్ బంగ్లా కలల సాకారానికి కొత్త ప్రభుత్వం పనిచేస్తుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా చెప్పారు. తృణమూల్ కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలను ఓడిస్తూ తీర్పునిచ్చిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. బెంగాల్ ఎన్నికల్లో పలు బెదిరింపుల, హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నప్పటికీ ప్రజలు బీజేపీపై విశ్వాసం ఉంచారని, తమ ప్రభుత్వం ఏర్పాటు కాగానే చొరబాటుదారులు, గోవుల అక్రమరవాణాకు పూర్తిగా కళ్లెం వేస్తామని స్పష్టం చేశారు. పశ్చిమబెంగాల్ బీజేపీ శాసనసభాపక్ష నేతగా సువేందు అధికారిని కేంద్రం హోం మంత్రి అమిత్‌షా శుక్రవారంనాడు ప్రకటించారు. 'కాబోయే సీఎం'గా సువేందును అభివర్ణించారు. 'సోనార్ బంగ్లా లక్ష్య సాధన దిశగా పనిచేయడం, బెంగాల్ ప్రజల అంచనాలను నిలబెట్టడం మన బీజేపీ కార్యకర్తలందరి బాధ్యత అన్నారు. కవిగురు రవీంద్రనాథ్ ఠాగూర్ కలలు గన్న భయంలేని, ఆత్మగౌరవంతో తలెత్తుకుని జీవించే బెంగాల్ వైపు నేడు మన ప్రయాణం సాగుతోంది' అని అమిత్‌షా అన్నారు. బెంగాల్ లెజిస్లేటివ్ పార్టీ నేత ఎన్నిక ప్రక్రియను పర్యవేక్షించేందుకు కేంద్ర పరిశీలకుడిగా అమిత్‌షా శుక్రవారంనాడు హాజరయ్యారు. ఈ సమావేశంలో సువేందు పేరు ప్రతిపాదనకు రాగా, కొత్తగా ఎంపికైన ఎమ్మెల్యేలు ఏకగ్రీవంగా ఆమోదించారు. దీంతో సువేందు అధికారిని బీజేపీ లెజిస్లేటివ్ పార్టీ నేతగా అమిత్‌షా ప్రకటించారు. ఈనెల 9వ తేదీన కోల్‌కతాలోని బ్రిగేట్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే కార్యక్రమంలో బీజేపీ ప్రభుత్వం ప్రమాణస్వీకారం చేయనుంది. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ... కమ్యూనిస్ట్ పాలన నుంచి బెంగాల్‌లో భయం, హింసాత్మక వాతావరణం ఉందని, ఇది ఆ తర్వాత తీవ్రంగా మారిందని అమిత్ షా ఆరోపించారు. ఇలాంటి పరిస్థితుల్లో బెంగాల్ ప్రజలు బీజేపీకి మద్దతుగా నిలిచారని అన్నారు. ప్రజలు ఆకాంక్షలకు అనుగుణంగా 'సోనార్ బంగ్లా' లక్ష్యంతో ముందుకు సాగుతామని చెప్పారు. బెంగాల్ భయం రహిత సమాజం దిశగా వెళ్తుందని అన్నారు. గత 5 దశాబ్దాలుగా బెంగాల్ శాంతిభద్రతలు, ప్రజాస్వామ్యం, ఆర్థిక వ్యవస్థ పరంగా తీవ్రమైన ప్రతికూల రాజకీయాలను చూసిందని.. బెంగాల్ ప్రజలకు ప్రధాని మోడీ ఇచ్చిన హామీలను నెరవేర్చడం ఇప్పుడు బీజేపీ బాధ్యత అని అన్నారు. బెంగాల్ సంస్కృతి, సంప్రదాయాలను బలోపేతం చేస్తూ, రామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద, శ్రీ అరబిందో, రవీంద్రనాథ్ ఠాగూర్ వంటి వారు కోరుకున్న బెంగాల్ రాష్ట్రాన్ని తీర్చిదిద్దు తామని అన్నారు. ఈ విజయం చాలా ముఖ్యమైందని, 1950లో ప్రారంభమైన సైద్ధాంతిక ప్రయాణం నేడు బెంగాల్‌కు చేరుకుందని, శ్యామా ప్రసాద్ ముఖర్జీ జన్మస్థలంలో బీజేపీ ప్రభుత్వం కొలువుదీరుతుండటం ఒక చారిత్రక ఘట్టమని చెప్పారు. 2014లో ప్రారంభమైన బీజేపీ ప్రస్థానం ఇప్పుడు గంగోత్రి నుంచి గంగాసాగర్ వరకు చేరిందని ఉత్తరాఖండ్ నుంచి బెంగాల్ వరకు బీజేపీ ప్రభుత్వాలే ఉన్నాయని చెప్పారు. ఈ విజయం కోసం 321 మంది బీజేపీ కార్యకర్తలు తమ ప్రాణాలను కోల్పోయారని, ఈ విజయం సులభంగా రాలేదని అమిత్ షా వెల్లడివంచారు. త్రిపుర, అస్సాం, బెంగాల్‌లలో బీజేపీ ప్రభుత్వాలు ఏర్పడటంతో సరిహద్దు భద్రతను మరింత పెరుగుతుందని, అక్రమ రవాణా, చొరబాట్లను కఠినంగా అణిచివేస్తామని ఆయన చెప్పారు. దేశవ్యాప్తంగా చొరబాటుదారుల్ని గుర్తించి వారిని తరిమివేసి, చొరబాటురహిత దేశంగా మారుస్తామని బీజేపీ హామీ ఇచ్చింది. మమతా బెనర్జీని ఆమె సొంత ఇంటిలో భవానీపూర్‌లో ఓడించి శక్తివంతమైన సందేశాన్ని పంపినట్లు అమిత్ షా చెప్పారు. ఈ విజయంతో బీజేపీపై మరింత బాధ్యత పెరిగిందని, ప్రభుత్వం ఏర్పడిన తర్వాత హింస, కక్షపూరిత రాజకీయాలకు తావు ఉండకూడదని కార్యకర్తల్ని కోరారు.

# నెల రోజుల్లో కృష్ణానగర్ వరదకు పరిష్కారం

- కాలువల్లో పూడిక తీత పనులు ముమ్మరం
- డీసిల్టింగ్ పనులను పరిశీలించిన హైడ్రా కమిషనర్



**హైదరాబాద్, మే 08 (జనంసాక్షి) :** ప్రతి ఏటా వరద ముప్పును ఎదుర్కొంటున్న కృష్ణానగర్ పరిసరాలకు ఈ ఏడాది ఉపసమనం కలిగేలా చర్యలు తీసుకుంటున్నామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. పైనుంచి భారీ మొత్తంలో వచ్చిన వరద సాఫీగా సాగేలా కాలువల్లో పూడిక తీత పనులను ముమ్మరం చేశామన్నారు. స్థానిక ఎమ్మెల్యే నవీన్ యాదవ్, జీహెచ్ ఎంసీ కమిషనర్ ఆర్ వీ కర్ణన్ తో కలిసి కృష్ణానగర్‌లో పూడిక తీత పనులను హైడ్రా కమిషనర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కృష్ణానగర్‌లో దాదాపు ఒకటిన్నర కిలోమీటర్లున్న వరద కాలువను పూర్తిగా అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ నాలాల్లో పూడికత తీత పనుల్లో జీహెచ్ ఎంసీతో హైడ్రా భాగస్వామ్యమైందన్నారు. కృష్ణానగర్ వరద ముప్పు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఎగువ ప్రాంతాలైన జూబ్లీహిల్స్, వెంకటగిరి నుంచి వరదతో పాటు వచ్చిన మట్టి కృష్ణానగర్ వరద కాలువల్లో పేరుకుపోవడంతో సమస్య తలెత్తుతోందన్నారు. స్థానిక ఎమ్మెల్యేగారు ప్రత్యామ్నాయంగా వరద కాలువ నిర్మాణానికి కూడా చర్యలు తీసుకుంటున్నారని ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ తెలిపారు.

## అవసరమైన మేరకు స్లాబ్‌లను తొలగిస్తాం..

ఆరేడు అడుగుల మేర పూడిక పేరుకుపోవడంతో కాలువలు దాటి వరద రహదారులను ముంచెత్తుతోందని హైడ్రా కమిషనర్ తెలిపారు. 8 నుంచి 9 అడుగుల లోతులో ఉన్న వరద కాలువల్లో పూడికను తొలగించడానికి వీలు లేని పరిస్థితులున్నాయని కమిషనర్ చెప్పారు. అవసరమైన మేరకు స్లాబులను తొలగించి పూడికను పూర్తి స్థాయిలో తొలగిస్తామన్నారు. ఒకటి రెండు ఇళ్లు కూడా పూర్తిగా నాలాపై నిర్మించినట్టు గుర్తించామని.. తొలగించక తప్పనిసరి పరిస్థితి ఉంటేనే చర్యలు తీసుకుంటామన్నారు. ఖాళీ చేయాలంటూ నోటీసులు ఇచ్చి.. తగిన సమయం కూడా ఇస్తామన్నారు.

## మీ ప్రాంతాల్లో మైనింగ్ జరుగుతోందా..?

### సమాచారం ఇవ్వండి

మీ ప్రాంతాల్లో మైనింగ్ జరుగుతోందా..? కొండలను పిండి చేస్తున్న క్రషర్లు పని చేస్తున్నాయా..? ఆర్ ఎం సీ(రెడీ మిక్స్ కాంక్రీట్) ప్లాట్లు దుమ్ము రేపుతున్నాయా..? పర్యావరణానికి ఇవన్నీ తూట్లు పొడుస్తున్నాయా..? అయితే ఆ సమాచారం హైడ్రా 9000113667కు అందజేయాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో నగర ప్రజలను కోరారు. ఓఆర్‌ఆర్‌కు లోపల, బయట 1 కిలోమీటరు పరిధిలో ఆర్‌ఎంసీ, క్రషర్లు పని చేస్తున్నా వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు. కరెంటు లొకేషన్‌తో పాటు.. అక్కడి ఫొటోలు వాట్సాప్‌లో షేర్ చేసి సమాచారం ఇస్తే.. వాటి అనుమతులను పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

# వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి

- అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని ఆంక్షలు లేకుండా కొనుగోలు చేయాలి
- తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి



**హైదరాబాద్ (జనంసాక్షి) :** వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న జాప్యాన్ని నివారించి వెంటనే కోనుగోళ్ళ ప్రక్రియను వేగవంతం చేయాలనీ, అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని ఏలాంటి ఆంక్షలు లేకుండా తక్షణమే కొనుగోలు చేయాలని తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సకాలంలో గన్నీ సంచులను, లారీలను, హమాలీలను సమకూర్చడంలో జరుగుతున్న జాప్యం కారణంగా రైతులు వరి ధాన్యం రాశుల కుప్పల వద్ద పడిగాపులు కాస్తున్నందున జాప్యాన్ని నివారించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసేందుకు అధికారులు తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. వరి ధాన్యం తూకం వేసిన వెంటనే రైతులకు తక్ పట్టి కొనుగోలు రసీదును తప్పనిసరిగా ఇచ్చేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. తప్ప, తాలు పేరిట తరుగును తీస్తూ రైతులను నిట్టనిలువునా దోపిడీకి గురి చేస్తున్న రైస్ మిల్లర్లపై తగు కఠిన చర్యలు తీసుకోవాల న్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యం పంట అకాల వర్షాల కారణంగా కొనుగోలు కేంద్రాల్లో నీటిపాలు కావడంతో రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారనీ, కొనుగోలు కేంద్రాల్లో తడిసిన, రంగు మారిన వరి ధాన్యాన్ని తరుగు లేకుండా ఎలాంటి ఆంక్షలు విధించకుండా పూర్తిగా కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అధికార యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేసి రైతులను ఆదుకోవాలని తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.



# రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాం

- పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ

**లక్షెట్టిపేట, మే 8 (జనం సాక్షి) :** రాష్ట్రంలోని రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని, రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ అన్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షాల కారణంగా జరిగిన ప్రమాదంలో గోడ కూలి రైతులకు మృతి చెందగా ఆ ప్రదేశాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, లక్షెట్టిపేట తహసిల్దార్ దిలీప్ కుమార్, డి సి సి ప్రతినిధి రఘునాథ్ రెడ్డి, అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వం రైతు సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తుందని తెలిపారు. అకాల వర్షం కారణంగా లక్షెట్టిపేట మండలం కొత్తూరు లోని కొనుగోలు కేంద్రంలో జరిగిన ప్రమాదంలో రైతులు మృతి చెందడం బాధాకరమని తెలిపారు. రైతు సమస్యల పరిష్కారంలో భాగంగా రవాణా ప్రక్రియలో లారీ సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని, కొత్తూరు కొనుగోలు కేంద్రానికి సంబంధించిన ధాన్యాన్ని నెల్కివెంకటాపూర్ లోని గోదాముకు తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. అకాల వర్షం కారణంగా ప్రమాదంలో మృతి చెందిన కొత్తూరు గ్రామానికి చెందిన వెంకటేష్, గంపలపల్లి గ్రామంలోని ఒకే కుటుంబానికి చెందిన తండ్రి కొడుకులు తనుగుల నాగరాజు, అభిరామ్ కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం దండేపల్లి మండలం ముత్యంపేట గ్రామానికి చెందిన నెల్కి లచ్చన్న కుటుంబాన్ని జిల్లా కలెక్టర్, దండేపల్లి మండల తహసిల్దార్ రోహిత్ దేశ్ పాండే లతో కలిసి పరామర్శించి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, లక్షెట్టిపేట మండల తహసిల్దార్ దిలీప్ కుమార్ తో కలిసి మండలంలోని మిట్టపల్లి లో గల శ్రీరామకృష్ణ ట్రేడర్స్ రైస్ మిల్లును సందర్శించి అక్కడ నెలకొన్న లారీ ధాన్యం దిగుమతి, హమాలీల సమస్యను పరిష్కరించే దిశగా వారితో సమీక్షించారు. ప్రభుత్వం లారీలతో పాటు ట్రాక్టర్ల ద్వారా ధాన్యం రవాణాకు అవకాశం కల్పించిందని, లారీల నిర్వాహకులు సహకరించాలని, ధాన్యం దిగుమతి ప్రక్రియ వేగవంతంగా జరిగేలా హమాలీలు కలిసి రావాలని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతకు చిరునామా..
# జిల్లా మహిళా సమాఖ్య భవనాలు

- జూన్ 2న రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభానికి ఏర్పాట్లు
- 22 జిల్లాల్లో నిర్మాణాలు.. 17 జిల్లాల్లో పనులు పూర్తి
- ఒక్కో భవనం రూ.5 కోట్లతో.. అత్యాధునిక సదుపాయాలతో నిర్మాణం




**హైదరాబాద్ (జనంసాక్షి) :** గ్రామీణ మహిళల ఆర్థిక, సామాజిక సాధికారతకు బలమైన వేదికగా నిలిచే జిల్లా మహిళా సమాఖ్య భవనాలు తెలంగాణలో రూపుదిద్దుకుంటున్నాయి. మహిళా సంఘాల కార్యకలాపాలను మరింత బలోపేతం చేయడం, స్వయం సహాయక సంఘాల మహిళలకు శాశ్వత వేదిక కల్పించడం, మహిళా ఆర్థిక వ్యవస్థను గ్రామీణ స్థాయిలో మరింత విస్తరించడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ భవనాలను నిర్మిస్తోంది. తెలంగాణ ఆడబిడ్డల ఆర్థిక ప్రగతికి చిరునామాగా నిలిచేలా జిల్లా మహిళా సమాఖ్య భవనాలు సిద్ధమవుతున్నాయి. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జూన్ 2న ఈ భవనాల ప్రారంభానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్రంలోని మొత్తం 22 జిల్లాల్లో జిల్లా మహిళా సమాఖ్య భవనాల నిర్మాణ పనులు చేపట్టగా, ఇప్పటికే 17 జిల్లాల్లో పనులు తుది దశకు చేరుకున్నాయి. ఒక్కో భవనాన్ని సుమారు రూ.5 కోట్ల వ్యయంతో, 15 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆధునిక నమూనాలో నిర్మిస్తున్నారు. శాఖ స్పెషల్ సీఎస్ దానకిశోర్, కమీషనర్ దివ్యా దేవరాజన్ ఆదేశాలతో తెలంగాణ పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ఇంజనీరింగ్ అధికారులు ఎప్పటికప్పుడు జిల్లాల్లో పర్యటిస్తూ పనులను పరుగులు పెట్టిస్తున్నారు. ఇప్పటి వరకు మహిళా సంఘాలకు స్థిరమైన కార్యాలయాలు లేకపోవడంతో సమావేశాలు, శిక్షణా కార్యక్రమాలు, ఉత్పత్తుల ప్రదర్శనలు నిర్వహించడంలో ఇబ్బందులు ఎదురయ్యేవి. ఇప్పుడు నిర్మాణం పూర్తవుతున్న ఈ సమాఖ్య భవనాలు మహిళా సంఘాలకు ఒక శాశ్వత కేంద్రంగా మారనున్నాయి. జిల్లా స్థాయిలో మహిళా సంఘాల పరిపాలనా వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు, గ్రామీణ మహిళలకు ఉపాధి, వ్యాపార, మార్కెటింగ్ అవకాశాలు కల్పించే కేంద్రాలుగా ఇవి పనిచేయనున్నాయి. ఈ భవనాల్లో మహిళలకు నైపుణ్యాభివృద్ధి శిక్షణలు, డిజిటల్ లిటరసీ కార్యక్రమాలు, బ్యాంకింగ్, ఆర్థిక నిర్వహణపై అవగాహన కార్యక్రమాలు, స్వయం ఉపాధి మార్గదర్శక శిక్షణలు నిర్వహించేందుకు ప్రత్యేక వసతులు కల్పిస్తున్నారు. మహిళా సంఘాలు తయారు చేసే ఉత్పత్తులను ప్రదర్శించి విక్రయించేందుకు ఎగ్జిబిషన్ హాళ్ల, మార్కెటింగ్ సపోర్ట్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. అదేవిధంగా సమావేశ హాళ్లు, శిక్షణా కేంద్రాలు, కార్యాలయ గదులు, సకల సదుపాయాలతో కూడిన ఆధునిక నిర్మాణాలుగా ఈ భవనాలను అభివృద్ధి చేస్తున్నారు. గ్రామీణ మహిళలు ఒకే వేదికపై చేరి తమ సమస్యలను చర్చించుకోవడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన పెంపొందించుకోవడం, కొత్త ఉపాధి అవకాశాలను అన్వేషించడం, సంఘాల నిర్వహణలో నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవడం వంటి అనేక అంశాలకు ఈ భవనాలు కేంద్ర బిందువులుగా నిలవనున్నాయి. ముఖ్యంగా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు మార్కెట్ కల్పించడం ద్వారా మహిళల ఆదాయ వనరులు పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. మహిళా సంఘాల ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయాలనే ప్రభుత్వ లక్ష్యంలో భాగంగానే ఈ సమాఖ్య భవనాలను నిర్మిస్తున్నట్లు అధికారులు తెలిపారు. మహిళల ఆర్థిక స్వావలంబన, సామాజిక గౌరవం, నిర్ణయాధికారాన్ని పెంచే దిశగా ఈ భవనాలు కీలక పాత్ర పోషించనున్నాయని పేర్కొన్నారు.

## మహిళలకు శాశ్వత వేదిక కల్పించడమే లక్ష్యం

### పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క

“స్వయం సహాయక సంఘాల మహిళలు తెలంగాణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలమైన శక్తి. మహిళలు మరింత ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు, వారి కార్యకలాపాలకు ఒక శాశ్వత వేదిక అవసరమనే ఆలోచనతో జిల్లా మహిళా సమాఖ్య భవనాలను నిర్మిస్తున్నాం. మహిళలు సమావేశాలు నిర్వహించుకోవడం నుంచి స్వయం ఉపాధి అవకాశాలను విస్తరించుకునే వరకు అన్ని అవసరాలకు ఈ భవనాలు ఉపయోగపడతాయి. మహిళా సంఘాల ఉత్పత్తులకు మార్కెట్ అవకాశాలు పెరుగుతాయి. మహిళల ఆర్థిక, సామాజిక సాధికారత దిశగా ఇవి కీలక అడుగులు అవుతాయి. మహిళ బలపడితే కుటుంబం బలపడుతుంది.. కుటుంబం బలపడితే గ్రామం, రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. .అందుకే గ్రామ స్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు మహిళ భవనాలను నిర్మిస్తున్నాం. తెలంగాణ ఆడబిడ్డల ఆర్థిక ప్రగతికి చిరునామాగా నిలిచే భవనాలు దేశానికే ఆదర్శం కానున్నాయి”

# తుమ్మిడిహెట్టి బ్యారేజ్‌తో రైతులకు మేలు

- కేసీఆర్ కమిషన్ల కోసం ప్రాజెక్ట్ తరలించారు
- తొందరలోనే సీఎం శంకుస్థాపన చేస్తారు
- ప్రాణహిత నదికి జలహారతి పట్టిన మంత్రులు జూపల్లి, వివేక్



**కౌటాల మే 08 (జనంసాక్షి) :** బ్యారేజ్ నిర్మాణం పూర్తయితే రైతులకు మేలు జరుగుతుందని, తెలంగాణ లో సాగునీటి రంగానికి పూర్వ వైభవం తీసుకొచ్చే దిశగా ముఖ్యమంత్రి అడుగులు వేస్తున్నారని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం తుమ్మిడిహెట్టిని సందర్శించిన మంత్రులు జూపల్లి కృష్ణారావు, వివేక్ వెంకటస్వామి ప్రాణహిత నదికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహిం చి, జలహారతి ఇచ్చారు. తుమ్మిడిహెట్టి ప్రతిపాదిత సైట్ ను క్షేత్ర స్థాయిలో పరిశీలిం చారు. బరాజ్ ఎత్తు, సామర్థ్యం, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులు, మహారాష్ట్ర లో ఉన్న శివిని గ్రామ పరిధిలోని ముంపు పరిధి, అటవీ, పర్యావరణ అనుమతులు, తదితర అంశాలపై సాగునీటి పారుదల శాఖ అధికారులతో చర్చించారు. అనంతరం మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ పాలకులు పక్కనబెట్టిన ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుకు (తుమ్మిడిహెట్టి బరాజ్) పునరుజ్జీవం పోయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి 2008లో రూ.38,500 కోట్ల అంచనా వ్యయంతో 16 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో డా. బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టుకు భూమిపూజ చేశారని గుర్తుచేశారు. ‘మేడిగడ్డ ప్రాజెక్ట్ పిల్లర్లు కుంగిపోవడంతో ఇప్పు డు ఆ నీటిని వాడుకునే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తుమ్మిడిహెట్టి బరాజ్ నిర్మిస్తే ఒక్క యూనిట్ విద్యుత్ ఖర్చు లేకుండా గ్రావిటీ ద్వారా శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు నీటిని తరలించవచ్చని, తద్వారా సిర్పూర్, ఆసిఫాబాద్, బెల్లంపల్లి, చెన్నూరు రైతాంగానికి గొప్ప మేలు జరుగుతుందని స్పష్టం చేశారు. తుమ్మిడిహెట్టి వద్ద 150 మీటర్ల మేర బరాజ్ నిర్మాణానికి అంగీకరించాలని మహారాష్ట్ర ప్రభుత్వాన్ని కోరనున్నట్లు మంత్రి చెప్పారు. “మహారాష్ట్రలోని శివిని గ్రామానికి ఎలాంటి ముంపు సమస్య ఉండదు. భూములు కోల్పోయే వారికి మెరుగైన పరిహారం, సదుపాయాలు కల్పిస్తాం. ఈ ప్రాజెక్టు వల్ల రెండు రాష్ట్రాల్లోనూ భూగర్భ జలాలు పెరుగుతాయి” అని వివరించారు.

## బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు చొరవ చూపాలి

ఈ నెల 10న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటనకు రానున్న నేపథ్యంలో, రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలు ఈ ప్రాజెక్టు అంశాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లాలని మంత్రి జూపల్లి కోరారు. ‘వికసిత్ భారత్’ అని నినదించే కేంద్ర ప్రభుత్వం, పెద్ద మనసుతో తెలంగాణ రైతుల పక్షాన నిలబడి మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించేలా చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాల దృష్ట్యా చేపడుతున్న ఈ ప్రాజెక్టు విషయంలో ప్రతిపక్షాలు రాజకీయ విమర్శలు మానుకోవాలని హితవు పలికారు. సాగునీటి రంగాన్ని గాడిలో పెట్టేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని, అందరూ సహకరించాలని కోరారు.

## కమిషన్ ల కోసం కెసిఆర్ ప్రాణహిత తరలించారు

### రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి

ప్రాణహిత ప్రాజెక్టు ను కెసిఆర్ కమిషన్ల కోసమే తుమ్మిడి హెట్టి నుండి కాళేశ్వరం కు తరలించి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కు తీవ్ర అన్యాయం చేశారని,రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పనా, మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు.కేసీఆర్ తుగ్లక్ సీఎం అని, బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని ఆరోపించారు.కెసిఆర్ హయాంలో చిన్న కాంట్రాక్టర్ మేఘా కృష్ణారెడ్డి ప్రపంచ స్థాయి కి ఎదిగారని ఎద్దేవా చేశారు. మహారాష్ట్ర తో తుమ్మిడి హెట్టి ఒప్పందం చేసుకుని కాళేశ్వరం కట్టారని , పదివేల కోట్లు ఖర్చు చేసిన దానికి ఇరవై అయిదు వేల కోట్లిస్తే కంప్లీట్ అయ్యేదని,లక్ష కోట్ల తో కాళేశ్వరం కడితే ఒక్క టీఎంసీ కూడా సరిగ్గా వాడలేదన్నారు.ప్రాణహిత ప్రాజెక్ట్ తో 16లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని ,ఉమ్మడి ఆదిలాబాద్ కి 2 లక్షల ఎకరాలకు సాగు నీరు ఇచ్చేందుకు సీఎం రేవంత్ రెడ్డి సిద్ధంగా ఉన్నారని ,తుమ్మిడి హెట్టి ప్రాజెక్ట్ నిర్మాణం తో మహారాష్ట్రకు ఎటువంటి నష్టం లేదని స్పష్టం చేశారు. మహా సీఎం ఫడ్నవీస్ ఒప్పుకోవాలని,త్వరలోనే సీఎం రేవంత్ రెడ్డి ప్రాణహిత ప్రాజెక్ట్ కు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. మహారాష్ట్ర ప్రభుత్వం ఒప్పుకునేలా తెలంగాణా బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు కృషి చేయాలి రైతులకి న్యాయం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, పాల్వాయి హరీష్ బాబు, కలెక్టర్ హరిత, ఎస్పీ నిఖిత పంత్ తదితరులు పాల్గొన్నారు.

# పశుపోషణ, పాడి పరిశ్రమ పట్ల కేంద్ర ప్రభుత్వ వివక్ష

### ప్రధాని నరేంద్ర మోడీకి గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం డిమాండ్



**హైదరాబాద్ (జనంసాక్షి) :** పశుపోషణ, పాడి పరిశ్రమ పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్ష మానుకొని ప్రోత్సహించాలని ప్రధాని నరేంద్ర మోడీకి గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎన్ఎల్ఎం(నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్) స్కీము అమలు తీరుపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో యాదవ, కురుమ, గొర్రెలు-మేకల పెంపకందారులు, గొర్రెల కాపరుల వృత్తి సంఘాల నాయకులు పాల్గొన్నారు. గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోచబోయిన శ్రీహరి యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఎన్ఎల్ఎం పథకాన్ని పూర్తి సరళతరం చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఉన్న కఠినమైన నిబంధనలు, షరతుల కారణంగా వృత్తి కులాలకు చెందిన గొర్రెల కాపరులకు ఈ పథకం ద్వారా ఒక్క శాతం కూడా ప్రయోజనం చేకూరడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రత్యేక చొరవ తీసుకొని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసి యాదవులు, కురుమలు, గొర్రెల కాపరులకు ప్రత్యేక ప్రోత్సాహం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు చింతల రవీంద్రనాథ్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, ఎన్ఎల్ఎం పథకం ప్రవేశపెట్టిన అసలు లక్ష్యం నెరవేరలేదని అన్నారు. కఠినమైన నిబంధనల వల్ల నిజమైన అనుభవం, నైపుణ్యం ఉన్న పశుపోషకులకు పథకం ఫలాలు అందడం లేదని, నిబంధనలు సవరించి యాదవులు, కురుమలకు ప్రాధాన్యత కల్పించాలని కోరారు. యాదవ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చలకానీ వెంకట్ యాదవ్ మాట్లాడుతూ వృత్తి కులాల నుండి వచ్చే గొర్రెల కాపరులకు అవకాశాలు కల్పించకుండా అకారణంగా అనర్హులుగా ప్రకటిస్తే న్యాయపోరాటానికి కూడా సిద్ధమని తెలిపారు. అఖిల భారత యాదవ మహాసభ జాతీయ కార్యదర్శి అయిలబోయిన రమేష్ యాదవ్ మాట్లాడుతూ ఎన్ఎల్ఎం పథకంలో అధిక శాతం వృత్తి కులాలకు చెందిన వారికి అవకాశాలు కల్పించాలని, బ్యాంకులు ష్యూరిటీ లేకుండా రుణాలు మంజూరు చేసి సబ్సిడీలు అందించాలని కోరారు. గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుత రవీందర్ యాదవ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గొల్ల-కురుమలను కేవలం రాజకీయ అవసరాలకే ఉపయోగించుకుంటున్నాయని, ఉపయోగక రమైన పథకాలు అందించడం లేదని విమర్శించారు. గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం తిరుపతి యాదవ్ మాట్లాడుతూ ఎన్ఎల్ఎం స్కీంలో షీప్ అండ్ గోట్ ప్రాజెక్టును వెంటనే పునఃప్రారంభించాలని, డీటీసీపీ అనుమతి లేకుండానే బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని, ఇప్పటికే దరఖాస్తు చేసుకొని అవకాశం కోల్పోయిన వారికి మరో అవకాశం కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ హైదరాబాద్ పర్యటన సందర్భంగా ఈ అంశంపై స్పష్టమైన ప్రకటన చేయాలని సమావేశంలో పాల్గొన్న నాయకులు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈ రౌండ్ టేబుల్ సమావేశాన్ని దేశవ్యాప్తంగా నిర్వహించి దేశ రాజధానిలో భారీ ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో అయోధ్య యాదవ్, కురుమూర్తి యాదవ్, ఆలేటి యాదగిరి,గౌడ రాజ్ కుమార్ కురుమ, చంద్రయ్యా యాదవ్, దేశబోయిన సూర్యనారాయణ, సోమ రమేష్ కురుమ, నోముల సైదులు యాదవ్, బత్తిని లక్ష్మణ్ యాదవ్ పవన్, లింగమూర్తి, బసవయ్య తదితరులు పాల్గొన్నారు.



# సిరిసిల్ల జిల్లాలో కేటీఆర్ పర్యటన

- ముత్యాల పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

**రాజన్న సిరిసిల్ల, మే8 (జనంసాక్షి) :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుక్రవారం సిరిసిల్లా జిల్లాలోని పలు మండలాల్లో పర్యటించారు. గంభీరావుపేట మండలం లింగన్నపేటలో ముత్యాల పోచమ్మ ఆలయానికి వచ్చిన సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎల్లారెడ్డి పేట మండలంలోని నారాయణపూర్, రాగట్ల పల్లె లో పెద్దమ్మ ఆలయాన్ని దర్శించుకున్నారు. శ్రీ మల్లికార్జున స్వామి కళ్యాణోత్సవంలో పాల్గొని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. దుమాలలోని శ్రీదేవి, భూ దేవి సహిత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్థిర ప్రతిష్ట మహోత్సవానికి హాజరయ్యారు. గ్రామాలు బాగుంటేనే దేశం రాష్ట్రం బాగుంటుందని అన్నారు వీర్నపల్లి మండలం భావిసింగ్ భూక్యా తండాకు చేరుకున్న మాజీ మంత్రి కేటీఆర్ జగదాంబ మాత సేవ లాల్ మహరాజ్ విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొన్నారు.

సంపాదకీయం

# రైతు క'న్నీటి' గాయం తీర్చేదెవరు..?

*రైతేడ్చిన రాజ్యం.. ఎద్దేడ్చిన ఎవుసం బాగుపడదని నాటి నుంచి బలమైన వాదన. ఆరుగాలం కష్టపడి చెమట చుక్కను చిందించే రైతన్న.. కల్లాలపైనే తన ఆశల కళ్లన్నీ. చేతికొచ్చే గింజల్లోనే తన బతుకును చూసి భరోసాగా ఉంటాడు. కానీ పాలకుల చిన్నచూపు, రైతాంగం పట్ల అలక్ష్యం.. అన్నదాతను ఆందోళనలో ముంచెత్తుతోంది. కల్లాల్లో పోసిన ధాన్యం తడిసి ముద్దవుతున్నా.. గింజలు మొలకెత్తుతున్నా కొనే నాథుడే లేడు. మరి కర్షకుడిని కాపాడే బాధ్యత ఎవరిదీ..?*

ఇది ఒక్క రైతు కష్టం కాదు తెలంగాణ అంతటా వేలాది కల్లాల్లో జరుగుతున్న మౌన విషాదం. వాళ్ల క'న్నీటి' గాయానికి అసలైన సమాధానం ఇవ్వకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ బాధ్యతను విస్మరిస్తుండటం శోచనీయం. కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) ప్రకటించి ధాన్యం సేకరించే అంతిమ బాధ్యత కేంద్రానిదే. ఎఫ్‌సీఐ నేరుగా లేదా రాష్ట్ర ఏజెన్సీల ద్వారా ధాన్యం కొనుగోలు చేయాలి. కానీ ఎఫ్ సీఐ గోదాముల్లో చోటు లేదని, నాణ్యత లేదని అనేక నెపాలు చెప్పి తప్పించుకుంటోంది. ఇక, రాష్ట్రంలో ధాన్యం సేకరణ ప్రాథమిక బాధ్యత టీఎస్‌సీఎస్సీ పరిధిలో ఉంటుంది. కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, తూకం, రవాణా, నిల్వ ఇవన్నీ ఈ సంస్థ చేయాల్సిందే. కానీ సిబ్బంది కొరత, నిధుల కొరత, రాజకీయ నిర్లక్ష్యం కారణంగా కొనుగోలు కేంద్రాలు సకాలంలో తెరుచుకోవడం లేదు. ప్రభుత్వాలదే కాదు.. సంబంధిత శాఖ, తహసీల్దార్లు, వీఆర్వోలు, మండల రెవెన్యూ అధికారులు.. వీరందరూ క్షేత్రస్థాయిలో ఇస్తున్న అరకొర నివేదికలు, దాటవేత ధోరణులతో అన్నదాత ఆగమవుతున్నాడు.

పంట చేతికొచ్చినా కొనుగోలు కేంద్రాలు అందుబాటులోకి రాకపోవడం, గోదాముల్లో సదుపాయాలు లేకపోవడం వల్ల ధాన్యం నీటి పాలవుతోంది. ఇదే అదనుగా తేమ శాతం నెపంతో దోపిడీకి తెరతీస్తున్నారు. మద్దతు ధర రాక తక్కువ ధరకే వ్యాపారులకే అమ్ముకోవాల్సిన దుస్థితిలోకి రైతు నెట్టబడుతున్నాడు. అంతిమంగా అన్నివిధాలా నష్టపోయి పెట్టుబడి కూడా రాక వ్యవసాయానికే దూరమయ్యే దుస్థితికి చేరుకుంటున్నాడు. అప్పటికే తీసుకున్న రుణాలు, మరో సీజన్‌కు పెట్టుబడి, కుటుంబ భారాలన్నీ తడిసి మోపెడవుతున్నాయి.

ధాన్యాన్ని రైతే కేంద్రానికి తీసుకెళ్ళాల్సిన అవసరం లేకుండా కల్లాల వద్దే మొబైల్ ప్రొక్యూర్‌మెంట్ యూనిట్లు ఏర్పాటు చేయాలి. అనేక రాష్ట్రాల్లో ఈ విధానం విజయవంతంగా అమలవుతోంది. పంట కోత ముందే రైతు నమోదు, ఏ తేదీన ఎంత పరిమాణం సేకరించాలో ముందే నిర్ణయించుకుని, అనుసరించాలి. కల్లాల్లో వేచిఉండే పరిస్థితి వద్దు. ప్రతి కొనుగోలు కేంద్రంలో తక్షణం తాత్కాలిక షెడ్‌లు, తార్పాలిన్‌లు అందుబాటులో ఉంచాలి. వర్షంలో ధాన్యం తడవకుండా కాపాడే బాధ్యత ప్రభుత్వానిది, రైతుది కాదు. అదేవిధంగా కల్లంలో ధాన్యం పోసిన 48 గంటల్లోపు తూకం పూర్తవుతుందని హామీ ఇవ్వాలి. జాప్యం జరిగితే నష్టపరిహారం ప్రభుత్వమే భరించాలి. ఐఎండీ వర్షపాత అంచనాలను దృష్టిలో పెట్టుకుని ముందస్తుగా కొనుగోలు క్యాలెండర్ రూపొందించాలి. వర్షాకాలానికి ముందు పంట కోతలు పూర్తవునట్లు, సేకరణ జరిగేలా ప్రణాళిక వేయాలి. రైతు ఫోన్ చేస్తే 24 గంటల్లో స్పందన వచ్చే వ్యవస్థ తీసుకురావాలి. కల్లంలో సమస్య నమోదైన వెంటనే మండల అధికారికి నోటిఫికేషన్ అందే డిజిటల్ వ్యవస్థ నిర్మించాలి. కల్లాల్లో తడిసిన ధాన్యం కేవలం వ్యవసాయ సమస్య కాదు.. అది పాలనా వైఫల్యానికి నిలువెత్తు సాక్ష్యం. అన్నం పెట్టే చేతులకు న్యాయం జరగనప్పుడు, ఆ సమాజం ఎంత అభివృద్ధి చెందినా నైతికంగా దివాళా తీసినట్లే. కల్లంలో మొలకెత్తిన గింజ రైతు కన్నీటికి మొలకెత్తింది. ఇక మొలకెత్తాల్సింది పాలకుల మనసాక్షి.

## మేమంత మౌతమా..!?

గెలిచినప్పుడు
పొంగిందీ లేదు
ఓటమెదురైనా
కుంగేదేం లేదూ..
శ్రమదోపిడి వొద్దూ
బానిస బత్కేలని
పోరాటమే దిక్కని
ఎగిరేటి ఎర్ర జెండై..
కష్టజీవికి కంటిరెప్పై
అన్నార్థుల సమ్మెట్టై
రైతుకూలి కొడవళ్ళై
గొంతెత్తిన పిడికిళ్ళై..
అంతిమ విజయం
మా శాశ్వత లక్ష్యం
మేమంత మౌతమా
కమ్యూనిస్టులం...!!

**డా. ఇక్బాల్ పాషా**
**9440775732**



# హంటా వైరస్.. ప్రపంచానికి మరో హెచ్చరికేనా?




ప్రస్తుతం వార్తల్లో ఉన్న నౌక పేరు ఎం.వీ హోండియస్.(MV Hondius.) ఇది నెదర్లాండ్స్‌కు చెందిన ఒక ఎక్స్‌పెడిషన్ క్రూయిజ్ షిప్. ఈ నౌక 2026 ఏప్రిల్ 1న ఉషువాయా (Ushuaia )నుంచి ప్రయాణం ప్రారంభించింది. అంటార్కిటికా, ఫాక్‌లాండ్ దీవులు ప్రాంతాలు సందర్శించిన తర్వాత అట్లాంటిక్ సముద్రం మీదుగా కానరీ దీవుల (Canary Islands) వైపు ప్రయాణిస్తోంది.

నౌకలో మొత్తం 147 మంది ప్రయాణికులు, సిబ్బంది ఉన్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది. వీరిలో ఇప్పటివరకు 7 నుంచి 8 మంది వరకు హంటా వైరస్ అనుమానిత కేసులుగా గుర్తించబడ్డారు. అందులో కనీసం 2 లేదా 3 కేసులు ప్రయోగశాల పరీక్షల్లో "హంటా వైరస్"గా నిర్ధారించబడ్డాయి. ముగ్గురు మరణించినట్లు కూడా సమాచారం ఉంది. ఈ వైరస్ సాధారణ హంటా వైరస్ కాకుండా "ఆండీస్ స్ట్రెయిన్" కూడా కావచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. ఈ రకం వైరస్ చాలా అరుదుగా మనిషి నుంచి మనిషికి కూడా వ్యాపించే అవకాశం ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొంది.

అయితే "147 మందికి ఈ వైరస్ సోకింది" అనే వార్త నిజం కాదు. ప్రస్తుతం 147 మంది నౌకలో ఉన్న మొత్తం ప్రయాణికులు, సిబ్బంది సంఖ్య మాత్రమే. అందరికీ వ్యాధి నిర్ధారణ కాలేదు. కేవలం కొద్దిమందికే ఈ లక్షణాలు కనిపించాయి, వారిలో కొందరికి మాత్రమే పరీక్షల్లో నిర్ధారణ జరిగింది. ప్రస్తుతం ప్రపంచ ఆరోగ్య సంస్థ, యూరోపియన్ ఆరోగ్య సంస్థలు, సంబంధిత దేశాల ప్రభుత్వాలు ప్రయాణికులను ట్రాక్ చేస్తూ పర్యవేక్షణ కొనసాగిస్తున్నాయి. ప్రజలకు తక్షణ భారీ ప్రమాదం లేదని అధికారులు చెబుతున్నారు.

మొత్తానికి ఈ వార్త ప్రపంచవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తున్నాయి. కరోనా మహమ్మారి తర్వాత ప్రజలు ఏ కొత్త వైరస్ వార్త వచ్చినా అప్రమత్తంగా గమనిస్తున్నారు. అయితే హంటా వైరస్ కొత్తది కాదు. ఇది దశాబ్దాలుగా ప్రపంచంలోని కొన్ని దేశాల్లో కనిపిస్తున్న ఒక తీవ్రమైన వైరల్ వ్యాధి. ముఖ్యంగా ఎలుకలు, అడవి ఎలుకల ద్వారా వ్యాపించే ఈ వైరస్ కొన్ని సందర్భాల్లో ప్రాణాంతకంగా మారుతుంది. అందుకే ఇప్పుడు "ఇది భారత్‌పై ప్రభావం చూపుతుందా?" అనే ప్రశ్న సహజంగానే ఎదురవుతోంది.

హంటా వైరస్‌ను మొదటిసారి 1950లలో కొరియా యుద్ధ సమయంలో గుర్తించారు. దక్షిణ కొరియాలోని "హంటాన్" నది ప్రాంతంలో ఈ వైరస్ ఎక్కువగా కనిపించడంతో దీనికి "హంటా వైరస్" అనే పేరు వచ్చింది. తరువాత చైనా, రష్యా, అమెరికా, దక్షిణ అమెరికా దేశాల్లో కూడా ఈ వైరస్ కేసులు నమోదయ్యాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం ఇది ప్రధానంగా ఎలుకల మూత్రం, మలం, లాలాజలం ద్వారా మనుషులకు సోకుతుంది. సాధారణంగా ఒక మనిషి నుండి మరొకరికి సులభంగా వ్యాపించదు. ఇదే దీనిని కరోనా వంటి మహమ్మారుల నుండి కొంత భిన్నంగా చేస్తుంది.

ఈ వైరస్‌కు ప్రధాన కారణం పరిశుభ్రత లోపం. ఇళ్లలో, గోదాముల్లో, వ్యవసాయ పొలాల్లో, పాత భవనాల్లో ఎలుకల సంఖ్య పెరిగితే ప్రమాదం కూడా పెరుగుతుంది. ఎలుకల మలం ఎండిపోయిన తర్వాత అది గాలిలో కలిసినప్పుడు మనుషులు శ్వాస ద్వారా వైరస్‌ను లోపలికి తీసుకుంటారు. కొన్నిసార్లు కలుషిత ఆహారం లేదా నీటి ద్వారా కూడా ఇది వ్యాపించవచ్చు. అడవుల్లో పనిచేసేవారు, గోదాముల్లో కార్మికులు, వ్యవసాయ కూలీలు ఎక్కువ ప్రమాదంలో ఉంటారు.

**హంటా వైరస్ లక్షణాలు మొదట సాధారణ జ్వరంలా కనిపిస్తాయి. జ్వరం, తలనొప్పి, కండరాల నొప్పులు, అలసట, వాం తులు, విరేచనాలు మొదటి దశలో ఉంటాయి. కానీ కొన్ని రోజుల తర్వాత ఇది ఊపిరితిత్తులపై తీవ్రమైన ప్రభావం చూపుతుంది. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ఛాతిలో నొప్పి, ఊపిరాడకపోవడం వంటి సమస్యలు తలెత్తుతాయి. కొన్నిసార్లు మూత్రపిండాలపై కూడా ప్రభావం చూపి "హీమరేజిక్ ఫీవర్ విత్ రీనల్ సిండ్రోమ్" అనే ప్రమాదకర పరిస్థితికి దారితీస్తుంది. చికిత్స ఆలస్యం అయితే మరణాలు సంభవించే అవకాశమూ ఉంటుంది.**

అయితే ఇప్పటి వరకు హంటా వైరస్‌కు ప్రత్యేకమైన పూర్తి స్థాయి మందు లేదా వ్యాక్సిన్ ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో లేదు. వైద్యులు ప్రధానంగా లక్షణాలను తగ్గించే చికిత్సనే అందిస్తున్నారు. త్వరగా గుర్తిస్తే ఆక్సిజన్, ఐసీయూ చికిత్స ద్వారా ప్రాణాలను కాపాడవచ్చు. అందుకే ముందస్తు జాగ్రత్తలే అత్యంత కీలకం. ప్రపంచవ్యాప్తంగా శాస్త్రవేత్తలు ఈ వైరస్‌పై పరిశోధనలు కొనసాగిస్తున్నారు. అమెరికాలోని సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ (బీబీసీ), చైనా, దక్షిణ కొరియా శాస్త్రవేత్తలు వైరస్ వ్యాప్తి విధానంపై అధ్యయనాలు చేస్తున్నారు. కొన్ని దేశాలు ప్రయోగాత్మక వ్యాక్సిన్లపై కూడా పరిశోధనలు చేస్తున్నాయి. అయితే ఇంకా సాధారణ ప్రజలకు అందుబాటులోకి వచ్చే స్థాయికి చేరలేదు.

భారత్ విషయంలో చూస్తే ఇప్పటివరకు పెద్ద ఎత్తున హంటా వైరస్ వ్యాప్తి నమోదుకాలేదు. కానీ ప్రమాదం లేదని చెప్పలేం. భారతదేశంలో పట్టణాల విస్తరణ, చెత్త నిర్వహణ లోపా లు, ఎలుకల పెరుగుదల, పరిశుభ్రత సమస్యలు వైరస్ వ్యాప్తికి అనుకూల పరిస్థితులు సృష్టించే అవకాశం ఉంది. ముఖ్యంగా భారీ జనసాంద్రత ఉన్న నగరాల్లో ఒకసారి వైరస్ గుర్తిస్తే ఆరోగ్య వ్యవస్థ పై ఒత్తిడి పెరగవచ్చు. అందుకే ముందుగానే అప్రమత్తం అవసరం.

అయితే ఈ సందర్భంలో ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలు చాలా సాధారణమైనవే అయినా అత్యంత ముఖ్యమైనవి. ఇళ్లలో, గోదాముల్లో ఎలుకలు చేరకుండా చూడాలి. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకూడదు. ఎలుకల మలం కనిపిస్తే దానిని పొడిగా ఊడవేయకుండా శుభ్రపరిచే ద్రావకాలతో తడిపి శుభ్రం చేయాలి. పాత గదులు, మూసివేసిన గోదాములు శుభ్రం చేసే సమయంలో మాస్క్‌లు, గ్లౌజులు వాడాలి. ఆహార పదార్థాలను మూతపెట్టిన పాత్రల్లో నిల్వ చేయాలి. జ్వరం, శ్వాస సమస్యలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

కరోనా తర్వాత ప్రపంచం ఒక విషయం నేర్చుకుంది ఈ వైరస్‌లను చిన్నచూపు చూడడం ప్రమాదకరం. హంటా వైరస్ ఇప్పటికి మహమ్మారి స్థాయికి చేరకపోయినా, ఇది ప్రకృతి-మనిషి సంబంధాల్లో పెరుగుతున్న అసమతుల్యతకు మరో హెచ్చరిక. అడవుల నాశనం, నగరీకరణ, కుక్కలు, పిల్లులు,పందులు, పావురాలు మొదలైన పెంపుడు జంతువులు, పక్షులు కూడా ఇలాంటి వైరస్‌ల వ్యాప్తికి తోడ్పడతాయి.అవి సంచరించే ప్రాంతాల్లో పరిశుభ్రత లోపాలు కొత్త కొత్త వైరస్‌లకు మార్గం సుగమం చేస్తున్నాయి. అందుకే ప్రజారోగ్య వ్యవస్థను బలోపేతం చేయడం, గ్రామీణ-పట్టణ పరిశుభ్రతను మెరుగుపరచడం, శాస్త్రీయ అవగాహన పెంచడం అత్యవసరం. భయం కంటే జాగ్రత్త, అపోహల కంటే శాస్త్రీయ అవగాహన సమాజాన్ని రక్షించగల నిజమైన ఆయుధాలు.



**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్**
**9849328496.**

# మనస్సును గెలవకుండా.. మనిషిని ప్రేమించడం సాధ్యమేనా?



ప్రేమ అనేది రెండు అక్షరాల పదం కాదు, అది రెండు మనసుల మధ్య జరిగే ఒక మహా యజ్ఞం. నేటి కాలంలో ప్రేమలు పుట్టగొడుగుల్లా పుడుతున్నాయి, అంతే వేగంగా విడిపోతున్నాయి. దీనికి ప్రధాన కారణం ఏమిటి? ఎదుటి మనిషిని ప్రేమించడానికి ప్రయత్నిస్తున్నాం కానీ, మన సొంత మనస్సును మనం గెలవలేకపోతున్నాం. అసలు మనస్సును గెలవడమంటే ఏమిటి..? అది ప్రేమ బంధాన్ని ఎలా ప్రభావితం చేస్తుంది..? అనేదే ఇక్కడ ప్రశ్న. మనస్సును గెలవడమంటే దానిని చంపేయడం కాదు, దానిని మన అదుపులోకి తెచ్చుకోవడం. మన మనస్సు ఒక అల్లరి కోతి లాంటిది. అది క్షణక్షణానికి తన అభిప్రాయాలను మార్చుకుంటుంది. ఉదాహరణకు ఒకరోజు మీ భాగస్వామి చేసిన వంట బాగుంటే ఆకాశానికి ఎత్తేస్తుంది మనస్సు, మరుసటి రోజు ఏదైనా చిన్న పొరపాటు జరిగితే అంతా అయిపోయిందన్నట్లుగా ప్రవర్తిస్తుంది. ఇక్కడ అర్థం చేసుకోవాల్సిన అంశం ఏంటంటే మనసులో కలిగే కోపం, అసూయ, స్వార్థం వంటి భావాలను ఎవరైతే గుర్తించి, వాటిని నియంత్రించగలరో వారే మనస్సును గెలిచినట్లు. మన మనస్సు మన మాట విన్నప్పుడే, మనం అవతలి వ్యక్తికి ఇచ్చే ప్రేమ స్థిరంగా ఉంటుంది. సొంత మనస్సుపై పట్టు లేని వ్యక్తి ప్రేమ ఒక ఉప్పెనలా వస్తుంది, అంతే వేగంగా కరిగిపోతుంది. మన మనస్సులో 'అభద్రతా భావం' ఉంటే, మనం భాగస్వామిని ప్రేమించడం కంటే వారిని అనుమానించడం, అదుపు చేయడంపైనే ఎక్కువ దృష్టి పెడతాం. ఇది ప్రేమ కాదు, ఒక రకమైన మానసిక బానిసత్వం. ప్రేమలో మొదట కలిగే 'డోపమైన్' రసాయనం ఇచ్చే కిక్కు ఎప్పుడూ ఉండదు. ఆ రసాయన ప్రభావం తగ్గగానే, మనస్సు కొత్తదనం కోసం వెతుకుతుంది. మనస్సును గెలిచిన వారు మాత్రమే ఆ రసాయనాలకు అతీతంగా 'ఆక్సిటోసిన్' (నమ్మకం) అనే స్థిరమైన బంధాన్ని నిర్మించుకోగలరు. ఒకరకంగా చెప్పాలంటే ప్రేమలో పెద్ద శత్రువు 'అహం' (ఈగో). మనస్సు గెలవని వ్యక్తిలో ఈ అహం చాలా ఎక్కువగా ఉంటుంది. "నేను చెప్పిందే జరగాలి", "నాకే గౌరవం దక్కాలి" అనే ఆలోచనలు ఉన్నచోట ప్రేమ ఊపిరి తీసుకోలేదు. ఒక పెన్సిల్, రబ్బరు స్నేహం లాంటిది ప్రేమ. పెన్సిల్ తప్పు చేసినప్పుడల్లా రబ్బరు తనను తాను అరిగించుకుంటూ ఆ తప్పును తుడిచేస్తుంది. అక్కడ రబ్బరు తన అహాన్ని (రూపాన్ని) వదులుకుని పెన్సిల్ (భాగస్వామి) కోసం త్యాగం చేస్తుంది. మనస్సును గెలిచిన వారు మాత్రమే ఇలాంటి త్యాగానికి సిద్ధపడతారు. అయితే ప్రేమలో ఉన్నప్పుడు అన్నీ అందంగానే కనిపిస్తాయి. కానీ పెళ్లి అనే బాధ్యతలోకి రాగానే మనస్సు అసలు స్వరూపం బయటపడుతుంది. ఒకే ఇంట్లో కలిసి ఉన్నప్పుడు భాగస్వామి అలవాట్లు, అభిప్రాయాలు మనకు నచ్చకపోవచ్చు. మనస్సును గెలవని వారు వెంటనే గొడవకు దిగుతారు. అదే మనస్సును గెలిచిన వారు "తను వేరు, తన ఆలోచనలు వేరు" అని అర్థం చేసుకుని సర్దుకుపోతారు.

ఇక్కడ చెప్పదల్చుకున్నదేంటంటే పెళ్లి బంధం నిలబడాలంటే ఇద్దరి మధ్య 'అవగాహన' కంటే 'అంగీకారం' ముఖ్యం. ఎదుటి వ్యక్తిని ఎలా ఉన్నారో అలా అంగీకరించాలంటే ముందు మన మనస్సులోని మొండితనాన్ని గెలవాలి. "మనస్సును గెలవకుండా మనిషిని ప్రేమించడం సాధ్యమేనా..?" అంటే.. సాధ్యం కాదనే చెప్పాలి. ఎందుకంటే, మన మనస్సు ప్రశాంతంగా లేనప్పుడు మనం అవతలి వ్యక్తికి ప్రశాంతతను ఇవ్వలేము. మన మనస్సు నిండా స్వార్థం ఉన్నప్పుడు నిస్వార్థమైన ప్రేమను పంచలేము.

కాబట్టి, ఒక వ్యక్తిని నిజంగా ప్రేమించాలనుకునే వారు మొదట తమ మనస్సులోని వికారాలను గెలవాలి. అప్పుడే ఆ ప్రేమ కాల పరీక్షకు నిలబడుతుంది. పెళ్లి అనే బంధం కేవలం ఒక సామాజిక ఒప్పందంలా కాకుండా, రెండు మనసుల అద్భుత ప్రయాణంలా మారుతుంది.



**కస్తూరి దారా**
jannukastoori@gmail.com

# అధికారిక అన్యాయాలకు బలవుతున్న ముదిరాజులు

*చరిత్ర పుటల్లో ముదిరాజుల పేర్లు ధీరత్వానికి చిరునామాలు. ఒకప్పుడు ఈ నేలని ఏలిన రాజులుగా, సరిహద్దులు కాచిన సైన్యాధ్యక్షులుగా, గ్రామానికి వెన్నెముక లాంటి పాలకులుగా, చెరువుల సంరక్షకులుగా, వ్యవసాయదారులుగా వెలుగొందిన ఒక వీర జాతి.. నేడు తన ఉనికి కోసం అడుగడుగునా అవమానాలనే ఎదుర్కొంటోంది. కాలగమనంలో మత్స్యకారులుగా కులవృత్తిని స్థిరీకరించుకున్న ఈ సామాజికవర్గానికి, స్వతంత్ర భారతంలో దక్కిన ప్రతిఫలం ఏమిటి? ఐదు దశాబ్దాల అన్యాయం.. వ్యవస్థీకృత అణచివేత! పాలకుల బుద్ధిపూర్వకమైన విస్మరణ.*




**బీసీ-ఏ నుండి బీసీ-డీకి: ఒక చారిత్రక కుట్ర**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వెనకబడిన వర్గాల వర్గీకరణ జరిగినప్పుడు జరిగిన తప్పు సామాన్యమైనది కాదు. నిజానికి సామాజికంగా, ఆర్థికంగా అత్యంత దిగువన ఉన్న ముదిరాజులను బీసీ-ఏ జాబితాలో చేర్చాల్సింది పోయి, ఉద్దేశపూర్వకంగా బీసీ-డీ లోకి నెట్టడం ఒక "సామాజిక హత్య". ఆ ఒక్క తప్పుడు నిర్ణయం లక్షలాది మంది ముదిరాజ్ బిడ్డల భవిష్యత్తును అంధకారం చేసింది.

2009లో అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ఈ అన్యాయాన్ని గుర్తించి, ముదిరాజులను బీసీ-ఏలోకి చేరుస్తూ సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారు. కానీ, ఆ ఫైలు పన్నెండేళ్లపాటు న్యాయస్థానాల గదుల్లో దుమ్ము పట్టింది. చివరకు సుప్రీంకోర్టు "తెలంగాణ బీసీ కమిషన్ తక్షణమే నిర్ణయం తీసుకోవాలి" అని ఆదేశించినా, పాలకుల చెవులకు ఆ గొంతుక వినిపించడం లేదు.

**కాంగ్రెస్ మేనిఫెస్టోలో 'పవిత్ర' వాగ్దానం?**

ఎన్నికల రణక్షేత్రంలో ముదిరాజుల ఓట్ల కోసం కాంగ్రెస్ పార్టీ 'మేనిఫెస్టో' సాక్షిగా మాటిచ్చింది. "మమ్మల్ని గెలిపించండి.. మిమ్మల్ని బీసీ-ఏ లోకి మారుస్తాం" అని గొంతు చించుకుంది. అధికారం దక్కి రెండున్నర ఏళ్లు గడిచినా, ఆ హామీ ఇప్పుడు ఏ చీకటి గదిలో బందీ అయ్యింది? మేనిఫెస్టోలో రాసిన అక్షరాలు.. ముదిరాజుల కన్నీళ్లను తుడవడానికి కాదా? లేక కేవలం గద్దెనెక్కడానికి వేసిన ఎన్నికల గాలాలా?

**ప్రభుత్వ గణాంకాలే ముదిరాజుల ఆర్తనాదాలు!**

విచిత్రం ఏమిటంటే, ఈ ప్రభుత్వమే అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన SEEEPC సర్వే ఇప్పుడు ప్రభుత్వ ముఖం మీదే వాస్తవాలను విసురు తోంది. బీసీల కంటే, ఎస్సీల కంటే, ఎస్టీల కంటే ముదిరాజులే అత్యంత దుర్భర స్థితిలో ఉన్నారని అంకెలే సాక్ష్యం చెబుతున్నాయి. స్వయంగా నిర్వహించిన సర్వేలో నిజం నిప్పులా కనిపిస్తుంటే.. ఇంకా 'పరిశీలిస్తాం', 'చర్చిస్తాం' అనడం ఆత్మవంచన కాదా? రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన కులాన్ని 'ఓటు యంత్రాలు'గా వాడుకుంటూ, వారి రాజ్యాంగబద్ధమైన హక్కులను కాలరాస్తూ.. "బీసీల సంక్షేమానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంది" అని జబ్బలు చరుచుకోవడం పాలకుల దిగజారుడుతనానికి పరాకాష్ట. ముదిరాజుల సహనాన్ని పరీక్షించకండి; చరిత్రలో రాజులుగా ఉన్నవారు, హక్కుల కోసం రణక్షేత్రంలో సైనికులుగా మారితే.. ఏ సింహాసనమైనా కూలిపోవాల్సిందే! తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన అధికారిక గణాంకాలు ముదిరాజుల సామాజిక దుస్థితిని అద్దంలా ప్రతిబింబిస్తున్నాయి. ఈ సంఖ్యలు కేవలం గణాంకాలు కావు - ఒక సమాజం ఎదుర్కొంటున్న వెనకబాటుతనం, నిరాశ, అవకాశాల లోపం అనే చేదు వాస్తవాలను మన కళ్లముందు ఉంచుతున్నాయి.

**విద్యా రంగం - వెనకబాటుతో వచ్చే గాయాలు**

ముదిరాజులు ఉన్నత విద్యలో కేవలం 16% మాత్రమే డిగ్రీ వరకు చేరుకున్నారు. ఇది గంగపుత్రులు (19.5%), మాలలు (22%), లంబాడీలు (18%) కంటే తక్కువ. ఈ లోటు వారి యువతలో ఆత్మవిశ్వాసం తగ్గిపోవడానికి, ఉద్యోగ అవకాశాలు మూసుకుపోవడానికి కారణమవుతోంది. ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న వారి శాతం 11.2% మాత్రమే ఉండటం, ఆర్థిక బలహీనతను, సామాజిక స్థితి లోపాన్ని బహిర్గతం చేస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో 48% చదువుతున్నప్పటికీ, ఇది పేదరికానికి నిదర్శనం. విద్యలో వెనుకబాటు అంటే భవిష్యత్తు తలుపులు మూసుకుపోవడం.

ప్రభుత్వ ఉద్యోగాల్లో ముదిరాజులు కేవలం 1.6% మాత్రమే ఉన్నారు. గంగపుత్రులు (5%), మాలలు (3.4%), లంబాడీలు (3.1%) కంటే ఇది చాలా తక్కువ. ప్రైవేటు రంగంలో కూడా 4.6% మాత్రమే ఉండటం, వారి సామాజిక స్థానం బలహీనతను చూపిస్తోంది. ఉద్యోగాల్లో వెనుకబాటు అంటే ఆత్మగౌరవం కోల్పోవడం, సమాజంలో గౌరవప్రదమైన స్థానం దూరమవడం. ముదిరాజుల వృత్తి వెనకబాటు 83%- ఇది గంగపుత్రులు (64%), మాలలు (66%), లంబాడీలు (68%) కంటే చాలా ఎక్కువ. దినసరి కూలీలుగా 43% పనిచేస్తున్నారు. అంటే వారి జీవితం కూలీ పనులకే పరిమితం అయింది. ఇది ఆర్థిక అస్థిరత, సామాజిక గౌరవం లోటు కలిగిస్తోంది. కూలీ పనులలోనే జీవితం గడపడం వల్ల తరతరాల పేదరికం కొనసాగుతోంది.

జీవన ప్రమాణ సూచీ ముదిరాజులలో 18.6 మాత్రమే, మాలలు (21), లంబాడీలు (22.6) కంటే తక్కువ. మరుగుదొడ్డి లేని ఆవాసాలు 15.5% ఉండటం, ఆరోగ్య సమస్యలు, అవమానకర పరిస్థితులు కలిగిస్తోంది. సొంత కార్లు ఉన్న కుటుంబాలు కేవలం 1.9% మాత్రమే ఉండటం, సామాజిక ప్రతిష్ట లోటు చూపిస్తోంది. జీవన ప్రమాణాల్లో వెనుకబాటు అంటే గౌరవప్రదమైన జీవితం దూరమవడం.

**ఊరు కౌగిలిలో బతుకు చిత్రం.. నగరపు నీడలో కూలీ బతుకు**

ముదిరాజ్ బిడ్డల బతుకు ప్రయాణం నేడు ఒక విషాద వలయంలో చిక్కుకుపోయింది. అక్షరం అందని దూరాన, అభివృద్ధి జాడ లేని అంచున నిలబడి.. తమ తలరాతలను తామే రాసుకోలేని నిస్సహాయ స్థితిలో ఈ జాతి కొట్టుమిట్టాడుతోంది.

**గ్రామాల్లో గడ్డకట్టిన కన్నీరు:**

నేటి ఆధునిక యుగంలోనూ 74.6 శాతం ముదిరాజ్ జనాభా ఇంకా పల్లెటూరి మట్టిలోనే మగ్గిపోతోంది. ఇది వారి ఇష్టం కాదు.. చదువు అందక, అవకాశాలు దొరకక పల్లె దాటలేని ఒక సామాజిక నిర్బంధం. చెరువును నమ్ముకుంటే జలవనరులు కలుషితమయ్యాయి, భూమిని నమ్ముకుంటే పెట్టుబడి భారమైంది. ఫలితంగా మూడు వంతుల జనాభా దైనందిన అవసరాలు కూడా తీరని స్థితిలో, అర్ధాకలితో వ్యవసాయ కూలీలుగా, మత్స్యకారులుగా శ్రమిస్తున్నారు. రెక్కాడితే గానీ డొక్కాడని ఈ బతుకుల్లో, దారిద్ర్యం తెచ్చిన నిరాశ నిస్పృహలు వారిని మద్యపానానికి, తెలియని నేరప్రవృత్తికి బలి చేస్తున్నాయి. ఇది వారి ప్రవృత్తి కాదు.. వ్యవస్థ విసిరిన వికృత రూపం!

**నగరాల్లోనూ అందని నాగరికత:**

పోనీ, నగరాలకు వలస వెళ్తే అక్కడైనా ఆదరణ ఉందా? అంటే అదీ లేదు. కేవలం 23.4 శాతం మంది మాత్రమే పట్టణాల్లో నివసిస్తుండగా, అక్కడ కూడా వారి బతుకు గాలిలో దీపంలాగే ఉంది. తోటి సామాజిక వర్గాలైన మాలలు (40.6%), గంగపుత్రులు (44%) పట్టణీకరణలో కొంత మెరుగైన స్థితిలో ఉండగా.. ముదిరాజులు మాత్రం 64 శాతం వెనుకబాటుతో ఇంకా చీకట్లోనే ఉన్నారు. నగరపు కాంతుల వెనుక.. అపార్ట్మెంట్ల గేట్ల వద్ద వాచ్మెన్లుగా, ఇళ్లలో తోటమాలీలుగా, గుమాస్తాలుగా, అసంఘటిత రంగంలో రోజువారీ కూలీలుగా ఈ 'Predominant' జాతి నలిగిపోతోంది.

**సామాజిక ఒంటరితనం - ఆత్మగౌరవ క్షోభ:**

అటు పల్లెల్లో కష్టం కన్నీరవుతోంది.. ఇటు నగరాల్లో అస్తిత్వం ప్రశ్నార్థకమవుతోంది. అట్టడుగు వర్గాల కంటే దారుణమైన స్థితిలో ఉన్న ఈ గణాంకాలు చూస్తుంటే, ముదిరాజ్ జాతి 'ఆధునిక అంటరానితనాన్ని' (Social Isolation) అనుభవిస్తోందని స్పష్టమవుతోంది. అభివృద్ధి ఫలాలు పక్క కులాల గడప దాటుతున్నా, తమ వాకిట్లోకి రాకపోవడంతో కలుగుతున్న ఆత్మగౌరవ లోటు వారిని మానసికంగా కృంగదీస్తోంది. ఇది కేవలం వెనుకబాటుతనం కాదు.. ఒక చారిత్రక అన్యాయం. ఒక వీర జాతిని కూలీల జాతిగా మార్చిన సామాజిక వైఫల్యం!

**అంకెలు చెబుతున్న అక్షర సత్యాలు:**

ముదిరాజుల పరిస్థితి కేవలం గణాంకాల్లో పరిమితం కాలేదు; అది ప్రతి కుటుంబంలో, ప్రతి గ్రామంలో, ప్రతి కూలీ చేతిలో ప్రతిఫలిస్తోంది. ఉన్నత విద్యలో వెనుకబాటు వారి భవిష్యత్తును మూసివేస్తోంది - డిగ్రీ వరకు చదువుకున్నవారు కేవలం 16% మాత్రమే ఉండటం, ఇతర వర్గాల కంటే తక్కువగా ఉండటం, యువతకు అవకాశాల తలుపులు మూసుకుపోయినట్లే. ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న వారి శాతం 11.2% మాత్రమే ఉండటం, ఆర్థిక బలహీనతను బహిర్గతం చేస్తోంది; ప్రభుత్వ పాఠశాలల్లో 48% చదువుతున్నప్పటికీ, అది పేదరికానికి నిదర్శనం. ఉద్యోగాల్లోనూ పరిస్థితి అత్యంత దారుణం - ప్రభుత్వ ఉద్యోగాల్లో 1.6% మాత్రమే ఉండటం, ప్రైవేటు రంగంలో 4.6% మాత్రమే చేరుకోవడం, ముదిరాజుల సామాజిక స్థానం ఎంత బలహీనంగా ఉందో చూపిస్తోంది. ఇది గౌరవప్రదమైన స్థానం కోల్పోవడం, ఆత్మగౌరవం దెబ్బతినడం అనే వాస్తవాన్ని ప్రతిబింబిస్తోంది.

వృత్తి రంగంలో వెనకబాటు మరింత తీవ్రమైనది -- 83% మంది వెనుకబాటుతనంలో ఉండటం, 43% మంది దినసరి కూలీలుగా జీవనం సాగించడం, వారి జీవితం కూలీ పనులకే పరిమితం అయిందని స్పష్టంగా చెబుతోంది. ఇది తరతరాల పేదరికాన్ని కొనసాగిస్తూ, శ్రమతోనే జీవితం గడపాల్సిన పరిస్థితిని కలిగిస్తోంది. జీవన ప్రమాణాల్లోనూ ముదిరాజులు వెనుకబడి ఉన్నారు - జీవన ప్రమాణ సూచీ 18.6 మాత్రమే ఉండటం, మరుగుదొడ్డి లేని ఆవాసాలు 15.5% ఉండటం, సొంత కార్లు ఉన్న కుటుంబాలు కేవలం 1.9% మాత్రమే ఉండటం, గౌరవప్రదమైన జీవితం దూరమవుతోందని తెలియజేస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో 74.6% మంది నివసించడం, పట్టణాల్లో వెనకబాటు 64% ఉండటం - ఇది ముదిరాజులు అభివృద్ధి అవకాశాల నుండి దూరంగా ఉన్నారని స్పష్టంగా చెబుతోంది. గ్రామాల్లోనూ, పట్టణాల్లోనూ వారు అవకాశాల లోపం, సామాజిక ఒంటరితనం, అభివృద్ధి దూరం అనుభవిస్తున్నారు. ఈ గణాంకాలు ఒక సమాజం యొక్క నిశ్శబ్ద కేకలు. విద్యలో వెనుకబాటు భవిష్యత్తును మూసివేస్తోంది, ఉద్యోగాల్లో వెనుకబాటు గౌరవాన్ని కోల్పోయి స్తోంది, వృత్తి వెనకబాటు కూలీ పనులలోనే జీవితం పరిమితం చేస్తోంది, జీవన ప్రమాణాల్లో వెనుకబాటు గౌరవప్రదమైన జీవితం దూరం చేస్తోంది, గ్రామీణ/పట్టణ వెనకబాటు అవకాశాల లోపం, ఒంటరితనం కలిగిస్తోంది. ముదిరాజుల వెనకబాటుతనం - ఇది కేవలం సంఖ్యల కథ కాదు, ఇది ఒక హృదయ విదారక వాస్తవం, ఒక సమాజం యొక్క బాధను, నిరాశను, ఆత్మగౌరవ లోటును మన ముందుంచుతున్న జీవన గాథ.



**- పిట్టల రవీందర్**
**(రచయిత "ముదిరాజ్ అధ్యయన వేదిక" వ్యవస్థాపకులు, "ముదిరాజ్ విద్యావంతుల వేదిక" సలహాదారులు)**

# తెలంగాణలో విద్యా విప్లవానికి ఆరుట్ల నుంచే శ్రీకారం

- అంతర్జాతీయ ప్రమాణాలతో తెలంగాణ పబ్లిక్ స్కూల్
- వచ్చే నెల 15న సీఎం చేతుల మీదుగా ప్రారంభించేందుకు చర్యలు
- రాష్ట్రవ్యాప్తంగా ఇదే తరహాలో విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం కృషి
- ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను సందర్శించిన రాష్ట్ర ప్రభుత్వ విప్ లు
- అధునాతన హంగుల ప్రభుత్వ బడిని చూసి హర్షం
- విప్‌లను సన్మానించిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి



**ఇబ్రహీంపట్నం, మే 8 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టు కింద ఆరుట్లలో నిర్మించిన తెలంగాణ పబ్లిక్ స్కూల్ కేవలం ఒక బడి మాత్రమే కాదు తెలంగాణ విద్యా వ్యవస్థలో రాబోయే విప్లవాత్మక మార్పులకు ఒక ప్రయోగశాలగా ప్రభుత్వ విప్ లు అభివర్ణించారు. ఇక్కడి ప్రతీ సౌకర్యం ఇంటర్నేషనల్ స్కూల్ కు ధీటుగా ఉండటం విద్యావ్యవస్థ పట్ల రేవంత్ రెడ్డి ప్రభుత్వానికున్న చిత్తశుద్ధికి నిదర్శనంగా పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను ప్రభుత్వ విప్ లు ఆది శ్రీనివాస్, చింతకుంట విజయరమణ రావు, యెన్నం శ్రీనివాస్ రెడ్డి, వేముల వీరేశం, బీర్ల అయిలయ్య, రామచందర్ నాయక్, అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్ సందర్శించారు. శుక్రవారం ఉదయం ఆరుట్ల గ్రామానికి చేరుకున్న వీరికి స్వాగతం పలికిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్మాణం, సౌకర్యాలు, పనితీరు గురించి రాష్ట్ర విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి వారికి వివరించారు. ఇంటిగ్రేటెడ్ విద్యా వ్యవస్థ, అధునాతన తరగతి గదులు, ఉచిత బస్సు సౌకర్యం, ప్రయోగశాలలు, గ్రంథాలయం, క్రీడామైదానం, జిమ్, భోజన సౌకర్యాలు, ఇతర మౌలిక వసతులను ఆకునూరి మురళి, ఎమ్మెల్యే మల్ రెడ్డి వివరించారు. కార్పొరేట్ విద్యాసంస్థల్ని తలదన్నేలా ప్రభుత్వం నిర్మిస్తున్న పాఠశాలను చూసి ప్రభుత్వ విప్ లు హర్షం వ్యక్తం చేశారు. ఇదే తీరుగా రాష్ట్రంలో 100 చోట్ల తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల నిర్మాణానికి ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసినట్లు చెప్పారు. ఇందుకోసం ఆరుట్ల పాఠశాలను నమూనాగా తీసుకోనున్నట్లు తెలిపారు. భావిభారతం అభివృద్ధిపథంలో సాగాలంటే విద్య అతిముఖ్యమని అందుకోసమే విద్యావ్యవస్థను బాగుచేసి, దేశభవిష్యత్తుకు ప్రభుత్వం బంగారుబాటలు వేస్తుందని చెప్పారు.

రాష్ట్ర విద్యావిప్లవానికి తమ నియోజకవర్గం నుంచి ప్రభుత్వం శ్రీకారం చుట్టడం ఇబ్రహీంపట్నం ప్రజల అదృష్టంగా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ, విద్యాకమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి మార్గదర్శకంగా అత్యున్నత ప్రమాణాలతో ఈ పబ్లిక్ స్కూల్ పూర్తైందని చెప్పారు. విద్యావైద్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఈ సారి బడ్జెట్ లో రూ.26వేల కోట్లకు పైగా విద్యకు కేటాయింపులు చేయటమే ఇందుకు నిదర్శనమన్నారు. పేదలందరికీ ఉచితంగా ఉన్నత ప్రమాణాలతో విద్యనందించిన నైపుణ్యం గల యువతను దేశానికి అందించటమే లక్ష్యంగా పనిచేస్తోందని ఈ అవకాశాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ ఛైర్మన్ కంబాలపల్లి గురునాథ్ రెడ్డి, రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి, భూపతిగల్ల మహిపాల్, స్థానిక సర్పంచ్ మానుపాటి శోభాకుమార్, హెచ్ఎం గిరిధర్ గౌడ్, మంచాల సహకార సంఘం ఛైర్మన్లు వెదిరే హనుమంత్ రెడ్డి, పాండు రంగారెడ్డి,నాయకులు సాతిరి ఎల్లేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గుడిమల్ల చంద్రయ్య, మాసయ్య గౌడ్, మార సురేష్, బైరీక రమాకాంత్ రెడ్డి, అనంగల్ల యాదయ్య, ఎడమ నరేందర్ రెడ్డి వెదిరే సికిందర్ రెడ్డి, నూకం బాలరాజు,చిందం శ్రీశైలం, అన్నిశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కాంట రవాణా వేగంగా జరగాలి

- అదనపు కలెక్టర్ నగేష్



**కౌడిపల్లి, మే 8 (జనంసాక్షి) :** అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం కొనుగోలు, రవాణా వేగంగా జరగాలని అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. కౌడిపల్లి మండలం మహ్మద్ నగర్ గ్రామంలోని ఫ్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలని అదనపు కలెక్టర్ నగేష్,శుక్రవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఇప్పటి వరకు ఎంత ధాన్యం వచ్చింది. ఎంత మందికి టోకెన్ ఇచ్చారు. ఎంత కొనుగోలు చేసారు. లారీలు ఏటైంకి వస్తున్నాయి. లోడింగ్, ఆన్ లోడింగ్ కి ఎంత టైమ్ పడుతుంది అని తదితర వివరాలను కేంద్ర నిర్వాహకులని అడిగి తెలుసుకున్నారు. కేంద్రాలలో గాని మిల్లుల వద్ద గాని ఏమైనా సమస్యలు తలేత్తితే వెంటనే రాత పూర్వకంగా తమ దృష్టికి తీసుకరావాలని వెంటనే తగు చర్యలు తీసుకుంటామని రైతులకు అదనపు కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నగేష్, మాట్లాడుతూ... ఇప్పటివరకు 60 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుండి కొనుగోలు చేసి 14వేల మంది రైతులకు 52 కోట్ల రూపాయలు రైతుల ఎకౌంట్లో జమ. చేయడం జరిగిందన్నారు. ధాన్యాన్ని చివరికి గింజ వరకు కొంటాం రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు అని వివరించారు. అకాల వర్షాలతో ధాన్యాన్ని కాపాడడానికి టార్పాలిన్ కవర్లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. లోడింగ్ ప్రక్రియను అతి త్వరగా చేపట్టాలని, లేబర్ ను, లారీలను అందుబాటులో ఉంచుకోవాలని, నిబంధనల మేరకు తేమశాతం ఉండాలని, నిర్వాహకులకు సూచించారు. మిల్లర్లు ధాన్యం అన్లోడింగ్ ప్రక్రియను త్వరగా చేసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కొనుగోలు సెంటర్ నిర్వాహకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## టౌన్ ప్లానింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించండి



**శేరిలింగంపల్లి, మే 08 (జనంసాక్షి) :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి తీసుకుంటున్న అర్జీలు, అందుతున్న ఫిర్యాదులపై సమగ్రతతోపాటు సత్వర పరిష్కారానికి మార్గాలను అన్వేషించాలని సిఎంసి కమిషనర్ సృజన అధికారులకు సూచించారు. ఈ మేరకు శుక్రవారం టౌన్ ప్లానింగ్ పనుల తీరుతెనులపై ఆమె సిఎంసి పరిధి ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టౌన్ ప్లానింగ్ విభాగ్యానికి దరఖాస్తుల స్వీకరణతోపాటు త్వరితగతిన పరిష్కారం మరియు పటిష్టమైన క్షేత్రస్థాయి నిఘాను నిర్వహించాలని సంబంధిత ఉన్నతాధికారులకు ఆదేశాలను జారీ చేయడం జరిగిందన్నారు. ఇందులో భాగంగానే సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ విభాగం సమస్యల పరిష్కారం నిమిత్తం అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. అన్ని జోన్ల పరిధిలో పనుల గడువు, పారదర్శకత మరియు క్షేత్రస్థాయి ఆచరణ విధానాలను గూర్చి, వాటిని మెరుగుపరచాల్సిన కీలక అంశాలపై సమావేశంలో ప్రధానంగా చర్చించడం జరిగిందన్నారు. అంతేకాకుండా దరఖాస్తుల స్థితిగతులు, ఆక్రమణల తొలగింపు మరియు పెండింగ్ అంశాలను నిశితంగా సమీక్షించడం జరిగిందన్నారు. సమీక్షిభవన నిర్మాణ అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికేట్లు, టిడిఆర్ మరియు ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను కమిషనర్ ఈ సందర్భంగా క్షుణ్ణంగా పరిశీలించినట్లు తెలియజేశారు. ప్రాధాన్యత కలిగిన ప్రాంతాల్లో భూసేకరణ పనులకు ఉన్న అడ్డంకులను తొలగించి, రోడ్డు విస్తరణ పనుల్లో వేగం పెంచాలని ఆమె స్పష్టం చేశారు. ప్రజల భద్రత దృష్ట్యా శిథిలావస్థకు చేరిన మరియు ప్రమాదకరమైన భవనాలపై తీసుకున్న క్షేత్రస్థాయి చర్యలను సమావేశంలో సమీక్షించినట్లు తెలిపారు.

# సైబరాబాద్ షీ టీమ్‌ల పనితీరు భేష్

- డిసిపి సృజన

**శేరిలింగంపల్లి, మే 08 (జనంసాక్షి) :** సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గత వారం చీటీలు నిర్వహించిన పనితీరు విధానం బేష్ గా ఉందని సైబరాబాద్ వుమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ వింగ్ డిసిపి కె. సృజన పేర్కొన్నారు. ఈ మేరకు గతవారం( మే 2 నుండి 7వ తేదీ వరకు కు సంబంధించిన నివేదికను మీడియా ప్రకటన ద్వారా తెలియజేస్తూ 99 మాయోపాయ ఆపరేషన్లు నిర్వహించి బహిరంగ ప్రదేశాలలో అసభ్యకర చర్యలకు పాల్పడుతున్న 32 మందిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకోవడం జరిగిందన్నారు. చిన్న కేసుల విభాగంలో 42 కేసులు నమోదు చేసి, మిగిలిన వారికి కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగిందన్నారు. షీ టీమ్‌లకు వివిధ మార్గాలద్వారా మహిళా బాధితుల నుండి 17 ఫిర్యాదులు కూడా అందాయని, సైబరాబాద్ మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం 3 పిఐటిఎ కేసులలో ముగ్గురిని రక్షించి, 6 మంది నిందితులను అరెస్టు చేసిందన్నారు. 2 జెజె యాక్ట్ కేసులలో నలుగురు బాధితులైన బాలురను రక్షించి, నలుగురు నిందితులను అరెస్టు చేసినట్టు తెలియజేశారు. కుటుంబ కౌన్సిలింగ్ కేంద్రాలు/సిడిఇడబ్ల్యు లలో భార్యాభర్తల కుటుంబ కలహాలలో చిక్కుకున్న 33 కుటుంబాలను తిరిగి కలిపేందుకు మంచి ప్రయత్నాలు జరిగినట్లు తెలిపారు. నివారణ




మరియు అవగాహన చర్యలలో భాగంగా ఏహెచ్టియు మరియు షీ బృందాలు సైబరాబాద్‌లోని వివిధ ప్రాంతాలలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమాలలో సుమారు 1685 మంది పాల్గొన్నారని, వీరికి మానవ అక్రమ రవాణా మరియు బాలల అక్రమ రవాణా, ఈవ్ టీజింగ్, సోషల్ మీడియా వేధింపులు, బాల్య వివాహాలు, బాలల హక్కులు, బాల కార్మికత, వెంటపడటం (స్టాకింగ్), భిక్షాటన, సైబర్ బెదిరింపులు, సైబర్ మోసాలు మొదలైన అంశాలపై అవగాహన కల్పించినట్లు డిసిపి సృజన తెలిపారు. కల్పించారు. మహిళా హెల్ప్‌లైన్ 181, బాలల హెల్ప్‌లైన్ 1098, డయల్ 100 ప్రాముఖ్యత, క్రైమ్స్ 1930 మరియు ఇతర అంశాలపై కూడా అవగాహన కల్పించడం జరిగిందని ఆమె వివరించారు. సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ ఉమెన్స్ సేఫ్టీ ఫోరం, మాదాపూర్‌లోని బ్యాంక్ ఆఫ్ అమెరికా సహకారంతో ఉద్యోగులలో సంసిద్ధత, అప్రమత్తత మరియు చురుకైన భద్రతా చర్యలను ప్రోత్సహించే లక్ష్యంతో ఒక సమగ్ర మహిళా భద్రతా అవగాహన సదస్సును విజయవంతంగా నిర్వహించగా ఈ కార్యక్రమంలో 100 మంది ఉద్యోగులు ప్రత్యక్షంగా మరియు 200 మందికి పైగా వర్చువల్‌గా పాల్గొన్నట్లు డిసిపి తెలిపారు. మహిళల భద్రత, నిజజీవిత అత్యవసర పరిస్థితులు, నివారణ వ్యూహాలు మరియు సకాలంలో ఫిర్యాదు చేయడం యొక్క ప్రాముఖ్యతపై విలువైన అభిప్రాయాలను పంచుకున్నారు. మహిళలకు సురక్షితమైన వాతావరణాన్ని కల్పించడంలో సైబరాబాద్ పోలీసుల కార్యక్రమాల పాత్రను కూడా ఆమె ప్రముఖంగా ప్రస్తావించారు. సవాలుతో కూడిన పరిస్థితులను ఎదుర్కోవడంలో అప్రమత్తంగా, సమాచారంతో, ఆత్మవిశ్వాసంతో ఉండాలని ఆమె సదస్సులో పాల్గొన్నవారిని ప్రోత్సహించారు. ఈ సదస్సు, ఉద్యోగులకు ఆచరణాత్మక భద్రతా అవగాహన, అత్యవసర ప్రతిస్పందన యంత్రాంగాలు మరియు సురక్షితమైన కార్యాలయ సంస్కృతిని నిర్మించడంలో సామూహిక బాధ్యత యొక్క ప్రాముఖ్యతపై దృష్టి సారించినట్లు పేర్కొన్నారు.

## పశువుల ఆరోగ్య పరిరక్షణపై శ్రద్ధ చూపాలి

**చేవెళ్ల, మే 8 (జనంసాక్షి) :** పశువుల ఆరోగ్య పరిరక్షణపై రైతులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, సకాలంలో వైద్య సేవలు అందిస్తే పశుసంపద ద్వారా రైతులు ఆర్థికంగా మరింత బలోపేతం అవుతారని పల్గుట్ట పశు వైద్యాధికారి డాక్టర్ వి.శిరీష, ఆలూర్ పశువైద్యాధికారి డాక్టర్ దేవేందర్ రెడ్డి అన్నారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక రైతు వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం చేవెళ్ల మండల పరిధిలోని అల్లవాడ గ్రామంలో నిర్వహించిన పశువైద్య శిబిరంలో పాల్గొని వారు మాట్లాడారు. గ్రామీణ ప్రాంత రైతులకు ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ ద్వారా నాణ్యమైన వైద్య సేవలు అందిస్తోందని తెలిపారు. గ్రామ సర్పంచ్ జుట్టు లావణ్య యాదయ్య, ఉప సర్పంచ్ మధుసూదన్ రెడ్డి శిబిరాన్ని ప్రారంభించి రైతులకు అందుతున్న సేవలను వివరించారు. పశువులకు వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, నట్టల నివారణ మందులు, టీకాలు తప్పనిసరిగా వేయించాలని సూచించారు. శిబిరంలో 19 దూడలకు నట్టల నివారణ మందులు వేయగా, 38 పశువులకు గర్భకోశ సంబంధిత వ్యాధులకు చికిత్స అందించారు. అలాగే 136 మేకలకు నట్టల నివారణ మందులు వేశారు. గోమార్లు, పిడుదుల నిర్మూలనకు అవసరమైన మందులను రైతులకు పంపిణీ చేశారు. పశు



వుల మేత సమస్యను దృష్టిలో పెట్టుకుని రైతులకు 75 శాతం సబ్సిడీపై గడ్డి విత్తనాలు అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. పశువుల్లో ఏవైనా అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే సమీప పశువైద్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో బాలకోటేశ్వర్, ఎల్ఎస్ఏలు శ్రీనివాస్, గిరీశ్వర్, గోపాలమిత్ర నరేష్, రాజేష్, అటెండర్లు దేవేందర్, అశోక్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం

**జడ్చర్ల, మే 8 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో రాబోయే రోజుల్లో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కళ్యాణ్ నాయక్ ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం జడ్చర్ల పట్టణంలో జరిగిన పత్రికా సమావేశంలో ఆయన రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డితో కలిసి మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు దేశాన్ని అగ్రపథంలో నిలుపుతున్నాయని కొనియాడారు. ఇటీవల మూడు రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీ సాధించిన విజయాలు తెలంగాణలో పార్టీ విజయానికి నాంది అని ఆయన పేర్కొన్నారు. మే 10వ తేదీన హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సభకు ప్రజలు స్వచ్ఛందంగా, భారీ సంఖ్యలో తరలిరావాలని కోరారు.



## మక్కల కొనుగోలులో జాప్యంపై ఆగ్రహం

జడ్చర్ల వ్యవసాయ మార్కెట్‌లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను సందర్శించిన ఆయన, రైతుల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై మండిపడ్డారు. పది రోజులుగా రైతులు మార్కెట్‌లో మక్కలతో వేచి చూస్తున్నా, ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడం దారుణమన్నారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించి, మక్కలను కొనుగోలు చేయాలని అధికారులను డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ప్రభుత్వంపై పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు అమర్నాథ్ గౌడ్, రాష్ట్ర కిసాన్ మోర్చా నాయకులు ఎంబి బాలకృష్ణ, కౌన్సిల్ మెంబర్ ముచ్చర్ల కృష్ణయ్య, జిల్లా అధికార ప్రతినిధి బాలవర్ధన్ గౌడ్, జిల్లా నాయకులు శ్రీనివాస్ రెడ్డి, సాములు నర్సింహులు, నడిమింటి శ్రీనివాసులు, బుక్క నవీన్, మురళీకృష్ణ, మండల అధ్యక్షులు గోపాల్ నాయక్, నరేష్ నాయక్, ప్రధాన కార్యదర్శి వెంకట్, జగదీష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్
- బస్సు ప్రయాణికులను లక్ష్యంగా చేసుకొని దొంగతనాలు
- అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు

**చేర్యాల, మే 8 (జనంసాక్షి) :** మహిళలు, వృద్ధులు ఒంటరిగా వెళ్లేటప్పుడు జాగ్రత్తలు తీసుకొని అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ ప్రజలకు సూచించారు. బస్సు, ఆటోలో ప్రయాణించే ప్రయాణికులను లక్ష్యంగా ఎంచుకొని దొంగతనాలకు పాల్పడుతున్న ఆంధ్రప్రదేశ్ కు చెందిన ముఠాను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ తెలిపారు. శుక్రవారం సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. వారి వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రములోని గుంటూరు జిల్లా అచ్చంపేట, వినుగొండ, నాదెండ్ల మండలాలకు చెందిన ఆవుల నాగమణి, ఆవుల లక్ష్మి, కంకణాల మరియమ్మ, యాతం కోటేశ్వర్, గంజనబోయిన దినేష్ అనే పై నిందితులు సులభంగా డబ్బులు సంపాదించాలని ఒక ముఠాగా ఏర్పడి బస్సులు, ఆటోలలో ప్రయాణించే మహిళలను లక్ష్యంగా చేసుకొని గత పది రోజుల క్రితం గుంటూరులోని ఆటోలో ప్రయాణిస్తున్న వృద్ధ మహిళ వద్ద ఉన్న బ్యాగులో బంగారు నెక్లెస్ ను దొంగలించారు.




అనంతరం సత్తెనపల్లి ప్రాంతంలో ఏపీ27వీ 6689 గల ఇన్నోవా కారులో యాదగిరిగుట్టకు వెళ్లి దర్శనం చేసుకున్నారు. అనంతరం బస్టాండ్, ఆటో స్టాండ్ ల వద్ద బ్యాగులతో ప్రయాణించే మహిళలను గమనిస్తూ దొంగతనాలకు పాల్పడే పథకం రూపొందించారు. ఏప్రిల్ 30న యాదగిరిగుట్టకు వచ్చిన ఈ ముఠా బచ్చన్నపేట బస్టాండ్ ఆవరణలో ఓ కుటుంబం వద్ద ఉన్న బ్యాగును గమనించారు. సిద్దిపేటకు వెళ్తున్న బస్సులో ఎక్కగా నాగమణి,లక్ష్మీ అనే నిందితులు అదే బస్సును ఎక్కి బస్సులో రద్దీని ఆసరాగా చేసుకుని నాగమణి అస్వస్థగా నటిస్తూ బాధితురాలు దగ్గర కూర్చొని బ్యాగ్ తెరిచి అందులో ఉన్న బంగారు కాసులపేరును అపహరించారు. చేర్యాలలో బస్సు దిగి ఈ ముఠా సభ్యులు ఇన్నోవా కారులో అక్కడినుండి పరారయ్యారు. తిరిగి మళ్ళీ ఇన్నోవా కారులో చేర్యాల వైపు వస్తుండగా చుంచనకోట క్రాస్ రోడ్డు వద్ద అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని విచారించగా 2తులాల బంగారు నాన్ గొలుసు, 7తులాల నర బంగారు కాసులపేరు దొంగలించినట్టు నేరాలు ఒప్పుకున్నన్నారని తెలిపారు. ఈ సందర్భంగా సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ మాట్లాడుతూ.. ప్రస్తుతం బంగారు ధరలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో బంగారం వెండి దొంగతనాలు పెరిగే అవకాశం ఉందని తెలిపారు. మహిళలు, వృద్ధులు ఒంటరిగా ప్రయాణించే సమయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సురక్ష నేత్రాలలో భాగంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా నేరస్తులను సులభంగా పట్టుకోవడం జరిగిందని తెలిపారు. గ్రామస్తులు ముందుకొచ్చి ప్రవేశ మార్గాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. అపరిచిత వ్యక్తులతో మాట్లాడకుండా అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా కనిపిస్తే వెంటనే 100 నెంబర్ కు ఫోన్ చేయాలని హెచ్చరించారు. కేసు చేదనలో త్వరితగతిన నిందితులను పట్టుకొని ప్రతిభ కనబరిచిన చేర్యాల సిఐ బానోతు రమేష్ నాయక్, ఎస్సై గూడ అపూర్వ రెడ్డి, కానిస్టేబుల్ రవి, అశోక్, హెచ్.జీ శ్రీనివాస్, మంజుల, కవితలను పోలీస్ కమిషనర్ అభినందించారు. సమావేశంలో సిద్దిపేట అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్, హుస్నాబాద్ ఏసీపీ సదానందం, పోలీసులు పాల్గొన్నారు.

## యువత వ్యాపారరంగంలో వృద్ధి చెందాలి



**ఫరూఖ్‌నగర్, మే 8 (జనంసాక్షి) :** షాద్ నగర్ పట్టణంలోని మహబూబ్‌నగర్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన అర్ ఎన్ గ్రాండ్ ఫ్యామిలీ రెస్టారెంట్‌ను మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఘనంగా ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి రెస్టారెంట్‌ను ప్రారంభించారు. అనంతరం నిర్వాహకులను అభినందిస్తూ, వ్యాపార రంగంలో మంచి గుర్తింపు సాధించి మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పట్టణ అభివృద్ధికి తోడ్పడే విధంగా కొత్త వ్యాపార సంస్థలు ప్రారంభం కావడం ఆనందదాయకమని తెలిపారు. యువత స్వయం ఉపాధి దిశగా ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. కుటుంబ సమేతంగా వచ్చే ప్రజలకు మంచి సేవలు అందించి అర్ ఎన్ గ్రాండ్ ఫ్యామిలీ రెస్టారెంట్ మంచి పేరు సంపాదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ ఛైర్మన్ వంకాయల నారాయణరెడ్డి, కౌన్సిలర్ ఎస్పీ శివ, నాయకులు నక్కల వెంకటేష్ గౌడ్, వెంకట్రాం రెడ్డి, చీపిరి రవి, రాజేందర్ సింగ్, పాపయ్య యాదవ్, ఆంజనేయులు, కంది రాఘవేందర్ గౌడ్, సందీప్ సింగ్, నవీన్, వెంకటేష్ గుప్తా, సిద్దు యాదవ్, శీలం శ్రీకాంత్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
09 మే 2026

# చేపల ఉత్పత్తిలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలపడమే ప్రభుత్వ లక్ష్యం

- వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి

**వనపర్తి బ్యూరో, మే 8 (జనంసాక్షి) :** మత్స్యకారులకు అన్ని రకాలుగా సహకారం అందించి, వారికి అవసరమైన సౌకర్యాలను కల్పించి, చేపల ఉత్పత్తిలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలపడమే ప్రభుత్వ లక్ష్యం అని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి అన్నారు. శుక్రవారం నాగవరం శివారులోని రైతు వేదికలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక రైతు వారోత్సవాల్లో భాగంగా జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో మత్స్యకార రైతులకు అనేక అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వనపర్తి శాసనసభ్యులు మేఘారెడ్డి తో పాటు, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మత్స్యకారులకు అన్ని రకాలుగా సహకారం అందించి, వారికి అవసరమైన సౌకర్యాలను కల్పించి, చేపల ఉత్పత్తిలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలపడమే ప్రభుత్వ లక్ష్యం అని పేర్కొన్నారు. చేపల్లో అత్యధికంగా ప్రోటీన్ ఉండడం కారణంగా వైద్యులు చేపలు తినడం ఆరోగ్యానికి మేలు చేస్తుందని సిఫారసు చేస్తున్నారని తెలిపారు. ఈ క్రమంలో జిల్లాలో అందరికీ మంచి చేపలను అందించేలా చర్యలు చేపడతామన్నారు. జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో మత్స్యకారులు చేపల విక్రయాలు చేసుకునేందుకు వారికి కావాల్సిన సౌకర్యాలు ఏమున్నా తమను



సంప్రదించవచ్చని, అన్ని రకాల సౌకర్యాలు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ సౌకర్యాలను మత్స్యకారులు వినియోగించుకొని మంచి దిగుబడి సాధించాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. మత్స్యకారులకు మొబైల్ వాహనాలు, సబ్సిడీ అతి తక్కువ వడ్డీ రేటు తో రుణాలు సహా అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. అదేవిధంగా వనపర్తి నల్లచెరువు కట్టపై గంగమ్మ తల్లి దేవాలయాన్ని పూర్తిస్థాయిలో నిర్మించుకునేందుకు సహకరిస్తామని తెలిపారు. నల్ల చెరువు కట్ట టూరిజానికి హబ్ మాదిరి కానుందని ఇప్పటికే ఓపెన్ జిమ్ సహా ప్రజలకు కావాల్సిన పలు సౌకర్యాలు అక్కడ ఉన్నాయని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలో అత్యధికంగా ఉన్న ముదిరాజులకు పెద్దపీట వేయాలని ఆలోచనతో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని మంత్రివర్గంలో చోటు కల్పించి సమన్నత స్థానం ఇచ్చారని తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక రైతు వారోత్సవాల్లో భాగంగా చేపల వ్యాధుల నియంత్రణపై అవగాహన కార్యక్రమం కల్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని మత్స్యకారులు దిగుబడి పెంచుకునేందుకు మెలకువలు తెలుసుకోవాలని సూచించారు. కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా మస్యకారులకు అతి తక్కువ వడ్డీతో రుణాలు కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మత్స్యకారులు చేపలు విక్రయించుకోవడానికి అందుబాటులో ఉన్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ అవగాహన కార్యక్రమానికి పెబ్బేరు ఫిషరీస్ కళాశాల నుంచి వచ్చిన ప్రొఫెసర్ల నుంచి రైతులకు ఏమైనా సలహాలు సూచనలు కావాలంటే తెలుసుకోవాలని తెలియజేశారు. ఈ సందర్భంగా గోపాల్పేట మండలం చాకలి పల్లి గ్రామానికి చెందిన మహిళా పారిశ్రామిక సహకార సంఘానికి ధ్రువపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి లక్ష్మప్ప, మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి, పెబ్బేరు మత్స్య కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ దేవానంద్, సిఎస్సి ప్రతినిధి మాలిక్, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లాలోని మస్యకార సహకార సంఘాల నాయకులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం సేకరణ నువేగవంతం చేయాలి

- రైస్ మిల్లర్లకు తూప్రాన్ ఆర్డిఓ జయచంద్రారెడ్డి సూచన



**వెల్దుర్తి, మే 8 (జనం సాక్షి) :** రైస్ మిల్లర్లు ధాన్యం సేకరణ ను వేగవంతం చేయాలని తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి అన్నారు శుక్రవారం వెల్దుర్తి మండల కేంద్రంలోని మహాగణపతి రైస్ మిల్ తోపాటుమండలంలోని హస్తాల్పూర్ ధాన్యము కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లర్లు త్వరిగతిన అన్లోడింగ్ చేసుకునేందుకు సరిపడే హమాలీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు అనంతరం తాసిల్దార్ కార్యాలయంలో అటవీ ఫారెస్ట్ భూముల సరిహద్దు పరిష్కారం కోసం ఇరు శాఖల అధికారులతో కలిసిల్యాండ్ రీ కన్సిలేషన్ సమావేశాన్ని నిర్వహించారు మండలంలో ఇరు శాఖల మధ్య ఏవైనా అటవీ రెవెన్యూ భూముల సరిహద్దు వివాదముంటే సర్వే నిర్వహించి పరిష్కరించాలని అధికారులకు సూచించారు మండలంలోని మంగళపర్తి హస్తాల్పూర్ గ్రామాల పరిధిలో సర్వే నెంబర్లు 401,283 లలో అటవీ రెవెన్యూ సరిగద్దు వివాదంపై పరిష్కరిష్కరించేందుకు కృషి చేయాలని సమావేశంలో సూచించారు సమావేశంలో తహసిల్దార్ శ్రీనివాస్ సెక్షన్ ఆఫీసర్లు కలీం,భూపతి ఆర్ఐ నర్సింగ్ యాదవ్ బీట్ ఆఫీసర్ భరత్ సిబ్బంది పాల్గొన్నారు.

## తలసేమియా అవగాహన ర్యాలీ



**నాగర్‌కర్నూల్, మే 8 (జనంసాక్షి) :** నాగర్ కర్నూల్ 2035 సంవత్సరం వరకల్లా తలసీమియా రహిత భారతదేశం కోసం అందరూ కలిసి పనిచేయాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీ అమరేందర్ తెలిపారు. నేడు ప్రపంచ తలసీమియ దినం సందర్భంగా నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ప్రపంచ తలసీమియా అవగాహనారాలిని జెండా ఊపి జిల్లా అదనపు కలెక్టర్ పి అమరేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తలసీమియ అనేది వంశపారపర్యంగా వచ్చే జన్యుపరమైన రక్త సంబంధ వ్యాధి. తలసీమియా వ్యాధి లో రక్తంలో హిమోగ్లోబిన్ సరిగా తయారవ్వదు. దీని వలన వీరు తరచుగా రక్తహీనతకు గురవుతారు. కేవలం రక్త పరీక్ష ద్వారా తలసీమియాను గుర్తించవచ్చు. తలసీమియా తీవ్రతను బట్టి కొందరికి తరచుగా రక్తమార్పిడి అవసరం కూడా ఏర్పడుతుంది. క్రమం తప్పకుండా చికిత్సతీసు కోవాలి. పెళ్లికి ముందు రక్త పరీక్షలు, గర్భవతిగా ఉన్నప్పుడు ముందస్తుగా రక్తపరీక్షలు నిర్వహించడం ద్వారా తలసేమియా వాహకులు, వ్యాధిగ్రస్తులను గుర్తించవచ్చు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య మరి ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. రవికుమార్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ కృష్ణమోహన్, డాక్టర్ ప్రదీప్ కుమార్, వైద్యాధికారి డాక్టర్ వాణి, డాక్టర్ సృజన, పర్యవేక్షణ సిబ్బంది ఫసియుద్దీన్, కోట్ర నిరంజన్, విజయ్ కుమార్ విజయ్, కొట్ర బాలాజీ, సురేష్ కుమార్, కళ్యాణ్ కృష్ణ, కుమార్, ఏ ఎన్ ఎం లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లలో రైస్ మిల్లర్ల పాత్ర కీలకం



**సంగారెడ్డి, మే 8 (జనం సాక్షి) :** జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా నిర్వహించేందుకు రైస్ మిల్లర్ల పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోళ్లపై రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రస్తుతం జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు కొనసాగుతున్న నేపథ్యంలో రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా అధికారులు, మిల్లర్లు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల నుండి మిల్లులకు చేరుతున్న ధాన్యాన్ని వెంటనే అన్‌లోడ్ చేసుకోవాలని, ఆలస్యం జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ టి.ఎల్. సంగీత, జిల్లా పౌర సరఫరాల అధికారి, సివిల్ సప్లై డీఎం, డి సి ఓ,రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ప్రతినిధులులేని ప్రగతి ప్రణాళిక

**రాజాపూర్, మే 8 (జనంసాక్షి) :** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మత్స్య శాఖ ఆధ్వర్యంలో మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన సమావేశంలో, మహబూబ్‌నగర్ జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల సభ్యులు దాదాపు 300మంది పాల్గొనడం జరిగింది. మత్స్య కారులు తమ సమస్యలను, చెరువుల పునరుద్ధరణకు కావలసిన బడ్జెట్, సంఘాల రిజిస్ట్రేషన్ లో మత్స్య శాఖ అధికారులు చేస్తున్న జాప్యం గురించి, చేపపిల్లల పంపిణీలో కొన్ని సంఘాలకు అన్యాయం జరిగిందని, ఇలా చాలా సమస్యలపై ప్రజాప్రతినిధులైన మహబూబ్‌నగర్ జిల్లా కు సంబంధించిన ఎమ్మెల్యేలు వస్తే తమ సమస్యలను వివరించాలని ఎంతో ఆశగా వచ్చిన 254 సంఘాల సభ్యులకు నిరాశ ఎదురైంది. ఒక్క ఎమ్మెల్యే కూడా ఈ కార్యక్రమానికి రాకపోవడంతో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని బహిష్కరించబోయిన మత్స్యకారులు. మత్స్య కారులను సంఘం నాయకులు గోనేల శ్రీనివాస్, శివప్రసాద్ సర్ది చెప్పడంతో మత్స్యకారుల సమావేశంలో కూర్చున్నారు. మత్స్యశాఖ ఏడి రాధరోహిణి మత్స్యకారుల సమస్యలు పట్టించుకోవడం లేదని మత్స్యకారులు వాపోయారు. మత్స్యకారుల డిమాండ్‌లు మత్స్యకార సొసైటీ లపై జరుగుతున్న దాడులకు ప్రత్యేక చట్టం తెవలని ప్రభుత్వాన్ని



కోరారు. చెరువు కట్టలను, అలుగు లను లీకేజీ లు లేకుండా చేయాలని కోరారు. చెరువుల్లో ఉన్న పిచ్చి మొక్కలను, రబ్బరు మొక్కలను తొలగించాడానికి జాతీయ ఉపాధిహామి పథకానికి అనుసంధానం చేయాలని కోరారు. చెరువుల్లో ఇష్టానుసారంగా మట్టి తీయడంతో చేపలకు కావలసిన పోషకాలు లేక చేపల దిగబడి తగ్గిపోతుందని తెలిపారు. ఇలాంటి ఎన్నో సమస్యలు ఏడి రాధరోహిణి కి తెలిపిన మత్స్య కారులు. వీటన్నిటినీ ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెలతారా లేదా వేచి చూడాలి. ఉదయం పది గంటల నుండి రెండు గంటల వరకు సమావేశంలో ఉన్న మత్స్య కారులకు భోజనం ఏర్పాటు చేయని మత్స్యశాఖ అధికారులు. ముదిరాజ్‌లు, మత్స్య కార సంఘాలు అంటే ప్రజాప్రతినిధులకు, సంబంధిత శాఖ కు ఇంత చులకనా అని మత్స్య కారులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## పశువుల అక్రమ రవాణా నివారణకు పటిష్ట చర్యలు

- డీఎస్పీ నల్లపు లింగయ్య




**నారాయణపేట, మే 8 (జనం సాక్షి) :** పశువుల అక్రమ రవాణా కు పటిష్ట చర్యలు తీసుకుం టామని నారాయణపేట డీఎస్పీ లింగయ్య తెలిపారు. శుక్రవారం విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్, గో రక్షకులు, బిజేవైఎం సభ్యులతో డీఎస్పీ నల్లపు లింగయ్య, నారాయణపేట పోలీసులు నారాయణపేట టౌన్ పోలీసు స్టేషన్ లో ప్రత్యేక సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ రాబో యే బక్రీద్ పండుగ సంద ర్భంగా ఎక్కడైనా గోవుల అక్రమ రవాణా జరిగితే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అంతేకాకుండా నేరుగా వెళ్లి గోవులను తరలిస్తున్న వాహనాలను అడ్డుకోవడం, గొడవలకు దిగడం వంటి చర్యలకు పాల్పడవద్దనిహెచ్చరించారు. బక్రీద్ పండుగ నేపథ్యంలో పశు వుల అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎక్కడైనా అనుమానాస్పదంగా పశువుల అక్రమ రవాణా జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 100 కు సమాచారం అందించాల ని తెలిపారు. అలాగే ఎట్టి పరిస్థితుల్లోనూ చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోకూ దదని, శాంతి భద్రతలకు భంగం కలగకుండా బాధ్యతాయుతంగావ్యవహరించాలని సూచించారు. పశువుల అక్ర మ రవాణాలను అరికట్టేందు కు జిల్లా పరిధిలో 6 బార్డర్ చెక్‌పోస్టులు, ఒక అంతర్ జిల్లా చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసి నిరంతరం నిఘా నిర్వహిస్తూ చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. శాంతియుత సమాజ నిర్మాణమే పోలీసు ల దేయమని డిఎస్పి తెలిపారు. ఈ సమావేశంలో నారాయణపేట సీఐ శివ శంకర్, టౌన్ ఎస్ఐ వెంకటే శ్వర్లు, ఎస్ఐ-2 గాయత్రి, విశ్వహిందూ పరిషత్, బజ రంగ్ దళ్, గో రక్షక కమిటీ అధ్యక్షులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యం

- మెగా జాబ్ మేళాకు 15 వందల మంది హాజరు
- జిల్లా యువజన, క్రీడల అధికారి అఖిలేష్ రెడ్డి



**సంగారెడ్డి, మే 8 (జనం సాక్షి) :** యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా జాబ్ మేళా ఏర్పాటు చేయడం జరుగుతుందని జిల్లా యువజన, క్రీడల అధికారి అఖిలేష్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి మెదక్ జిల్లాకు సంబంధించిన మెగా జాబ్ మేళాను శుక్రవారం సంగారెడ్డి జిల్లా తార డిగ్రీ కళాశాలలో విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, ప్రైవేట్ రంగ సంస్థలతో అనుసంధానం చేయడం లక్ష్యంగా నిర్వహించిన ఈ జాబ్ మేళాకు ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలోని సంగారెడ్డి, మెదక్, సిద్ధిపేట జిల్లాల నుంచి సుమారు 1500 మంది యువతీ యువకులు హాజరయ్యారని తెలిపారు. ఈ జాబ్ మేళాలో ఐటీ, మ్యానుఫ్యాక్చరింగ్, సర్వీస్ సెక్టార్ తదితర రంగాలకు చెందిన సుమారు 60 ప్రముఖ కంపెనీలు పాల్గొని అభ్యర్థులకు ఇంటర్వ్యూలు, స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించినట్లు వెల్లడించారు. అర్హత సాధించిన అభ్యర్థులకు సంబంధిత కంపెనీలు యువజన మరియు క్రీడల వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో నియామక ఉత్తర్వులు అందజేయనున్నట్లు తెలిపారు.

## వడ్ల కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి

- మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి



**నంగునూరు, మే 8 (జనం సాక్షి) :** వడ్ల కొనుగోలులో జరుగుతున్న జాప్యం, ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై బిఆర్ఎస్ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో జరిగిన విలేకర్ల సమావేశంలో మాజీ ఎంపీ జప శ్రీకాంత్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు అనగొని లింగం గౌడ్ మాట్లాడుతూ..కొనుగోలు కేంద్రాల వద్ద సరైన పరికరాలు లేవని, తూకం వేసిన ధాన్యం లారీలు ఎక్కడం లేదని,మిల్లర్ల వైకరిపై చర్యలు లేవని మండిపడ్డారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం వడ్ల కొనుగోలు కూడా చేయరాకపోవడం సిగ్గుచేటని వారు అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఇలాంటి ఇబ్బందులు లేకుండా సాఫీక కొనుగోలు జరిగాయని గుర్తు చేశారు. బి గ్రేడ్ తో కొనుగోలు చేస్తున్న ప్రభుత్వం దీనితో రైతులు దళారులకు అమ్ముతుండగా రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే వడ్లు కొనుగోలు ఏ గ్రేడ్ తో కొనుకోలు చేయాలని ,కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మండల మండల నాయకులు రాగుల సారయ్య, మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు రేకులపల్లి సంతోష్ రెడ్డి , సర్పంచ్ బాల పోచయ్య,మాజీ సర్పంచ్లు జైపాల్, అజిత్ పాల్గొన్నారు.

## ఆరుతడి పంటలతోనే అధిక లాభాలు

- రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో రైతులకు అవగాహన సదస్సు



**వెల్దుర్తి, మే 8 (జనం సాక్షి) :** రైతులకు మేలైన సాగు పద్ధతులపై అవగాహన కల్పించడం తోపాటు వానాకాలం సాగుకు రైతులను సమాయత్తం చసేందుకు వ్యవసాయ శాఖ వారితో కలసి రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే వినూత్న కార్యక్రమాన్ని శుక్రవారం వెల్దుర్తి మండలం శెట్టిపల్లి కలాం గ్రామంలో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి యువ శాస్త్రవేత్త డాక్టర్ టి. ప్రభాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రైతులకు పలు సలహాలు సూచనలు ఇవ్వడం జరిగింది. ముఖ్యంగా రైతులందరూ పంట మార్పిడి విధానాన్ని చేసినట్లయితే భూసారం పెరుగుతుందని అలాగే అధిక రసాయనాలు మరియు ఎరువులు వాడడం వల్ల భూసారం తగ్గి దిగుమతి పూర్తిగా తగ్గుతుందని రైతులందరూ సేంద్రీయ వ్యవసాయాన్ని చేసినట్లయితే పంట పొలాలు ఆరోగ్యంగా ఉంటాయని వాతావరణం కూడా సమతుల్యంగా ఉంటుందని దిగుబడిలో సేంద్రీయ వ్యవసాయం వల్ల పెను మార్పులు చూడవచ్చని అలాగే వర్షాకాలంలో సన్నాలు పండించినట్లయితే ప్రభుత్వం నుంచి వచ్చే 500 రూపాయల సబ్సిడీ రైతుకు అధిక లాభాన్ని చేకూరుతుందని పంటలో పలు మెలకువలను శాస్త్రవేత్తలు రైతులకు చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పడిగే శేఖర్ తో ప గ్రామస్తు మరియు రైతులు పాల్గొన్నారు.

# మత్స్య కార్మికులకు ప్రభుత్వం పెద్దపీట

- జిల్లా అదనపు కలెక్టర్ నగేష్

**మెదక్ జిల్లా బ్యూరో చీఫ్, మే 8 (జనం సాక్షి) :** మత్స్య కార్మికులకు ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లోని మీటింగ్ హాల్లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా జిల్లాస్థాయి మత్స్యకారులకు ఆవగాహన సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా మత్స్యశాఖ ఇన్చార్జి గడప దేవేందర్ లు పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి, రాష్ట్ర గీతం జయ జయహేతో.. కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. మత్స్య సంపదను పరిరక్షించడం ద్వారా మత్స్యకారుల ఆర్థిక స్థితి మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం మత్స్య కార్మికుల సంక్షేమానికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, వాటిని ప్రతి మత్స్యకారుడు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం మార్కెట్‌లో చేపలకు మంచి డిమాండ్ ఉందని తెలిపారు. మత్స్య సహకార సంఘం పర్సన్ ఇంచార్జి గడప దేవేందర్ మాట్లాడుతూ..ప్రతి



మత్స్యకారుడు ప్రకృతి సంపదను కాపాడే బాధ్యతతో పనిచేయాలని పిలుపునిచ్చారు. సరైన పద్ధతుల్లో చేపల పెంపకం చేపడితే మత్స్యకారులకు అధిక ఆదాయం లభిస్తుందని తెలిపారు. జిల్లాలో 200 మత్స్య సొసైటీలో 15,888 మత్స్య కార్మిక సభ్యులు ఉన్నారని, అందులో 25 మంది మహిళా మత్స్య కార్మికులు ఉన్నారన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా మత్స్య శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మల్లేశం మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు, రుణ సౌకర్యాలు, బీమా పథకాలు, మత్స్యకార భరోసా పథకాల గురించి వివరించి ప్రతి లబ్ధిదారుడు నమోదు చేసుకోవాలని కోరారు. మత్స్యకారులకు చేపల పెంపకంలో పాటించాల్సిన శాస్త్రీయ పద్ధతులు, చెరువుల నిర్వహణ, చేపల విత్తనాల ఎంపిక, ఆహార నిర్వహణ, నీటి నాణ్యత పరిరక్షణ, వ్యాధుల నివారణ వంటి అంశాలపై సమగ్రంగా అవగాహన కల్పించారు. అలాగే ఆధునిక సాంకేతికతను వినియోగించి చేపల ఉత్పత్తిని పెంచుకోవచ్చని వివరించారు. మత్స్యకారులు భద్రతా చర్యలను తప్పనిసరిగా పాటించాలని, వర్షాకాలం , తుఫాను సమయాల్లో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. చేపల వేటకు వెళ్లే ముందు వాతావరణ సమాచారం తెలుసుకోవడం, లైఫ్ జాకెట్లు ధరించడం, పడవల భద్రతా ప్రమాణాలను పాటించడం అత్యంత అవసరమని తెలిపారు. అలాగే చెరువుల్లో అక్రమ వేట, విషపదార్థాల వినియోగం, పేలుడు పదార్థాలతో చేపల వేట వంటి చర్యలు మత్స్య సంపదకు తీవ్ర నష్టం కలిగిస్తాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, మత్స్యకారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మహిళా సాధికారతకు మరో ముందడుగు

- నాగారంలో రోలింగ్, పాలిషింగ్ సెంటర్ ప్రారంభం..
- స్వయం ఉపాధికి ప్రోత్సాహం



**ఘట్‌కేసర్, మే 8 (జనం సాక్షి) :** ఘట్‌కేసర్ సర్కిల్–06 పరిధిలోని నాగారం డివిజన్–05లో గల ఎస్‌ఎల్‌ఎఫ్–07 వద్ద ఏర్పాటు చేసిన రోలింగ్ అండ్ పాలిషింగ్ సెంటర్‌ను డిప్యూటీ కమిషనర్ ఏ. వాణి ప్రారంభించారు. మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధి, ఉపాధి అవకాశాల విస్తరణ లక్ష్యంగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా యూసీడీ ప్రాజెక్ట్ ఆఫీసర్ కె. సురేష్ మాట్లాడుతూ మహిళలు స్వయం సమృద్ధి సాధించే దిశగా ఇటువంటి కేంద్రాలు కీలకంగా మారనున్నాయని తెలిపారు. మహిళా సంఘాల సభ్యులకు శిక్షణతో పాటు ఆదాయ వనరులు పెంచేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## 250 క్వింటాల పిడిఎఫ్ బియ్యం పట్టివేత




**తూప్రాన్, మే 8 (జనం సాక్షి) :** తూప్రాన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని టోల్ ప్లాజా వద్ద పోలీసులు నిర్వహించిన వాహనాల తనిఖీల సందర్భంగా అనుమానాస్పదంగా వెళ్తున్న ఒక లారీని నిలిపి తనిఖీ చేయడం జరిగింది. తనిఖీలో లారీలో సుమారు 250 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించి, అనుమానిత సరుకును పరిశీలన నిమిత్తం సివిల్ సప్లై కార్యాలయానికి తరలించినట్లు ఎస్ఐ గంగరాజు తెలిపారు. వాహన డ్రైవర్ తెలిపిన వివరాల ప్రకారం, లారీ కర్ణాటక రాష్ట్రం నుండి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి వెళ్తున్నట్లు తెలిసింది. ఘటనపై సివిల్ సప్లై అధికారులకు సమాచారం అందజేయగా, వారి నివేదిక ఆధారంగా తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## హుజూర్‌నగర్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యం



**హుజూర్‌నగర్, మే 8 (జనంసాక్షి) :** పట్టణంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని, హుజూర్‌నగర్ పట్టణ అభివృద్ధికి రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రత్యేక చొరవతో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా కొనసాగుతున్నాయని మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్ పట్టణ పరిధిలోని రామస్వామి గట్టు సమీపంలో డంపింగ్ మార్పు కోసం అనువైన స్థలాన్ని పరిశీలించారు. పట్టణ పారిశుధ్య నిర్వహణను మరింత మెరుగుపరచడం, ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా ఈ భూమి పరిశీలన చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దూరదృష్టి, అభివృద్ధి పట్ల నిబద్ధత వల్ల హుజూర్‌నగర్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యం లభిస్తోందన్నారు. పట్టణ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పారిశుధ్యం, రోడ్లు, డ్రైనేజీ, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. హుజూర్‌నగర్‌ను ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దేందుకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మార్గదర్శకత్వంలో మరెన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, మున్సిపాలిటీ ఫ్లోర్ లీడర్ కోతి సంపత్ రెడ్డి, రెవెన్యూ అధికారులు, మున్సిపల్ అధికారులు శానిటేషన్ ఇన్స్పెక్టర్ మెరిగ అశోక్, మున్సిపాలిటీ ఏఈ వినోద్, కౌన్సిలర్లు సులవ నాగలక్ష్మిచందు, దగ్గుపాటి కవితబాబురావు, నల్లగొండ సుజాతచంటి, పులిచింతల వెంకట్ రెడ్డి, వర్క్ ఇన్స్పెక్టర్ నర్సిరెడ్డి, రమణ, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## మహిళలు ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి



**ఎర్రుపాలెం, మే 8 (జనంసాక్షి) :** మండలం లోని వెంకటాపురం గ్రామంలోని సోలార్ విద్యుత్ కేంద్రాన్ని, ఎర్రుపాలెం లోని ఇందిర డైరీ పాల కేంద్రాన్ని శుక్రవారం, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్. అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం నుండి డిప్యూటీ సీఎం మల్లు పట్టేక్రమార్క కృషితో ప్రవేశపెట్టిన సోలార్ విద్యుత్ తయారీ, పాల ఉత్పత్తి ఇందిరా డైరీ ప్రవేశపెట్టి మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క,కృషిచేస్తున్నారన్నారు.ఆయన మహిళల కోసం ప్రవేశపెట్టిన ఈ ప్రాజెక్టులను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగాఎదవలన్నారు. మహిళల ఉపాధి కొరకు ప్రవేశపెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకునే విధంగా అలాగే ఐకెపి సంఘాల ద్వారా అందించే డ్వాక్రా రుణాలను అవకతవకలు జరగకుండా ఏపీఎం సక్రమంగా చూసుకోవాలని ఆదేశించారు.ఐకేపీ ద్వారా మహిళల ఉపాధి కొరకు ప్రవేశపెట్టిన స్త్రీ, టి, స్టాల్స్, సహకారంలో ఏపీఎం, ఏకపక్షం గా వ్యవహరిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని మహిళల ఉపాధి కొరకు ప్రవేశపెట్టిన పథకాలలో ఎలాంటి అక్రమాలు అవకతవకలు జరిగిన కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో అధికారులు, డి.ఆర్.డి.ఓ, కొండపల్లి, శ్రీరామ్,ఎర్రుపాలెం తాసిల్దార్, ఎం.ఉషా శారద, ఆర్.ఐ, రవికుమార్, ఏపీవో, నాగరాజు, ఎంపీడీవో, సురేందర్, ఏఎంసీ, చైర్మన్, బండారు.నరసింహారావు, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు,వేజెండ్ల.సాయికుమర్, జిల్లా ఉపాధ్యక్షులు, వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి, నాయకులు, బొగ్గుల, గోవర్ధన్, రెడ్డి, శీలం.శ్రీనివాసరెడ్డి, కర్నాటి.సుధాకర్ రెడ్డి, అనుమోలు. వెంకట కృష్ణారావు, బొగ్గుల.శ్రీనివాసరెడ్డి, జానీ.పాషా, గుడేటి.బాబు, తదితరులు పాల్గొన్నారు.

# గద్వాలలో గాడి తప్పుతున్న ప్రైవేటు స్కూల్ బస్సులు

- పెళ్లిళ్లు ,పేరంటాలకు ప్రైవేటు స్కూల్ బస్సులు అద్దెకు..
- ఇక్కడ ప్రైవేటు స్కూల్ యజమానులకు రూల్స్ వర్తించవు
- ప్రైవేటు స్కూల్ యజమానులు అద్దెకిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం
- గద్వాల ఆర్టీవో వెంకటేశ్వర్లు

**గద్వాల నడిగడ్డ, మే 8 (జనం సాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లాలో ప్రైవేట్ స్కూల్ యజమానులు ఇప్పుడు కొత్త అవతారం ఎత్తి పెళ్లిళ్లు, పేరంటాలకు తమ స్కూల్ బస్సులను అద్దెకిస్తున్నారు. జిల్లాలో ఏ మూలనో చూసినా పెళ్లి అయ్యిందంటే చాలు ప్రైవేటు స్కూల్ బస్సులు దర్శనమిస్తాయి, మునుపెన్నడూ లేని విధంగా ఈ సంవత్సరము ప్రైవేటు స్కూల్ యజమానులు స్కూల్ బస్సుల ఈ ఎం ఐ లు కట్టడానికి పెళ్లిళ్లకు తమ బస్సులను అద్దెకిస్తున్నారు. స్కూల్ బస్సుల్లో స్కూల్ పిల్లలు తప్ప వేరే వాళ్ళని చేరవేస్తే కఠిన చర్యలు ఉంటాయని తెలిసిన మమ్ములను ఎవరు ఏమి చేయలేరని ధీమాతో తమ బస్సులను రోడ్లపై తిప్పుతున్న ఏమి అనరు లే అనే ధీమాతో రోడ్ ఎక్కిస్తున్నట్లు తెలుస్తుంది. ఇటీవల స్కూల్ బస్సుల దుర్వినియోగంపై కఠిన చర్యలు తీసుకోవాలని,తెలంగాణలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల బస్సుల దుర్వినియోగంపై విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి కఠిన ఆదేశాలు జారీ చేశారు.విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన బస్సులను పెళ్లిళ్లు, ప్రైవేట్ కార్యక్రమాలు లేదా ఇతర వాణిజ్య అవసరాలకు అద్దెకు ఇవ్వడంపై పూర్తిస్థాయి నిషేధం విధించారు. ఈ బస్సులు కేవలం విద్యార్థుల రవాణా, అధికారిక విద్యా పర్యటనలకే ఉపయోగించాలని స్పష్టం చేశారు. బస్సులను ఇతర అవసరాలకు వినియోగించడం వల్ల విద్యార్థుల భద్రతకు ముప్పు ఏర్పడటమే కాకుండా, బాధ్యతపై అనుమానాలు తలెత్తుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ నిబంధనలను వెంటనే అమలు చేయాలని, ఉల్లంఘనలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.




### ఆర్టీవో వెంకటేశ్వరరావు వివరణ

జోగులాంబ గద్వాల జిల్లాలో పరిధిలోని ప్రైవేట్ స్కూల్ యజమానులు పెళ్లిళ్లు, పేరంటాలు, ఇతర వాణిజ్య పనులకు స్కూల్ బస్సు లను ఉపయోగించిన వారిపై కఠిన చర్య తీసుకుంటామని, నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు స్కూల్ యజమానులు బస్సులను నడిపితే వారిపై తగు చర్య తీసుకుంటామని ఆయన శుక్రవారం జనం సాక్షితో అన్నారు.

## యువత భవిష్యత్తుకు భువనగిరి వేదిక

**భువనగిరి, మే 8 (జనం సాక్షి) :** యాదాద్రి భువనగిరి జిల్లా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, కుంభం ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ కుంభం కీర్తిరెడ్డి ఆధ్వర్యంలో భారీ స్థాయిలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నారు. ఈ జాబ్ మేళా మే 8, 9, 10 తేదీలలో భువనగిరి పట్టణంలోని న్యూ డైమెన్షన్ పాఠశాల ప్రాంగణంలో జరగనుంది. దేశవ్యాప్తంగా యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న ప్రముఖ 1వీ1దీ సంస్థ సహకారంతో నిర్వహిస్తున్న ఈ మెగా జాబ్ మేళాలో సుమారు 25 ప్రముఖ కంపెనీలు పాల్గొని దాదాపు 3,500 ఉద్యోగ అవకాశాలను అందించనున్నాయి. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లోని కుప్పం, కర్ణాటకలోని రాయచూర్ ప్రాంతాల్లో విజయవంతంగా ఉద్యోగ



అవకాశాలు కల్పించిన 1వీ1దీ సంస్థ తెలంగాణ రాష్ట్రంలో తొలిసారిగా యాదాద్రి భువనగిరిని వేదికగా ఎంచుకోవడం ప్రత్యేకతగా నిలిచింది. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, భువనగిరి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, పోచంపల్లి మున్సిపల్ చైర్మన్, వార్డు కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మధిరలో పర్యటించిన జిల్లా కలెక్టర్



**మధిర, మే 8 (జనంసాక్షి) :** ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్ శుక్రవారం మధిర లో పర్యటించారు. దీనిలోని భాగంగా నిర్మాణంలో ఉన్న జూనియర్ , డిగ్రీ కాలేజ్ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం 100 పడకల ఆసుపత్రిని సందర్శించి అక్కడ ఉన్న మౌలిక వసతులు వైద్య సదుపాయాల పై పేషెంట్లను అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన వైద్యాన్ని ప్రజలకు అందించాలని ఈ సందర్భంగా వారు అధికారులకు సూచించారు. నాణ్యత ప్రమాణాలతో జూనియర్ డిగ్రీ కాలేజ్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో మధిర తాహాసిల్దార్ రాళ్ల బండి రాంబాబు, మున్సిపల్ డి ఈ నరేష్ రెడ్డి, ఆర్ ఐ శిరీష, సర్వేర్ ఉషారాణి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సోరంశెట్టి కిషోర్, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్ బి. చంద్రశేఖర్

**నల్లగొండ, మే 8 (జనం సాక్షి) :** జిల్లాలో జూలై 15 వరకు ఎలాంటి తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆర్డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయాదిత్య భవన్‌లో జిల్లాలో తాగునీటి పరిస్థితిపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. తాగునీటి సరఫరా ఇంజనీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలోనే ఉండి ప్రజలకు పూర్తి భరోసా కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఎక్కడైనా తాగునీటి సమస్యలు తలెత్తితే వెంటనే స్పందించి అక్కడికక్కడే పరిష్కరించాలని, పరిష్కారం కాని సమస్యలను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పత్రికల్లో వచ్చిన వార్తలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులు సమీక్ష నిర్వహించి సమస్యల కారణాలను వివరించారు. మిషన్ భగీరథ ఎస్ఈ



నాగేశ్వరరావు మాట్లాడుతూ వేసవిలో ఎక్కడా తాగునీటి సమస్యలు రాకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రిడ్ వాటర్ అందుబాటులో లేని ప్రాంతాల్లో అద్దె బోర్లు లేదా ఇతర ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా తాగునీటి సరఫరా చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో ప్రజారోగ్య ఎస్ఈ వెంకటేశ్వర్లు, మిషన్ భగీరథ ఈఈ శాంతకుమారి, జిల్లా పంచాయతీ అధికారి శంకర్ నాయక్, మిషన్ భగీరథ ఈఈలు, డీఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

## నల్గొండ జిల్లా స్పోర్ట్స్ స్కూల్స్‌లో విద్యార్థులకు సీట్లు



**నల్లగొండ, మే 8 (జనం సాక్షి) :** నల్గొండ జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలోని వివిధ స్పోర్ట్స్ స్కూల్స్ మరియు హాస్టల్స్‌లో ప్రవేశాల కోసం నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎంపికల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ చాటారు.జిల్లాస్థాయిలో ఎంపికైన విద్యార్థుల్లో అబ్బాయిల విభాగం నుండి 10 మంది, అమ్మాయిల విభాగం నుండి 10 మంది గత నెల 28, 29 తేదీలలో హకీంపేట్ స్పోర్ట్స్ స్కూల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి సెలక్షన్స్‌లో పాల్గొన్నారు. ఈ ఎంపికల్లో నల్గొండ జిల్లా నుండి అబ్బాయిల విభాగంలో 8 మంది, అమ్మాయిల విభాగంలో 6 మంది విద్యార్థులు తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్స్‌లో ప్రవేశాలకు ఎంపిక కావడం విశేషం.ఎంపికైన విద్యార్థులకు ఈ నెల 13, 14 తేదీలలో హకీంపేట్ స్పోర్ట్స్ స్కూల్‌లో కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి తెలిపారు. విద్యార్థులు తమకు సంబంధించిన అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో కౌన్సిలింగ్‌కు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు.ఈ సందర్భంగా జిల్లా యువజన క్రీడల అధికారి మహమ్మద్ అక్బర్ అలీ మాట్లాడుతూ, జిల్లాస్థాయిలో నిర్వహించిన స్పోర్ట్స్ స్కూల్ సెలక్షన్స్ కార్యక్రమానికి సహకరించిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, నల్గొండ మున్సిపల్ కమిషనర్, చైర్మన్, వైస్ చైర్మన్, వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు మరియు సహకరించిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## జనగణన వివరాలు భవిష్యత్తు అభివృద్ధికి కీలకం




**నల్లగొండ ప్రతినిధి, మే 8 (జనం సాక్షి) :** 2027 జనగణన లో భాగంగా స్వీయ గణన చేసుకునేందుకు ఈ నెల 10 వరకు మాత్రమే అవకాశం ఉందని, అందువల్ల జిల్లాలోని ప్రతి ఒక్కరు స్వీయ గణన చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు.స్వీయ జనగణన పై ప్రజల్లో అవగాహన కల్పించే నిమిత్తం శుక్రవారం ముఖ్య ప్రణాళిక అధికారి, నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఎన్జీ కళాశాల నుండి క్లాక్ టవర్ వరకు నిర్వహించిన జనగణన నడకను జిల్లా కలెక్టర్, నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డిలు ఎన్జి కళాశాల వద్ద జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం క్లాక్ టవర్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 2027 జనగణంలో భాగంగా ముందుగా స్వీయ గణన ,గృహాల లెక్కింపు , జనగణన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ స్వీయ గణన పై ప్రజలలో అవగాహన కల్పించే నిమిత్తం" జనగణన వాక్" నిర్వహించడం జరిగిందని, అభివృద్ధికి జనాభా ఎంతో ముఖ్యమని అన్నారు.ప్రజలు ఇంటి నుండే సెల్ ఫోన్‌లో స్వీయ గణన చేసుకోవచ్చని, ఇందుకు కేవలం 10 పది నిమిషాలు కేటాయిస్తే సరిపోతుందని ,స్వీయ గణనకు రెండు రోజులు మాత్రమే అవకాశం ఉన్నందున జిల్లాలోని ప్రతి ఒక్కరు స్వీయ గణన చేసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.డిప్యూటీ మేయర్ అష్రఫ్ అలీ, సెన్సెస్ జాయింట్ డైరెక్టర్ రఘు, సిపిఓ శ్రీనివాస్ నాయక్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శరత్చంద్ర, జిల్లా క్రీడలు యువజన సర్వీసుల అధికారి అక్బర్ అలీ, తహసిల్దార్ పరశురాం, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, కార్పొరేటర్లు, అధికారులు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


# మిర్యాలగూడ మున్సిపాలిటీలో ఏసీబీ దాడులు

- పలు రికార్డుల పరిశీలన
- అవినీతి అధికారులపై చర్యలకు ప్రభుత్వానికి సిఫార్సు
- ఏసిబి డియస్పి జగదీశ్ చంద్ర

**మిర్యాలగూడ, మే 8 (జనంసాక్షి) :** మిర్యాలగూడ :మిర్యాలగూడ మున్సిపాలిటీ లో గురువారం ఉదయం నుండి అర్ధరాత్రి వరకు ఏసీబి అధికారులు దాడులు నిర్వహించారు.నల్గొండ రేంజ్ ఏసీబీ డియస్పి జగదీశ్ చంద్ర ఆధ్వర్యంలో సుమారు 15 మంది సిబ్బంది మిర్యాలగూడ మున్సిపాలిటీ లోకి ప్రవేశించి సిబ్బంది ని బయటికి వెళ్లకుండా గేట్ కి తాళాలు వేసి సిబ్బంది సెల్ ఫోన్ లను స్వాధీనం చేసుకొని కార్యాలయంలో పలు విభాగలకు సంబందించిన రికార్డులను పరిశీలించారు..ఇటీవల మిర్యాలగూడ మున్సిపాలిటీలో పలు అవినీతి అక్రమాలు జరుగుతున్నాయని పిర్యాదులు రావడం తో పాటు పనులు చేయకుండానే నిధులు డ్రా చేసారనే ఆరోపణలు రావడం తో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించడం జరిగింది.ఈ సోధాలకి సంబందించిన పలు అంశాలను ఏసీబీ డియస్పీ జగదీశ్ చంద్ర వెల్లడిశీచడం జరిగింది. మున్సిపాలిటీలో పన్నుల వసూళ్లలో భారీ లోటు ఉన్నట్టు 2025-26 సంవత్సరానికి మొత్తం పన్ను అంచనా రూ.24.86 కోట్లు కాగా వసూలైనది. కేవలం రూ.9.17 కోట్లు మాత్రమే అని రూ.15.68 కోట్లు బకాయిగా మిగిలి పోయిందని దీనివల్ల ప్రభుత్వానికి భారీ ఆదాయ నష్టం జరిగింది అన్నారు.షాపుల పన్నుల వసూళ్లలోసిబ్బంది ఉదాసీనంగా వ్యహరించారని 2025–26లో మున్సిపాలిటీలో 1,756 షాపులు ఉండగా పన్ను అంచనా రూ.43.3 లక్షలు ఉండగా రూ.28.35 లక్షలు మాత్రమే వసూలు చేసారని ఇంకా రూ.14.95 లక్షలు బకాయిగా ఉన్నదని, 2026–27లో 1,783 షాపులకు రూ.36.18 లక్షలు అంచనా వేయగా, కేవలం రూ.15.01 లక్షలు మాత్రమే వసూలు చెయ్యగా రూ.21.17 లక్షలు బకాయిగా ఉన్నదన్నారు.అనధికార నిర్మాణాలపై చర్యల తీసుకోవడంలో లోపాలు గుర్తించామని 2025–26లో మొత్తం 54 ఫిర్యాదులు రాగా చాలా కేసుల్లో నోటీసులు ఇచ్చినా, గడువు తేదీ ముగిసినా తదుపరి చర్యలు తీసుకోలేదుఅని అన్నారు.డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకన్న తనిఖీల సమయంలో అనుమతి లేకుండా గైర్హాజరయ్యారు. పెన్షన్, జనన–మరణ ధృవీకరణ పత్రాల జారీలో ఆలస్యం జరుగుతుందని,116 జనన దరఖాస్తులు, 1 మరణ దరఖాస్తు 7 రోజుల గడువు దాటినా పెండింగ్‌లో ఉన్నాయి అని పోర్టల్‌లో ఎంట్రీలు లేక 1,820 పెన్షన్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు గుర్తించాము అన్నారు. టౌన్ ప్లానింగ్ రెవెన్యూ 2024–25లో రూ.3.29 కోట్లు ఉంటే 2025–26లో రూ.3.05 కోట్లకు పడిపోయిందని,మ్యూటేషన్ దరఖాస్తుల్లోనూ భారీ పెండెన్సీటీ ఉందని 2025–26లో 86 దరఖాస్తుల్లో 61 పెండింగ్‌లో ఉన్నాయి అన్నారు. 2026–27లో 34 అనుమతులు ఇచ్చినట్లు చూపినా, అసలు 18 దరఖాస్తులే వచ్చినట్లు రికార్డుల్లో ఉన్నాయి రికార్డుల నిర్వహణలో కూడా తీవ్ర నిర్లక్ష్యం కనిపించిందని బిల్డింగ్ పర్మిషన్, లేఅవుట్, ఎన్‌క్రోచ్‌మెంట్ రిజిస్టర్లు సరిగా నిర్వహించలేదని కొన్ని రిజిస్టర్లపై అధికారుల సంతకాలు కూడా లేవని అన్నారు.21 రోజుల గడువు దాటిన బిల్డింగ్ పర్మిషన్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

అనధికార నిర్మాణాలపై 54 ఫిర్యాదులు చర్యల్లేకుండానే ఉండిపోయాయి, నాలా దరఖాస్తులు 4,638 పెండింగ్‌లో ఉండగా, సుమారు రూ.15 కోట్లు వసూలు కాకుండా ఉన్నాయి,కార్యాలయంలో క్యాష్ రిజిస్టర్ నిర్వహణ కూడా లేదు,ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీతాలపై కూడా అవకతవకలు జరిగినట్లుగుర్తించా మన్నారు. హాజరు రిజిస్టర్‌లో కొందరు ఉద్యోగులు గైర్హాజరైనట్లు ఉన్నప్పటికీ, పూర్తి నెల జీతాలు తీసుకున్నట్లు రికార్డులు చూపుతున్నాయన్నారు. మున్సిపల్ వాహనాల వినియోగానికి సంబంధించిన లాగ్‌బుక్స్ నిర్వహించట్లేదని, అధికారులకి సంబంచిన వాహనాలకి ఇందన ఖర్చు సంవత్సరానికి 19,33,000/–రూపాయలను ఖర్చు చేసారని వాటికీ సరియైన రికార్డులు లేవని అన్నారు.పరిశీలించిన పలు అంశాలపై ప్రభుత్వానికి నివేదిక సమర్పించి, సంబంధిత మున్సిపల్ అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని సిఫారసు చేయనున్నట్లు ఏసీబీ డియస్పి తెలిపారు.ప్రభుత్వ కార్యాలయాలలో ఎవరైనా ఉద్యోగులు లంచం డిమాండ్ చేసినచో 1064 నెంబర్ ద్వారా కానీ,9440446106 నెంబర్ కి వాట్సాప్ చేసి ఏసీబీ వారికి ఫిర్యాదు చెయ్యాలని అన్నారు.




# దూసుకుపోతున్న 'ఏఐ'

- ఆరు రెట్లు పెరిగిన వినియోగం..
- 20% ఉద్యోగులకు లేఆఫ్‌లు

**న్యూఢిల్లీ:**ప్రముఖ సైబర్ సెక్యూరిటీ సంస్థ 'క్లౌడ్‌ఫ్లేర్' తమ లేఆఫ్‌లను ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమ సిబ్బందిని 20శాతం మేర తగ్గించుకుంటున్నట్లు వెల్లడించింది. కంపెనీలో ఏఐ వినియోగం భారీగా పెరగడం వల్లే ఈ తొలగింపుల ప్రక్రియ చేపట్టినట్లు తెలిపింది. ఈమేరకు ఉద్యోగులకు ఇంటర్నల్ మెమో పంపింది. దాదాపు 1100 మందికి పైగా ఉద్యోగులను 'క్లౌడ్‌ఫ్లేర్ తొలగించనుంది."గత మూడు నెలల్లో కంపెనీ ఏఐ వినియోగం 600 శాతానికి పైగా పెరిగింది. ఇంజినీరింగ్, ఫైనాన్స్, హెచ్‌ఆర్, మార్కెటింగ్ విభాగాల్లో నిత్యం వేల సంఖ్యలో ఏఐ ఏజెంట్లను వినియోగిస్తున్నాం. ఏఐ సామర్థ్యాన్ని మరింత అందిపుచ్చుకోవాలనే ఉద్దేశంతోనే కంపెనీ ఈ పునర్ వ్యవస్థీకరణ చర్యలు చేపట్టింది. అంతేగానీ, ఉద్యోగుల పనితీరుతో దీనికి ఎలాంటి సంబంధం లేదు" అని క్లౌడ్‌ఫ్లేర్ తమ మెమోలో పేర్కొంది. లేఆఫ్‌లకు గురైన ఉద్యోగులకు పరిహార ప్యాకేజీ ఇవ్వనున్నట్లు వెల్లడించింది.కాగా.. క్లౌడ్‌ఫ్లేర్ గురువారమే తన తొలి త్రైమాసిక ఫలితాలను విడుదల చేసింది. ఇందులో వాల్‌స్ట్రీట్ అంచనాలను మించి కంపెనీ రాణించింది. అయితే, కొన్ని గంటలకే ఈ లేఆఫ్‌ల వార్తలు బయటకు రావడంతో.. కంపెనీ షేర్లు భారీగా పడిపోయాయి.

# రుణం వడ్డీ భారం తగ్గించుకోవాలంటే

**న్యూఢిల్లీ:**బ్యాంకు రుణం తీసుకోవడం నేడు మధ్యతరగతి జీవితంలో ఒక భాగమైపోయింది. సొంతిల్లు, కారు, పిల్లల ఉన్నత చదువుల కోసం తీసుకునే రుణాలపై వడ్డీ రేట్లు తగ్గితే సామాన్యుడికి ఎంతో ఊరట లభిస్తుంది. భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) వడ్డీ రేట్లను తగ్గించినప్పుడు ఆ ప్రయోజనం తమకు ఎప్పుడు అందుతుందా అని రుణగ్రహీతలు ఎదురు చూస్తుంటారు. అయితే, 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఆర్‌బీఐ చేసిన వడ్డీ రేట్ల కోత ప్రయోజనాలు వినియోగదారులకు పాక్షికంగానే అందాయని బ్యాంక్ ఆఫ్ బరోడా నివేదిక తాజాగా స్పష్టం చేసింది. ఆర్‌బీఐ రేట్లు తగ్గించినప్పటికీ, బ్యాంకులు మాత్రం ఆ స్థాయిలో వడ్డీలను తగ్గించక పోవడంతో రుణగ్రహీతలకు పూర్తిస్థాయిలో ప్రయోజనం చేకూరలేదు.ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించేందుకు ఆర్‌బీఐ ఎప్పటికప్పుడు రెపో రేట్లను తగ్గిస్తూనే ఉంది. ఫిబ్రవరి 2025 నుంచి తన కీలక రెపో రేటును 6.50 శాతం నుంచి ప్రస్తుతం 5.25 శాతానికి చేర్చింది. అంటే, మొత్తంగా 125 బేసిస్ పాయింట్లు మేర కోత విధించింది. కానీ, వాస్తవంగా రుణగ్రహీతలకు అందిన ప్రయోజనం అంతంతమాత్రమే. కొత్తగా తీసుకున్న రుణాలపై సగటు వడ్డీ రేటు కేవలం 93 బేసిస్ పాయింట్లు మాత్రమే తగ్గింది. ఎంసీఎల్‌ఆర్ ఆధారిత బెంచ్‌మార్క్ రేట్లు మరింత నెమ్మదిగా కేవలం 45 బేసిస్ పాయింట్ల మేరకే తగ్గడం గమనార్హం.ఆర్‌బీఐ రేట్లు తగ్గించినా బ్యాంకులు వెంటనే స్పందించకపోవడానికి ప్రధాన కారణం డిపాజిట్ల ఖర్చు. బ్యాంకులు తమ లాభాలను కాపాడుకోవడానికి డిపాజిట్లపై ఇచ్చే వడ్డీని కూడా సర్దుబాటు చేయాల్సి ఉంటుంది. బ్యాంకులు అనుసరించే రుణ విధానమూ ఇక్కడ కీలక పాత్ర పోషిస్తుంది. రెపో రేటుతో అనుసంధానించిన రుణాలకు వడ్డీ తగ్గింపు వేగంగా లభిస్తుంది. లేకపోతే నెమ్మదిగా తగ్గింపు అమలవుతుంది.వడ్డీ రేట్ల కోత




ప్రయోజనం మీకు సరిగ్గా అందడం లేదనిపిస్తే.. ఈ చర్యలు తీసుకోవాలి. ఎంసీఎల్‌ఆర్ నుంచి ఈబీఎల్‌ఆర్‌కు: మీ రుణం పాత ఎంసీఎల్‌ఆర్ విధానంలో ఉంటే, వడ్డీ రేటు తగ్గేందుకు చాలా సమయం పడుతుంది. దీనిని రెపో రేటుతో నేరుగా ముడిపడి ఉండే ఈబీఎల్‌ఆర్ విధానానికి మార్చుకోవడం ద్వారా ఆర్‌బీఐ తగ్గించే ప్రతి పైసా ప్రయోజనం మీకు వేగంగా అందుతుంది.బదిలీ: తక్కువ వడ్డీ ఉన్న బ్యాంకుకు మీ రుణాన్ని బదిలీ చేసుకోవచ్చు. ఉదాహరణకు, మీరు రూ.30లక్షల గృహరుణాన్ని 8.5 శాతం నుంచి 7.63 శాతం వడ్డీకి బదిలీ చేసుకుంటే, నెలకు రూ.1,600 చొప్పున, 20 ఏళ్ల కాలపరిమితిలో దాదాపు రూ.4లక్షల వరకూ ఆదా చేసుకోవచ్చు.ఖర్చుల విషయంలో జాగ్రత్త: రుణ బదిలీ చేసేటప్పుడు కొత్త బ్యాంకు వసూలు చేసే ప్రాసెసింగ్ ఫీజు, ఇతర ఖర్చులను పరిగణనలోకి తీసుకోవాలి. ఈ ఖర్చులు మీ వడ్డీ ఆదా కంటే తక్కువగా ఉన్నప్పుడే బదిలీ చేసుకోవడం ఉత్తమం. క్రెడిట్ స్కోరు: మెరుగైన సిబిల్ స్కోరున్నవారికి బ్యాంకులు తక్కువ వడ్డీ రేట్లను అందిస్తాయి. మీరు బదిలీకి దరఖాస్తు చేసే ముందు మీ క్రెడిట్ స్కోరు బాగుందని నిర్ధారించుకోండి.
కాల పరిమితి: మీ రుణ కాలపరిమితి ఇంకా 10-12 ఏళ్లు మిగిలి ఉన్నప్పుడే బదిలీ చేసుకోవడం వల్ల వడ్డీ ఆదా ఎక్కువగా కనిపిస్తుంది. కాలపరిమితి ముగింపు దశలో ఉంటే, ఫీజుల రూపంలో అయ్యే ఖర్చే వడ్డీ ఆదాకన్నా ఎక్కువగా ఉండొచ్చు.ప్రస్తుతం వడ్డీ రేట్లు స్థిరీకరణ దశలో ఉన్నాయి. ఆర్‌బీఐ నుంచి మరిన్ని విధానపరమైన మార్పులు వచ్చే వరకూ వడ్డీ రేట్లలో పెద్దగా మార్పులు ఉండకపోవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో రుణగ్రహీతలు తమ రుణాల వడ్డీ రేట్లను ఒకసారి సమీక్షించుకొని, సరైన బెంచ్‌మార్క్ విధానాలకు మారడం ద్వారా వడ్డీ భారాన్ని తగ్గించుకోవచ్చు.

# పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు..

## నష్టాల్లో ముగిసిన మార్కెట్లు

దేశీయ మార్కెట్లు శుక్రవారం నష్టాల్లో ముగిశాయి పశ్చిమాసియాలో ఇరాన్-అమెరికా మధ్య ఉద్రిక్తతలు భగ్గుమనడంతో మన సూచీలు నష్టాల్లో కదలాడాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని ప్రతికూల సంకేతాలు అందుకు దోహదం చేశాయి. ఉదయం సెన్సెక్స్ 77,631 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. ఒక దశలో సూచీలు స్వల్పంగా లాభపడినా.. తర్వాత వెంటనే నష్టాల్లోకి జారుకున్నాయి. చివరకు సెన్సెక్స్ 516 పాయింట్ల నష్టంతో 77,328 వద్ద ముగిసింది. నిఫ్టీ 150 పాయింట్లు కోల్పోయి, 24,176 వద్ద స్థిరపడింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 94.47 వద్ద ఉంది. నిఫ్టీ సూచీలో టైటాన్ కంపెనీ, అపోలో హాస్పిటల్, ఏషియన్ పెయింట్స్, టాటా కన్జూమర్ ప్రొడక్ట్స్, అదానీ పోర్ట్స్ షేర్లు రాణించగా.. ఎస్‌బీఐ, కోల్ ఇండియా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్ స్టాక్స్ నష్టాల్లో కదలాడాయి.









# 150 ఎయిర్‌బస్ విమానాల కోసం ఎయిరేషియా భారీ ఆర్డర్

## విలువ రూ.1.79 లక్షల కోట్లు

కౌలాలంపూర్: చౌక ధరల విమానయాన సంస్థ ఎయిరేషియా, ఎయిర్‌బస్ ఏ220-300 మోడల్ విమానాలు 150 సమీకరించేందుకు ఆర్డర్ ఇచ్చింది. ఈ లావాదేవీ విలువ 19 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.1.79 లక్షల కోట్లు). ఏ220 విమానాల కోసం ఒక సంస్థ ఇచ్చిన అతిపెద్ద ఆర్డరు ఇదే. కెనడాలోని క్యూబెక్, మిరాబెల్‌లో ఉన్న ఎయిర్‌బస్ ఫ్యాక్టరీలో గురువారం ఈ ఒప్పందాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కెనడా ప్రధాని మార్క్ కార్నీ పాల్గొన్నారు. ఇరాన్ యుద్ధం నేపథ్యంలో పెరుగుతున్న ఇంధన ధరలు, నిర్వహణ వ్యయాలను తట్టుకోవడానికి.. విమాన ఇంధనాన్ని సమర్థంగా వినియోగించుకునే ఏ220 విమానాలు కొనుగోలు చేయాలని ఎయిరేషియా నిర్ణయించింది. ఈ విమానాలు తక్కువ కర్బన ఉద్గారాలను విడుదల చేస్తాయి. 160 సీట్ల సామర్థ్యం కలిగిన ఈ విమానాలను, తక్కువ మంది ప్రయాణికులతో కూడా లాభదాయకంగా నడపొచ్చు. చిన్న నగరాలు, సెకండరీ హబ్‌లకు విమాన సేవలు ప్రారంభించడానికి వీలుపడుతుందని సంస్థ పేర్కొంది. భవిష్యత్తులో ఈ ఆర్డరును 300 విమానాల వరకు పెంచుకునే సౌలభ్యం ఎయిరేషియాకు ఉంది. ఈ విమానాల డెలివరీ 2028 నుంచి ప్రారంభమవుతుంది. ఆగ్నేయాసియా, ఆసియా-పసిఫిక్ ప్రాంతాల్లోని గమ్యస్థానాలకు ఏ220 విమానాలను ఎయిరేషియా నడపనుంది. మధ్యస్థ దూర మార్గాలకు ఏ320, ఏ321 విమానాలను, ఐరోపా, ఆస్ట్రేలియా, ఉత్తర అమెరికా వంటి సుదూర మార్గాలకు ఏ330 విమానాలను కేటాయించే అవకాశం ఉందని ఎయిరేషియా సహవ్యవస్థాపకుడు, సలహాదారు టోనీ ఫెర్నాండెజ్ పేర్కొన్నారు. ఈ భారీ ఆర్డరుతో ఎయిర్‌బస్ ఏ220 విమానాల మొత్తం ఆర్డర్ల సంఖ్య 1,000 మార్కును దాటింది. 2026 మార్చి వరకు చూస్తే, 25 విమానయాన సంస్థలకు 501 ఏ220 విమానాలను ఎయిర్‌బస్ అందించింది.

# హడలెత్తిస్తున్న హంటా వైరస్





**న్యూఢిల్లీ:**క్రూజ్ నౌక ఎంవీ హ్వాండియస్ కారణంగా తెరపైకి వచ్చిన హంటావైరస్ ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా కలకలం సృష్టిస్తోంది. ఈ నౌకతో ప్రమేయమున్న వారిలో ఎనిమిది మందికి హంటావైరస్ సోకినట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) గుర్తించింది. వారిలో ముగ్గురు చనిపోయారు. ఈ నౌకలో 23 దేశాలకు చెందిన 146 మంది ఉన్నారు. వారు స్పెయిన్‌లోని క్యానరీ దీవుల నుంచి స్వదేశాలకు చేరుకోనున్నారు. కరోనా వైరస్ మిగిల్చిన చేదు అనుభవాల దృష్ట్యా ఈ వైరస్‌పైనా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. హంటా వైరస్ అనేది హంటావిరిడీ తరగతికి చెందిన వైరస్. ఎలుకలు దీని ప్రధాన వాహకాలు. అయినా వాటిలో వ్యాధి లక్షణాలు కనిపించవు. వాటి విసర్జితాలు, లాలాజలం ద్వారా వైరస్ వ్యాప్తి చెందుతుంది. ఆ విసర్జితాలను ఊడ్చడం లాంటివి చేసినప్పుడు వాటిలో నుంచి సూక్ష్మరేణువులు పైకి లేస్తాయి. అప్పుడు శ్వాస ద్వారా సమీపంలోని మనుషుల శరీరాల్లోకి ప్రవేశించొచ్చు.
ఈ వైరస్‌తో కలుషితమైన ఆహారాన్ని తిన్నప్పుడు, కలుషిత వస్తువును పట్టుకున్న చేతితో నోటిని తాకినప్పుడు కూడా ఈ వైరస్ మన ఒంట్లోకి చేరుతుంది.

**రెండు రకాలు..**

ప్రకృతిలో 40 రకాలకుపైగా హంటావైరస్‌లు ఉన్నాయి. వాటిని ఓల్డ్ వరల్డ్, న్యూ వరల్డ్‌గా విభజించారు.ఓల్డ్ వరల్డ్ హంటావైరస్‌లు ఐరోపా, ఆసియాలో ఎండమిక్‌గా మారాయి. వీటివల్ల రక్తస్రావ సమస్యలు, మూత్రపిండాల పనితీరులో ఇబ్బందులు వంటివి ఉత్పన్నం కావొచ్చు.న్యూ వరల్డ్ వైరస్‌లు ఉత్తర, దక్షిణ అమెరికాల్లో ఎక్కువగా కనిపిస్తుంటాయి. వీటివల్ల ఊపిరితిత్తుల్లో నీరు చేరడం వంటి సమస్యలు తలెత్తవచ్చు.ఈ ఇన్‌ఫెక్షన్ వల్ల కొన్నిసార్లు తీవ్ర పరిణామాలు తలెత్తవచ్చు. ముఖ్యంగా న్యూ వరల్డ్ రకాలతో ఇబ్బందులు రావొచ్చు.

**ఆండిస్ తీరు భిన్నం..**

హంటావైరస్‌లు మానవుల మధ్య వ్యాప్తి చెందవు. ఆండిస్ అనే రకం తీరు మాత్రం పూర్తి భిన్నం. ఇది మానవుల మధ్య ఎందుకు వ్యాపిస్తుందన్నది నిర్ధారణ కాలేదు. మనిషి లాలాజలంలోని యాంటీవైరల్ పదార్థాలను తట్టుకునే సామర్థ్యం ఈ వైరస్ రకానికి ఉండటమే ఇందుకు కారణమని భావిస్తున్నారు. తాజాగా నౌకలో వెలుగు చూసింది కూడా ఆండిస్ వైరస్సే.

**అంత ఉద్ధృతం కాదు కానీ..**

ఆండిస్ రకం సహా హంటావైరస్‌లేవీ అంత ఉద్ధృతంగా వ్యాప్తి చెందవని నిపుణులు చెబుతున్నారు. కొవిడ్ వంటి వైరస్‌లు.. రోగి ఆ గదిని విడిచి వెళ్లిన చాలాసేపటికి కూడా అక్కడ గాల్లోనే ఉంటాయి. ఆండిస్ వైరస్ మాత్రం బాధితుడికి చాలా సన్నిహితంగా వచ్చినప్పుడే వ్యాప్తి చెందుతుంది. ఒకే పడకపై నిద్రించడం, లైంగిక భాగస్వాములు, ఆహారం పంచుకునేవారి మధ్య వ్యాప్తి జరుగుతుంది. అయినా ఎక్కువమందికి మాత్రం ఇది విస్తరించదు.

**సిబ్బందిలో ఇద్దరు భారతీయులు**

ఎం.వి.హ్వాండియస్ నౌకలో భారత్‌కు చెందిన ఇద్దరు సిబ్బంది ఉన్నట్లు వెల్లడైంది. అయితే వారి గురించి మిగతా వివరాలు వెలుగులోకి రాలేదు. హంటావైరస్ సోకిన వారికి వీరు చేరువగా వెళ్లారా అన్నది కూడా తెలియరాలేదు. మరోవైపు వైరస్ విజృంభణకు ముందే నౌక నుంచి వెళ్లిపోయిన సుమారు పాతిక మందిని వైద్యులు పరీక్షిస్తున్నారు.

# కొవిడ్ కంటే భిన్నంగా..:

## హంటా వైరస్‌పై డబ్ల్యూహెచ్‌వో

క్రూజ్ నౌక ఎంవీ హోండియస్‌లో 'హంటా వైరస్' వల్ల మరణాలు చోటుచేసుకోవడం ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు రేకెత్తిస్తోంది. దీంతో ఇది కొవిడ్‌లా వ్యాపిస్తోందా.. మళ్లీ లాక్‌డౌన్ పరిస్థితులు వస్తాయా అని ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. ఈ క్రమంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ దీనిపై క్లారిటీ ఇచ్చింది. ఇది కొవిడ్ కాదని, ఇన్‌ఫ్లుయెంజా కూడా కాదని డబ్ల్యూహెచ్‌ఓ డైరెక్టర్ మరియా వాన్ కర్ఖోవ్ స్పష్టంచేశారు. ఇది చాలా భిన్నంగా వ్యాపిస్తుందన్నారు. ప్రస్తుతం ఆ నౌకలో వైరస్ లక్షణాలున్న ప్రయాణికులు గానీ, సిబ్బంది గానీ ఎవరూ లేరని మరియా పేర్కొన్నారు. ఆండిస్ వైరస్ ప్రధానంగా సన్నిహిత సంబంధాలు ఉన్నవారికి మాత్రమే వ్యాపించిందన్నారు. ఇది కరోనా వైరస్ కాదని.. చాలాకాలంగా ఉన్న ఓ విభిన్నమైన వైరస్ అని ఆమె తెలిపారు. ఒక నౌకలో పరిమిత ప్రదేశంలోనే దీన్ని గుర్తించామన్నారు.ఇక, ఇది తీవ్రమైన ఘటనే అయినప్పటికీ.. ప్రజారోగ్యంపై దీని ప్రభావం తక్కువగానే ఉందని టెడ్రోస్ అధనమ్ గెబ్రెయేసస్ పేర్కొన్నారు. ఇప్పటివరకు ఎనిమిది కేసులు వెలుగులోకి రాగా, వారిలో ముగ్గురు మరణించినట్లు తెలిపారు. దీనికి సంబంధించి కొత్త కేసులు నమోదయ్యే అవకాశం కూడా ఉందని ఆయన హెచ్చరించారు.

**మాస్కులు లేకుండా.. కలిసి భోజనం చేసి..**

ఎంవీ హోండియస్ క్రూయిజ్ నౌకలో తుర్కియేకు చెందిన ఒక ట్రావెల్ వ్లాగర్ రూహీ సెనెట్ ప్రయాణించారు. హంటా వైరస్ వ్యాప్తికి సంబంధించిన పలు విషయాలను ఆయన తన వ్లాగ్‌లో పంచుకున్నారు. ఏప్రిల్ 12న నౌకలో ప్రయాణిస్తున్నవారిలో ఒకరు మరణించారని కెప్టెన్ వెల్లడించినట్లు తెలిపారు. అయితే, అది సహజమరణంగా అందరూ భావించారన్నారు. ఈ క్రమంలో మిగిలిన ప్రయాణికులు ఎవరూ మాస్కులు ధరించకుండా, క్వారంటైన్ పాటించకుండా కలిసి భోజనం చేయడం, సామూహిక కార్యక్రమాలకు హాజరవడం చేశారన్నారు. దీంతో వైరస్ వ్యాపించిందన్నారు. పరిస్థితి చేయి దాటిపోతుండటంతో తాను క్వారంటైన్‌లోకి వెళ్లిపోయానని, తన క్యాబిన్‌లో ఒంటరిగా భోజనం చేస్తూ ఉండిపోయానని వెల్లడించారు. కాగా.. ఏప్రిల్ 24న తాను క్రూజ్ నౌక నుంచి దిగిపోయినట్లు పేర్కొన్నారు.



# ఎయిరిండియాలో వేతనం లేని సెలవులు!

- బోనస్ వాయిదా
- వ్యయ నియంత్రణపై బోర్డులో చర్చలు

దిల్లీ: ఉద్యోగులకు తాత్కాలిక సెలవులు ఇవ్వడం, బోనస్ వాయిదా వేయడం సహా పలు వ్యయ నియంత్రణ చర్యలపై ఎయిరిండియా బోర్డు సమావేశంలో చర్చలు జరిగినట్లు తెలుస్తోంది. పశ్చిమాసియా ఉద్రిక్తతల వల్ల విమాన ఇంధన ధర పెరగడం, విదేశీ మార్గాల్లో చుట్టూ తిరిగి ప్రయాణించాల్సి వస్తున్నందున సంస్థ పలు ఇబ్బందులను ఎదుర్కొంటుండం ఇందుకు నేపథ్యం. గత ఆర్థిక సంవత్సరంలో ఎయిరిండియా గ్రూప్‌నకు రూ.22,000 కోట్లకు పైగా నష్టం వాటిల్లిందని అంచనా. హరియాణాలోని కంపెనీ ప్రధాన కార్యాలయంలో గురువారం ఉదయం 11:30 గంటలకు బోర్డు సమావేశం మొదలైందని, మూడు గంటల పాటు అది కొనసాగిందని విశ్వసనీయ వర్గాల సమాచారం. చర్చలు ఏ అంశాలపై జరిగాయన్నది కంపెనీ బయటకు వెల్లడించలేదు. అయితే 2025-26 ఆర్థిక గణాంకాలు, వ్యయ నియంత్రణ చర్యలపై చర్చ జరిగినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. వ్యయ నియంత్రణలో భాగంగా ఉద్యోగులను వేతనం లేని సెలవుల్లోకి పంపడంతో పాటు బోనస్ చెల్లింపు వాయిదా తదితరాలనూ పరిశీలించినట్లు తెలుస్తోంది. బోర్డుకు టాటా సన్స్ ఛైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ నేతృత్వంలో ఈ సమావేశం జరిగింది. కొత్త సీఈఓ ఎంపికపైనా..కొత్త సీఈఓ ఎంపిక అంశం కూడా చర్చకొచ్చినట్లు సమాచారం. ప్రస్తుత సీఈఓ, ఎండీ క్యాంప్‌బెల్ విల్సన్ ఈ ఏడాదిలోనే నిష్క్రమిస్తున్న విషయం తెలిసిందే. ఈ సమావేశ వివరాలను క్యాంప్‌బెల్ విల్సన్ శుక్రవారం వెల్లడించే అవకాశం ఉంది.

# 'తార'జువ్వలా..

న్యూఢిల్లీ(జనంసాక్షి):దేశ క్షిపణి వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా భారత్ మరో ముందడుగు వేసింది. టాక్టికల్ అడ్వాన్స్‌డ్ రేంజ్ ఆగ్మెంటేషన్ వ్యవస్థ తొలి ప్రయోగాన్ని గురువారం విజయవంతంగా నిర్వహించింది. రక్షణ, పరిశోధన అభివృద్ధి సంస్థ వాయుసేన సమష్టిగా ఒడిశా తీరంలో దీనిని ప్రయోగించింది. ఈ టాక్టికల్ అడ్వాన్స్‌డ్ రేంజి ఆగ్మెంటేషన్ వ్యవస్థ అన్‌గైడెడ్ బాంబులను కూడా లక్ష్యం దిశగా తీసుకెళ్లేందుకు ఉపయోగపడుతుంది. దేశీయంగా తయారుచేసిన తొలి గ్లైడ్ ఆయుధ వ్యవస్థ ఇదే. తక్కువ ఖర్చుతోనే శత్రువులపై దాడుల పరిధిని విస్తరించడానికి ఈ ఆయుధ వ్యవస్థ ఉపయోగపడుతోంది. దీంతో సుదూర లక్ష్యాలను కచ్చితత్వంతో గురిపెట్టవచ్చు. టాక్టికల్ అడ్వాన్స్‌డ్ రేంజ్ ఆగ్మెంటేషన్ అనేది ఓ ప్రత్యేకమైన మాడ్యులర్ గ్లైడ్ ఆయుధ కిట్. అన్‌గైడెడ్ బాంబులను వార్‌హెడ్‌లకు జోడించి.. వాటిని కచ్చితత్వంతో కూడిన గ్లైడ్ ఆయుధాలుగా మార్చడానికి ఇది ఉపయోగపడుతుంది. హైదరాబాద్‌లోని డీఆర్‌డీవో పరిశోధన కేంద్రం, పలు డీఆర్‌డీవో ప్రయోగశాలలు, భారతీయ పారిశ్రామిక భాగస్వాములతో కలిసి ఈ వ్యవస్థను రూపొందించింది. సాధారణంగా అన్‌గైడెడ్ బాంబులను శత్రు లక్ష్యాలపై ప్రయోగించాలంటే యుద్ధ విమానాలు శత్రు లక్ష్యాలకు దగ్గరగా వెళ్లాల్సిఉంటుంది. దీనివల్ల వారి వైమానిక రక్షణ వ్యవస్థలకు మన యుద్ధ విమానాలు చిక్కే ప్రమాదం ఉంటుంది. అదే గ్లైడ్ ఆగ్మెంటేషన్ కిట్‌ను ఉపయోగించి బాంబులు ప్రయోగిస్తే విమానం శత్రువుల గగనతలానికి దూరంగా ఉంటూనే అక్కడి భూమిపై ఉన్న లక్ష్యాలను కచ్చితత్వంతో ఛేదించగలదు.

# హంటావైరస్‌తో భారత్‌కు తక్షణ ముప్పు లేదు

## నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ డైరెక్టర్ నవీన్ కుమార్

న్యూఢిల్లీ(జనంసాక్షి):క్రూజ్ నౌక ఎంవీ హిండియస్‌లో హంటా వైరస్ వ్యాప్తి కలవరపాటుకు గురిచేస్తోంది. ముఖ్యంగా నౌకా సిబ్బందిలో ఇద్దరు భారతీయులు ఉండటం మరింత ఆందోళనకు కారణమవుతోంది. ఈ పరిణామాలపై నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ డైరెక్టర్ నవీన్ కుమార్ స్పందించారు. ఈ వైరస్ కేసులు అక్కడక్కడ కనిపిస్తున్నాయని, వైరస్‌తో భారత్‌కు తక్షణ ముప్పు ఏమీ లేదన్నారు. ప్రస్తుతానికి సామూహిక వ్యాప్తికి సంబంధించి ఎటువంటి ఆధారాలు లేవన్నారు. "ఈ వైరస్ మానవుల నుంచి మానవులకు సంక్రమించడం చాలా అరుదు. ఆసియా, ఐరోపా దేశాల్లో వెలుగు చూసే ఈ వైరస్ మానవుల మధ్య సోకదు. ఆండెస్ వైరస్ వంటి కొన్ని దక్షిణ అమెరికా జాతుల్లో మాత్రమే ఇలా వ్యాప్తిచెందినట్లు రికార్డులున్నాయి" అని ఎన్ఐవీ డైరెక్టర్ వెల్లడించారు.ఇది కొవిడ్, ఇన్‌ఫ్లుయెంజా వైరస్ కాదని నవీన్ కుమార్ స్పష్టం చేశారు. తొలుత ఫ్లూ మాదిరి లక్షణాలు కనిపిస్తాయని, వైరస్ సోకిన ఒకటి నుంచి ఐదు వారాల్లో లక్షణాలు బయటపడతాయన్నారు. దేశంలో ఇటువంటి అనుమానిత వైరస్ కేసులను గుర్తించడానికి అవసరమైన ల్యాబ్‌లు ఉన్నాయన్నారు. నౌకలు, గిడ్డంగులు, స్టోరేజీ కేంద్రాలు, గాలి ప్రసరణ సరిగాలేని ప్రదేశాల్లో పనిచేసే వ్యక్తులు పరిశుభ్రత పాటించాలని, ఎలుకలు ఉన్న ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్త పడాలని ఎన్ఐవీ డైరెక్టర్ సూచించారు.
మరిన్ని కేసులు..
ఇది తీవ్ర పరిణామమే అయినప్పటికీ.. దీని వల్ల ప్రజారోగ్య ముప్పు తక్కువగానే ఉన్నట్లు అంచనా వేస్తున్నామని ప్రపంచ ఆరోగ్య సంస్థ (చిఊూ) డైరెక్టర్ జనరల్ డాక్టర్ టెడ్రోస్ అధనోమ్ ఘెబ్రెయేసస్ పేర్కొన్నారు. అయితే, వైరస్ పొదిగే కాలాన్ని దృష్టిలో ఉంచుకొని.. మరిన్ని కేసులు నమోదయ్యే అవకాశం ఉందన్నారు. డబ్ల్యూహెచ్‌వో ప్రతినిధి మరియా వాన్ మాట్లాడుతూ.. ఈ వైరస్ భిన్నంగా వ్యాప్తి చెందుతోందని, ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు.

# తెలంగాణకు కేంద్ర సహకారంపై చర్చకు సిద్ధం: కిషన్‌రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి మరోసారి మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం అందించిన సహకారంపై వీరిద్దరికి అవగాహన లేనట్లు ఉందన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ పన్నెండు ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం నుంచి తెలంగాణ రాష్ట్రానికి అందించిన సహకారంపై తాము ఎప్పుడు చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు. హైదరాబాద్‌లో ప్రధాని మోదీ సభ తరువాత తెలంగాణలో మరింత బలోపేతం అవుతామని కేంద్ర మంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు. ఇది ఎన్నికలకు సంబంధించిన కార్యక్రమం కాదన్నారు. ఇది అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన అంశమని ఆయన పేర్కొన్నారు. రూ. 9 వేల కోట్ల అభివృద్ధి పనులకు మోదీ నేరుగా తెలంగాణలో శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల కంటే ముందే ప్రధాని మోదీ తెలంగాణ పర్యటన ఖరారు అయిందని చెప్పారు.




# కాంగ్రెస్‌లో నామినేటెడ్ 'పోస్టు'మార్టమ్

## కొందరికి పదవులూ, పనులూ.. మరికొందరికి నిరాశ నిస్పృహలు

- ఎన్నికల కంటే ముందు ఓ మాట తర్వాత మరో ఆట
- నేతలను, పార్టీని నమ్మినవారికే రాజకీయ శఠగోపం
- కార్పోరేషన్ ఎన్నికల్లో రుచిచూపేందుకు సిద్ధమౌతున్న బాధితులు

**ఖమ్మం బ్యూరో (జనంసాక్షి)**

ఖమ్మంలో రాజకీయాలు భిన్నంగా మారాయి. ముగ్గురు మంత్రులు ఉన్న జిల్లా, పది స్థానాల్లో కాంగ్రెస్ గెలిచిన ఖిల్లా ఖమ్మం. సామాన్యుడి నుంచి అన్నివర్గాల ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరిస్తారు. ప్రజాస్వామ్యం ఎక్కువగా ఉన్న పార్టీలో ఇప్పుడు జిల్లాలో పదవుల పంపకం జరుగుతుంది. అందులో జిల్లాకు దక్కాల్సిన వాట దక్కడం లేదు. జిల్లాలో ఇద్దరు మంత్రులను నమ్ముకున్న వారికి మాత్రం పర్సనల్ పనులు లేదా రాజకీయ పదవులు దక్కుతున్నాయి. కాని ఓ మంత్రిని నమ్ముకుని రోడ్డు మీద పోరాటం చేసిన వారికి నిరాశే ఎదురవుతోంది. నిఖార్సుగా పనిచేసేవారికి అనుమానాలు, అవమానాలు ఎదురౌతున్నాయి. చెమటోడ్చి కష్టపడ్డవారు క్యాంపు కార్యాలయం వైపు చూసే పరిస్థితి లేదు. వాళ్లు దూరంగా, మౌనంగా ఎందుకు ఉన్నారో అడిగి తెలుసుకునే నాయకుడు కరువైయ్యాడు.

### అన్ని వైరాకేనా..?

ఖమ్మం జిల్లాలో ఉన్న 10 నియోజకవర్గాలలో అత్యంత ప్రాధాన్యత కేవలం వైరాకు మాత్రమే అని తేటతెల్లం అయిపోయింది. కేవలం వైరా నుండే మొత్తం నామినేటెడ్ పదవులు, పీసీసీ మెంబర్లు, జిల్లా అధ్యక్షులు, మరికొన్ని పదవులు పొందిన వారు ఉన్నారు. ఖమ్మం విషయానికొస్తే నగరంలో పనిచేసిన కార్యకర్తలకు మాత్రం హస్తం గుర్తు చూపించారు. అలాగే తనని నమ్ముకున్న నాయకుల పేర్లను అధిష్టానం ముందుంచడంలో అమాత్యుల వారు విఫలం అయ్యారని దానికి కారణం ఆయనతో పాటు పార్టీ కార్యకర్తలకు స్పష్టంగా అర్ధమయిందని గుసగుసలు వినిపిస్తున్నాయి. కనీసం రెండవ క్యాడర్‌కు సంబంధించిన ఆక్టివ్ కాంగ్రెస్ నాయకులకు సైతం పదవులు ఇవ్వకుండా పక్షపాతం చూపడం యువ నాయకులకు మింగుడు పడని వైనంగా మారింది.

### కుటుంబ సభ్యుల జోక్యం

అమాత్యుల కుటుంబ సభ్యుల జోక్యం ఎక్కువైంది. భార్య, కుమారుడు, సోదరుడు ఇలా ఎవరికి ఎవరు తీసిపోవడం లేదు. నేరుగా మంత్రులను కలిసే పరిస్థితి లేకుండా పోయింది. మధ్యలో కుటుంబ సభ్యుల పర్యటనలు, వారికి ప్రత్యేక ఫాలోయింగ్ వారే అధికారులను ఆదేశించడం ప్రారంభించారు. ఆ స్థాయి కోరుకునే సమయంలో ఏదైనా పదవి ఇచ్చి బాధ్యతలు అప్పగిస్తే ఎవరికి అభ్యంతరం లేదు. కానీ ఎలాంటి బాధ్యతలు లేకుండా వారి వద్ద క్యూలో నిలబడి పనులు చేయించుకునే పరిస్థితి రావడం అనేక మందికి ఇబ్బందికరంగా ఉంది. వారసత్వ రాజకీయాలను ప్రోత్సహించను అంటూనే అంతర్గతంగా ప్రోత్సహించడాన్ని ప్రజలు గమనిస్తున్నారు.

### కమ్యూనిస్టు పార్టీలకు అవకాశం

రానున్న కాలంలో ఎలాంటి స్వప్రయోజనాలు లేకుండా అందుకు చేరువలో ఉండి అభివృద్ధి మంత్రంతో పనిచేసే కమ్యూనిస్టులపై పేద, బలహీన వర్గాల్లో నమ్మకం ఏర్పడుతుంది. నాడు కమ్యూనిస్టు పార్టీ మునిసిపాలిటీలో చేసిన అభివృద్ధి తప్పా మరేది గొప్పగా చెప్పుకోవడానికి లేదు. నాటి అరకొర నిధులతోనే అన్ని కార్యక్రమాలు చేపట్టారు. గత పదేళ్ల నుంచి 5 వేల కోట్ల నిధులు రాబట్టి వాటిలో నాణ్యత లోపం, పర్యవేక్షణ స్పష్టంగా కనిపిస్తోంది. కాబట్టి నేటి యువత మరోసారి కమ్యూనిష్టులకు దగ్గరయ్యే అవకాశం కనిపిస్తుంది.

### కార్పోరేషన్ ఎన్నికలకు సెగ ఖాయం

ప్రత్యర్థులపై రాజకీయ పోరాటం చేసిన వాళ్ల మౌనం రేపు కార్పోరేషన్ ఎన్నికలపై స్పష్టంగా కనపడనుంది. ఏ ఎన్నిక వచ్చినకాని కష్టపడిన వారితో పాటు కమిట్మెంట్ కలిగిన కార్యకర్తలు ఈసారి తమ రుచి చూపెట్టాలని భావిస్తున్నారు. కష్టం ఒకరిదైతే భోగం మరొకరికి దక్కింది. సీజనల్ రాజకీయ వలస కూలీలకు మాత్రమే గౌరవం లభిస్తుంది. అన్ని త్యాగం చేసిన వారికి ఏది దక్కే పరిస్థితి కానరావడం లేదు. రేపు రానున్న కార్పోరేషన్ ఎన్నికల్లో అధికార పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలే అవకాశం ఉంది.

# కూల్చివేతలు కబ్జాల కొరకే!






- అక్రమ కూల్చివేత నష్టం 40 లక్షల పై మాటే
- అనుమతులు లేకుండా వ్యవసాయ మార్కెట్ ప్రహరీ గోడ కూల్చివేత
- కళ్ళ ముందే కూల్చిన కదలని అధికార యంత్రాంగం
- అధికారులకు ఆమ్యామ్యలు, నేతలకు నజరాలట

**జోగులాంబ అధికారి ప్రతినిధి మే 8 (జనం సాక్షి)**

ప్రభుత్వాల ఆస్తులు ప్రజల బాగోగుల కొరకే అనే విషయాన్ని మరిచినట్టు ఉంది గద్వాల వ్యవసాయ మార్కెట్ చెందిన కొంతమంది మర్చంట్స్ మార్కెట్ లోని నివాసం తో పాటు మర్చంట్ వ్యాపారం కొనసాగిస్తున్న నేపథ్యంలో మార్కెట్ యార్డు చుట్టూ ప్రహరీ గోడ నిర్మించారు. రైల్వే స్టేషన్ రూట్ లో ఉన్న ప్రహరీ గోడను నాలుగు మాసాల కిందట చెప్ప చేయకుండా కూల్చేశారు. ప్రహరీ గోడకు ఆనుకొని ఒక పెద్ద డ్రైనేజీని నిర్మూలించి దాని స్థానంలో మరొక చిన్న డ్రైనేజీని నిర్మించి దాని పైకప్పు వేసి ఇక తాము ఏం చేయదలుచుకున్నారు ఆ ప్రయత్నం మొదలు పెట్టారు,ఈ లోగా మార్కెట్ యార్డ్ వ్యవస్థ నిద్రమత్తులో నుంచి మేల్కొన్నది. ప్రహరీ గోడ కూల్చడానికి వీలులేదని పై స్థాయి నుంచి ప్రహరీ గోడను నిర్మించకపోతే చట్టపరమైన చర్యలు చేపడతామని నోటీసులు జారీ చేసింది. నోటీసులు జారీ చేసినంత మాత్రాన ఏమవుతుంది అని మర్చంట్స్, వారికి మద్దతుగా ప్రభుత్వంలోని భాగస్వామ్యులు చేతులు కలిపి ఏం జరుగుతుందో చూద్దామని మౌనం వహించారంట. ప్రహరీ గోడ కూల్చిన నాలుగు మాసాల తర్వాత మార్కెట్ అధికార గణం పోలీసులను ఆశ్రయించింది అయినా ప్రయోజనం శూన్యం. ప్రభుత్వ ఆస్తులకే దిక్కు లేకపోతే ప్రజలు పైసా పైసా వెనకేసుకుని సెంటు అర సెంటు కొనుక్కుంటే దీనిని కూడా కబ్జ చేస్తే ప్రజల ఆస్తులకు దిక్కు ఎవరని ప్రజలు వాపోతున్నారు.

1972లో మార్కెట్కు నిధుల కొరత రావడం మూలంగా మార్కెట్ యార్డ్ లోని కొంత స్థలాన్ని ప్లాట్ల రూపేనా 26 మందికి అమ్మారు. ఇదే సందర్భంగా కొన్ని షరతులు తో కూడిన వ్యవహారం చేశారు మార్కెట్ యార్డ్ కమిటీ ఆ 26 ప్లాట్ల చుట్టూ ఉన్న స్థలం మరియు ఆ కాలి చుట్టూ నిర్మించ బడ్డ ప్రహరీ గోడ కూడా మార్కెట్ యార్డ్‌కు సంబంధించింది అని లిఖితపూర్వకంగా ఏర్పాటు చేసుకున్నారు.

ఆరు నెలల తర్వాత మార్కెట్ యాడ్ తమను తాము తడుముకొని నిద్రలో నుంచి లేచిన సింహములా పోలీసుల చుట్టూ, రాష్ట్ర మార్కెట్ యార్డ్ వ్యవస్థ చుట్టూ ప్రదక్షిణలు చేస్తే చివర కొరకు కూల్చిన ప్రహరీ గోడ ఎవరు కట్టిస్తారని అంశం సీరియస్ గా తెరపైకొచ్చింది ఇందుకు కొందరు ప్రజాప్రతినిధులు మేమున్నామంటూ ముందుకు వచ్చారు అయితే రాష్ట్ర మార్కెటింగ్ వ్యవసాయ శాఖ ప్రహరీ గోడను ఎందుకు కూల్చాల్సి వచ్చింది 26 మంది ప్లాట్లు కొన్న సందర్భంలో విధించిన షరతులు ఏంటి ఇలా పలు అంశాల పైన చర్చలు జరిపింది రాష్ట్ర స్థాయి శాఖ. జోగులాంబ గద్వాల జిల్లా వ్యవసాయ శాఖ కనుల ఎదుట ఆరు మాసాలుగా జరుగుతూ ఉన్న ఇలాంటి ఆక్షేపణ చేయకపోవడానికి కారణమేంటి అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

–ప్రజల ఆస్తికి అధికార జవాబు తనముగా ఉండాలి, అదే సరస్సును ప్రభుత్వ ఆస్తులను కాపా డాల్సిన అవసరం ప్రభుత్వ అధికారులపై ఉండగా ప్రతిదీ తామెందు కులే అని తమ తమ బలహీనతలను ఆధారంగా కొలువులు నిర్వహిస్తే చివరాకురకు ప్రజల ప్రభుత్వ ఆస్తులు కబ్జాలకు గురై నిలువ నీడ లేకుండా పోతుందని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా జిల్లా యంత్రా ఒగం మార్కెట్ యాడ్‌కు సంబంధించిన యంత్రాంగం రంగంలోకి దిగి ప్రహరీ గోడ కూలగొట్టిన వారి చేత గోడ కట్టిస్తారా లేదా గద్వాల వ్యవసాయ శాఖ నే కట్టిస్తుందా అనే అంశం ప్రజల్లో ఒక బలమైన చర్చనీయాంశముగా తయారయ్యి ఆందోళనలో కూడా ఉన్నారు.

## రికార్డ్ స్థాయిలో మొక్కజొన్న కొనుగోలు

**చొప్పదండి, మే 8 (జనం సాక్షి:** చొప్పదండి జువ్వాడి చొక్కా రావు వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో రికార్డ్ స్థాయిలో మొక్కజొన్న పంట కొనుగోలు జరిగిందని మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరు మహేష్ పేర్కొన్నారు. మార్కెట్ చైర్మన్ చాంబర్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు అడగగానే మక్కల కొనుగోలు కేంద్రాన్ని మంజూరు చేసి ప్రారంభించిన కొద్ది రోజులలోనే మన మార్కెట్ యార్డ్ లో రాష్టంలోనే అత్యధికంగా దాదాపు 30,000 క్వింటాళ్ల మక్కలు కొనుగోలు రికార్డు సృష్టించినందుకు చొప్పదండి మార్కెట్ యార్డ్ తరపున, నియోజక వర్గ రైతుల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మార్కెట్ యార్డ్‌లో ఇంత పెద్దగా ఎప్పుడు మాక్కల కొనుగోలు జరగలేదని మేడిపల్లి సత్యం వచ్చకనే మొక్కజొన్న రైతుల బాధలను అర్థం చేసుకొని రాష్ట్రంలో వచ్చిన మూడు కొనుగోలు కేంద్రాలలో మనకు ఒకటి తీసుకు వచ్చి రైతు బందవుడు అని మరొకసారి నిరూపించారని, నియోజక వర్గం లో రైతులకు ఎలాంటి ఇబ్బందులూ వుండకుండా మార్కెట్ యార్డ్ లలోనే కాకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శిస్తూ ప్రతి రైతు సమస్యలను దగ్గరుండి తెలుసుకుంటూ రైతుల పక్షపాతిగా మారారని ఇలాంటి వ్యక్తి వాళ్ళ నియోజక వర్గంలో రైతులు అందరూ సంతోషంగా వున్నారని తెలిపారు.



# మర్రిగూడ మృత్యు చౌరస్తా

- ఇరుకు రోడ్ల ఇబ్బందులతో ప్రజల ప్రాణసంకటం..
- మునుగోడు ఎమ్మెల్యే హామీ నెరవేర్చాలి

**మర్రిగూడ మే 8 (జనంసాక్షి) :** మర్రిగూడ మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తా ప్రస్తుతం ఒక సమస్యగా, ప్రమాదాల పొంచి ఉన్న మృత్యుకుహరంగా మారింది. నిత్యం వందల వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే, ఈ జంక్షన్, ప్రణాళికాబద్ధమైన విస్తరణ లేక, రోజు రోజుకూ కుంచించుకుపోతుండటం స్థానికులను ఆందోళనకు గురిచేస్తోంది. రోడ్డుకు ఇరువైపులా వెలిసిన అక్రమ ఆక్రమణలు, ఇష్టానుసారంగా ఏర్పాటు చేసిన వాణిజ్య ప్రకటనల బోర్డులు, రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, దిమ్మెలు పాదచారుల నడకను నరకప్రాయం చేస్తున్నాయి. మునుగోడు నియోజకవర్గంలో అభివృద్ధికి చిరునామాగా నిలిచే, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, తలచుకుంటేనే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, మండల వాసులు గట్టిగా విశ్వసిస్తున్నారు. సాయంత్రం వేళల్లో భారీ వాహనాలు, పాఠశాలకు వెళ్లే చిన్న పిల్లలు, వృద్ధులు రోడ్డు దాటాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికే ఈ జంక్షన్ లో అనేక ప్రమాదాలు జరగటం, ప్రజలను ఆందోళనకు గురి చేస్తుంది.

నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి, కోట్లాది రూపాయల నిధులతో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి, మర్రిగూడ చౌరస్తాను మోడల్ జంక్షన్‌గా తీర్చిదిద్దాలని, ఆర్అండ్‌బి, పంచాయతీరాజ్ అధికారులను సమన్వయం చేసి వెంటనే, రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు కేవలం ప్రతిపాదనల సాకులు చెప్పకుండా, ఎమ్మెల్యే చొరవతో తక్షణమే ఆక్రమణలు తొలగించి, సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేసి, ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందంటున్నారు. అభివృద్ధిలో తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకున్న రాజగోపాల్ రెడ్డి, ఈ "మర్రిగూడ ట్రాఫిక్ చిక్కుముడిని" విడదీసి, చౌరస్తాకు మహర్దశ పట్టిస్తారని, మండల ప్రజానీకం ఆశతో వేచి చూస్తోంది.





## ప్రైవేట్ వసతి గదులపై పోలీసులు ఆకస్మిక తనిఖీలు

- సీసీ కెమెరాలు కచ్చితంగా ఏర్పాటు చేయాలి
- గంజాయి రహిత వేములవాడగా కృషి చేస్తాం : డీఎస్పీ శ్రీనివాసులు

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) :** వేములవాడ లోని పలు ప్రైవేట్ వసతిగదులలో శుక్రవారం రాత్రి డీఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సీఐ వీరప్రసాద్ పర్యవేక్షణలో పోలీసులు పలు ప్రైవేట్ వసతి గదులపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పోలీసులు ఆరు బృందాలుగా ఏర్పడి అనుమానం ఉన్న వసతి గదులను తనిఖీ నిర్వహించారు.డిఎస్పి శ్రీనివాసులు లాడ్జి నిర్వాహకులతో మాట్లాడుతూ ప్రైవేట్ వసతి గదులలోకి వస్తున్న భక్తుల పూర్తి వివరాలు ఆధార్ కార్డు, సెల్ ఫోనునెంబర్, తమ వాహనము నెంబరు కూడా రిజిస్టర్లో నమోదు చేయాలని సూచించారు.అనంతరం డిఎస్పి విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలోని పలు ప్రైవేట్ వసతి గదులలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం జరిగిందని, అనుమానాస్పదంగా ఉన్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నామన్నారు. ప్రతి ప్రైవేట్ గది నిర్వాహకులు తమ రిజిస్టర్లో రూము తీసుకున్న వారి ఆధార్ కార్డు, నెంబర్ సెల్ ఫోను నెంబరు, తమ భక్తులు తీసుకువచ్చిన వాహనం నెంబర్ కూడా విధిగా నమోద్ చేయాలని చెప్పినట్లు తెలిపారు. పలు ప్రైవేట్ గదులలో సీసీ కెమెరా పర్యవేక్షణను ఆయన పరిశీలించారు.ప్రతి ప్రైవేట్ వసతి గదులకు సీసీ కెమెరా కచ్చితంగా ఏర్పాటు చేసుకోవాలని సీసీ కెమెరాలు ఏర్పాటు చేయకపోతే వసతి గదుల నిర్వాహలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. వేములవాడను గంజాయి రహిత వేములవాడ గా చేయడానికి ఆ దిశగా పోలీస్ శాఖ ప్రయత్నాలు చేస్తున్నట్టు ఆయన తెలిపారు., వేములవాడలో ఇటీవల కాలంలో గంజాయిపై మూడు నాలుగు కేసులు నమోదయ్యాయన్నారు. ఆయన వెంట పట్టణ సీఐ వీరప్రసాద్, ఎస్ఐలు ఎల్లా గౌడ్, రామ్మోహన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# బీడీ కార్మికుల వేతనాలపై జరిగిన చర్చలు సఫలం




**బోధన్, మే 8 (జనంసాక్షి) :** బీడీ కార్మికుల వేతనాల పెంపదలకై బీడీ యజమానుల ప్రతినిధులతో జరిగిన చర్చలు సఫలమయ్యాయి అని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ నిజామాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు బి.మల్లేష్ వివరించారు. శుక్రవారం నాడు బోధన్ పట్టణంలోని రాకాసిపేట్ లో బీడీ కార్మికుల ప్రతినిధులతో కలిసి ఏర్పాటుచేసిన ప్రెస్ మీటింగులు బి. మల్లేష్ మాట్లాడుతూ నిన్న హైదరాబాదులోని సుచిత్ర వద్ద స్వాగత్ గ్రాండ్ హోటల్ కాన్ఫరెన్స్ హాల్లో ఉదయం నుండి రాత్రి వరకు సుదీర్ఘంగా ది తెలంగాణ బీడీ మ్యాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షులు హితేంద్రభాయ్ ఉపాధ్యాయ, రష్మీకాంత్ పటేల్ రమణ భాయ్ మరియు తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వనమాల కృష్ణ ప్రధాన కార్యదర్శి ఎం నరేందర్‌లు ఇతర కార్మిక సంఘాల ప్రతినిధులతో కలిసి జరిగిన చర్చలలో బీడీ ప్యాకర్స్‌కు నెలకు రూ :4,500-00లు, నెలసరి ఉద్యోగస్తులు అయినటువంటి సాటర్స్, గంపవాలా బట్టి వాలా క్లర్క్, మునీమ్‌లకు రూ :2,200, బీడీలు చుట్టే కార్మికులకు వేయి బీడీలకు రూ 6-00ల చొప్పున పెంచుతూ ఒప్పందం కుదిరిందని తెలిపారు. ఈ ఒప్పందం రాష్ట్రంలోని ఆరు లక్షలకు పైగా గల బీడీ కార్మికులకు ప్రయోజనం కలుగుతుందని అన్నారు. అయితే అదే సమయంలో గతంలో రాష్ట్రం ఏర్పాటు కాకమునుపు 2014లో 32 రోజులు వేతనాల పెంపుతులకై సమ్మె చేయగా నాటి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి వేతనాలను పెంచుతూ 41 వ నంబర్ జీవోని విడుదల చేయడం జరిగిందని, దాన్ని అమలు కాకుండా బీడీ యజమానులు ఒత్తిడి తేవడం మూలంగా 41 వ నంబరు జీవోని అమలు చేయకుండా అబియెన్స్ పెడుతూ 81వ జీవని విడుదల చేశారని నాటి నుండి 10 సంవత్సరాలు అధికారంలో ఉన్న అప్పటి టిఆర్ఎస్ ప్రభుత్వం గానీ ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ గానీ బీడీ కార్మికుల గురించి వారి కనీస వేతనాల పెంపు కోసం ఆలోచించడం పోవడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. బీడీ కార్మికులకు కనీస వేతనాలను పెంచుతూ జీవోని తీసుకురావాలని కోరుతున్నామన్నారు. బీడీ కార్మికుల సమస్యల పరిష్కారంకై మరోసారి పోరాటానికి సిద్ధం కావాలని బీడీ కార్మికులకు పిలుపునిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో టియుసిఐ నాయకులు టీ లాలయ్య, బీడీ వర్కర్స్ యూనియన్ బోధన పట్టణ నాయకులు ఇందిరా, మంజుల, గంగామణి, రమా, అరుణ, లతా,లలిత పాల్గొన్నారు.





# ఫీల్డ్ అసిస్టెంట్ బాగోతం!

## ఖాసీంపేటలో ఉపాధి హామీ కూలీలతో తన సొంత మక్క జొన్న చేనులో పని చేయించిన వైనం

- ప్రజాధనంతో సొంత వ్యవసాయ పనులు..
- అధికారులు.. షోకాజ్ నోటీసులతో సరిపెడతారా?

**గన్నేరువరం, మే 08 (జనంసాక్షి):**

గన్నేరువరం మండలం ఖాసీంపేట గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద వచ్చిన కూలీలను తన సొంత మక్క జొన్న చేను పనులకు మళ్లించి, ప్రజాధనాన్ని స్వేచ్ఛగా దుర్వినియోగం చేసిన ఫీల్డ్ అసిస్టెంట్ అక్రమాలు బట్టబయలయ్యాయి. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం సృష్టించింది.

### ఏమైంది ఘటన?

గురువారం ఖాసీంపేట గ్రామంలో ఉపాధి హామీ కూలీలు పని చేస్తున్నట్లు రికార్డుల్లో చూపించి, వాస్తవానికి వారందరినీ తన సొంత పొలంలో మక్క జొన్న కోత, కంకుల రవాణా పనులకు వాడుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ట్రాక్టర్‌లో కంకులు రవాణా చేస్తున్న దృశ్యాలు స్థానికుల దృష్టికి చిక్కాయి. ఈ దృశ్యాలు పత్రికల్లో వెలుగులోకి రావడంతో సంచలనం ఏర్పడింది.

### అధికారుల విచారణ.. కేవలం షోకాజ్ నోటీసులేనా?

పత్రికల్లో వార్త వెలువడ్డాక ఎంపీఓ సురేందర్, ఏపీఓ చంద్రశేఖర్, టీఏ శంకర్, పంచాయతీ కార్యదర్శి అరుణ్ కుమార్ లాంటి అధికారులు విచారణ చేపట్టారు. అక్రమం జరిగినట్లు నిర్ధారణ కావడంతో సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్‌కు షోకాజ్ నోటీసు జారీ చేశారు. అయితే, ఎంపీడీఓ పర్యటనలో ఉన్నారనే సాకుతో కఠిన చర్యలు తీసుకోకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### రాజకీయ ఒత్తిళ్లు.. వ్యవస్థ మీద అనుమానాలు

ఈ అవినీతి వ్యవహారం వెనుక అధికార పార్టీకి చెందిన కీలక నేతల అండ




ఉన్నట్లు స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్‌ను కాపాడేందుకు రాజకీయ ఒత్తిళ్లు తీవ్రంగా ఉన్నట్లు సమాచారం. "తప్పు చేసినట్లు సాక్ష్యాలు ఉన్నా కేవలం నోటీసులతో సరిపెట్టడం వెనుక మతలబు ఏమిటి?" అని గ్రామస్తులు నిలదీస్తున్నారు.

### గ్రామస్తుల డిమాండ్

- ఫీల్డ్ అసిస్టెంట్‌ను వెంటనే విధుల నుంచి తొలగించాలి
- దుర్వినియోగమైన ప్రజాధనాన్ని తక్షణం రికవరీ చేయాలి
- సమగ్ర విచారణ జరిపి, రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా చర్యలు తీసుకోవాలి

ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్‌కు సాక్ష్యాధారాలతో ఫిర్యాదు చేసేందుకు గ్రామస్తులు సిద్ధమవుతున్నారు. జనంసాక్షి పత్రిక ఈ అక్రమాన్ని వెలుగులోకి తెచ్చినందుకు స్థానికులు ధన్యవాదాలు తెలుపుతున్నారు.

మరి అధికారులు వ్యవస్థను కాపాడుతారా.. లేక రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గుతారా అన్నది ఇప్పుడు చూడాల్సి ఉంది.

# ఆయుర్వేద వైద్యం ప్రాచీనమైనది

- ఆయుర్వేద వైద్యానికి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు
- ఆయుర్వేద వైద్యానికి ప్రధాని మోడీ పెద్దపీట వేస్తున్నారు
- అవేర్‌లో కేరళ ఆయుర్వేద హాస్పిటల్‌ను ప్రారంభించిన...చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి




**మహేశ్వరం,మే 8(జనంసాక్షి):**

ఆయుర్వేద వైద్యం చాలా ప్రాచీనమైనదాన్ని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు.శుక్రవారం రాత్రి మహేశ్వరం మండలం అవేర్ మాధవన్ జీ హాస్పటల్లో కేరళ ఆయుర్వేద హాస్పిటల్ ను అవేర్ సంస్థ చైర్మన్ మాధవన్ జీ తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ...ఆయుర్వేద వైద్యానికి ప్రపంచ వ్యాప్తంగా మంచి గుర్తింపు ఉందన్నారు.ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆయుర్వేద వైద్యానికి పెద్దపీట వేస్తున్నారాన్ని,ప్రపంచ వ్యాప్తంగా ఆయుర్వేద వైద్యానికి పూర్వ వైభవం తీసుకురావడానికి కృషి చేస్తున్నారన్నారు.అవేర్ సంస్థ గిరిజనులు, ఆదివాసీలు ఉండే మారుమూల గ్రామీణ ప్రాంతాలల్లో అనేక సేవ కార్యక్రమాలను నిర్వహించిందన్నారు.ఆయుర్వేద వైద్యంతో ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవన్నారు. అవేర్ సంస్థకు సేవ చేసే గుణం ఉందన్నారు.అవేర్ సంస్థ చేస్తున్న సేవలను అభినందించారు.అనంతరం అవేర్ సంస్థ చైర్మన్ మాధవన్ జీ మాట్లాడుతూ...అవేర్ ను హెల్త్ హబ్‌గా తీర్చిదిద్దుతామన్నారు.2028 నాటికి మెడికల్ కాలేజ్ ఏర్పాటు చేసేలా కృషి చేస్తున్నామన్నారు.అవేర్ మాధవన్ జీ హాస్పిటల్స్‌లో కార్పొరేట్ హాస్పిటల్స్ కంటే తక్కువగా ఫీజు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జేఎన్టీయూ మాజీ వీసీ నర్సింహ రెడ్డి, బీజేపీ నేతలు బొక్క నర్సింహ రెడ్డి,మాధవ రెడ్డి,అందెల శ్రీరాములు యాదవ్,కడారి జంగయ్య యాదవ్,మాజీ జడ్పీటీసీలు బొక్క జంగారెడ్డి,ఏనుగు జంగారెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణ నాయక్,అవేర్ సంస్థ ప్రతినిధులు తరుణ్, వరుణ్, మాధవన్ జీ హాస్పిటల్స్ డాక్టర్లు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
9 మే 2026

# ప్రభుత్వ పథకాల అమలులో సమన్వయం కీలకం

- కేంద్ర-రాష్ట్ర అధికారులు కలిసి పనిచేయాలి
- దిశ సమావేశంలో ఎంపీ ఈటల రాజేందర్ సూచనలు



**మేడ్చల్, మే 08 (జనంసాక్షి):** ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలులో కేంద్ర, రాష్ట్ర అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ సూచించారు. గురువారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం ఎంపీ ఈటల రాజేందర్ అధ్యక్షతన నిర్వహించారు.
ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు చామకూర మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, మున్సిపల్ చైర్మన్లు, వివిధ శాఖల కేంద్ర, జిల్లా అధికారులు పాల్గొన్నారు. శాఖల వారీగా సమీక్ష నిర్వహించిన ఎంపీ, అంగన్వాడీ కేంద్రాల్లో మెరుగైన వసతులు, గర్భిణీలు, చిన్నారులకు పౌష్టికాహారం సకాలంలో అందించాలని, గృహ హింస బాధితులకు సఖి కేంద్రాల ద్వారా సహాయం అందించాలని సూచించారు. ఆసుపత్రుల్లో ఖాళీ పోస్టుల భర్తీ, మౌలిక వసతుల మెరుగుదల, 10 వేలకు పైగా జనాభా ఉన్న ప్రాంతాల్లో కొత్త పిహెచ్‌సీల ఏర్పాటు, ఆయుష్మాన్ భారత్ పథకం సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులకు అత్యవసర వైద్య సేవలు అందించాలన్నారు. నగర వనాల యోజన కింద పార్కుల అభివృద్ధి, రోడ్ల విస్తరణ, విద్యుత్ శాఖ-మున్సిపల్ శాఖల సమన్వయం, యువతకు నైపుణ్య శిక్షణ, కార్మికులకు కనీస వేతనాల అమలు, రుణాల విస్తరణ, జూ= నిధుల సద్వినియోగం, చెరువుల కాలుష్య నివారణ, జాతీయ రహదారి పనుల వేగవంతం వంటి అంశాలపై ఎంపీ కీలక సూచనలు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాపౌట్ తగ్గించడం, ప్రైవేట్ పాఠశాలల్లో 25% ఉచిత విద్య అమలు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులో స్థానికులకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు.



# ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యం

- మోకిలా సీఐ శ్రీనివాస్ రెడ్డి
- రౌడీ షీటర్లకు, అనుమానితులకు కౌన్సిలింగ్

**శంకర్ పల్లి, మే 7(జనం సాక్షి) :** శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, ప్రజల్లో భద్రతాభావం పెంపొందించే ఉద్దేశంతో మోకిలా పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు, అనుమానితులకు సిఐ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...ప్రతి ఒక్కరి కదలికలపై పోలీసుల నిరంతర నిఘా ఉంటుందని,మళ్లీ నేరాలకు పాల్పడితే రౌడీ సీట్లు బలోపేతం చేసి చట్టపైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోషల్ మీడియా ద్వారా తప్పుడు ప్రచారాలు, బెదిరింపులు,అసభ్య పోస్టులు లేదా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయరాదని, పాత నేరస్తులు తమ జీవనశైలిని మార్చుకొని బాధ్యతాయుతంగా పౌరులుగా మారాలని, పోలీసులతో సహకరించాలని సూచించారు. రాత్రి వేళల్లో అనుమాస్పదంగా సంచరించరాదని,ఏదైనా సమాచారం తెలిసిన వెంటనే స్థానిక పోలీసులకు తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, రౌడీ షీటర్లు, అనుమానిత వ్యక్తులు, తదితరులు పాల్గొన్నారు.



## వరద కెనాల్‌లో గుర్తు తెలియని మృతదేహం

**మల్యాల మే 8 (జనం సాక్షి) :** మండలంలోని నూకపెల్లి వరద కెనాల్ లో శుక్రవారం గుర్తుతెలియని మృతదేహం తేలుతూ కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికి తీసి ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో జగిత్యాల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడిది హత్య ప్రమాదవశాత్తు మరణించాడా అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు మృతుడిని ఎవరైనా గుర్తుపట్టితే సీఐ 871268 56818, ఎస్సై 87126 56830 సమాచారం అందించాల్సిందిగా ఎస్ఐ నరేష్ తెలిపారు.

# బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి మే 8 (జనంసాక్షి) :**
తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ,కాంగ్రెస్ గుండాల దాడులు రోజు రోజుకు పెరిగిపోతున్నాయని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. శుక్రవారం వేములవాడలో బిఆర్ఎస్ నాయకులు తెలంగాణ చౌక్ ధర్నా వద్ద నిర్వహించి, అనంతరం పోలీస్ స్టేషన్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై దాడి యత్నాన్ని తీవ్రంగా ఖండించారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు వేములవాడ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ చల్మెడ ఆదేశాల మేరకు తెలంగాణ చౌకులో ధర్నా రాస్తారోకో చేశామన్నారు. గురువారం కరీంనగర్‌లో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ పై బీజేపీ గుండాలు చంపే ప్రయత్నం చేసారన్నారు. కాంగ్రెస్ బీజేపీ కలసి బీఆర్ఎస్ పార్టీ నేతలను ఇబ్బందులు పెడుతున్నారన్నారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా దెబ్బతిన్నదని ఆరోపించారు. కరీంనగర్ పట్టణ నడిఒడ్డున గన్‌తో దొంగతనాలు జరుగుతున్న, అక్కడి కేంద్ర మంత్రి,ఎంపి బండి సంజయ్ పట్టించుకున్న పాపానపోలేదన్నారు. ఎమ్మెల్యే స్థాయి నాయకులకే రక్షణ లేకుండా పోయిందని విమర్శించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ రౌడీ రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని వారు మండిపడ్డారు. అభివృద్ధిపై రాజకీయ చర్చలు జరగాలి గానీ భౌతిక దాడులు చేయడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని హెచ్చరించారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వాహనం, ప్రభుత్వ క్యాంపు కార్యాలయంపై జరిగిన దాడిపై బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకురాలు పావనిగౌడ్‌పై దాడి చేసేందుకు ప్రయత్నించినా వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# పొన్నం ప్రభాకర్ జన్మదిన వేడుకలు

- కరీంనగర్‌లో కాంగ్రెస్ శ్రేణుల సేవా కార్యక్రమాలు
- అన్నదానం, రక్తదానం, ఉచిత వైద్య శిబిరాలు, మజ్జిగ పంపిణీ



**కరీంనగర్ బ్యూరో, మే 08 (జనంసాక్షి) :** రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదినాన్ని పురస్కరించుకుని కరీంనగర్‌లో కాంగ్రెస్ శ్రేణులు విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించాయి. నగర వ్యాప్తంగా అన్నదానం, రక్తదానం, ఉచిత వైద్య శిబిరాలు, మజ్జిగ పంపిణీ, కేక్ కటింగ్‌లతో పండుగ వాతావరణం నెలకొంది.
ఇందిరా చౌక్ వద్ద జిల్లా ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్ ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ హాజరై కేక్ కట్ చేసి, మజ్జిగ పంపిణీ చేశారు. బాణాసంచా కాల్చి సంబరాలు జరిపారు.
నాయకులు మాట్లాడుతూ, విద్యార్థి నాయకుడిగా ఉద్యమాలు చేసి, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన పొన్నం ప్రభాకర్ ప్రజా సేవా దృక్పథం మరువలేనిదని కొనియాడారు. బీసీ సంక్షేమం, మహిళల ఉచిత బస్సు సౌకర్యం వంటి కార్యక్రమాల ద్వారా ప్రజలకు అండగా నిలుస్తున్నారని ప్రశంసించారు. పొన్నం ప్రభాకర్ నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని కోరుకున్నారు. ఈ సందర్భంగా టీమ్ పొన్నం ఆధ్వర్యంలో రామ్‌నగర్ గ్రీన్‌హౌస్‌లో రక్తదానం, హెల్త్ క్యాంప్, ప్రభుత్వ ఆసుపత్రి వద్ద అన్నదానం, భగత్ నగర్ హరిహర క్షేత్రం ఆలయంలో ప్రత్యేక పూజలు, కార్ఖానా గడ్డ వృద్ధాశ్రమంలో కేక్ కటింగ్, మైనారిటీ సెల్ ఆధ్వర్యంలో కరీముల్లా షా దర్గా వద్ద ప్రార్థనలు, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్స్ పంపిణీ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ శాసనసభ్యులు ఆరేపల్లి మోహన్, ఊట్కూరు నరేందర్ రెడ్డి, అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్, కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, ఆకారపు భాస్కర్ రెడ్డి, గడ్డం విలాస్ రెడ్డి, పర్వత మల్లేశం, మల్యాల సుజిత్, పులి ఆంజనేయులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా రక్షణే షీటీమ్ ధ్యేయం

- పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా
- షీటీమ్, ఏహెచ్‌టీయూ, భరోసా కేంద్రాల పనితీరుపై సమీక్ష



**గోదావరిఖని, జనంసాక్షి:** మహిళల రక్షణ, భద్రతే షీటీమ్ ప్రధాన ధ్యేయమని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. శుక్రవారం సీపీ కార్యాలయంలో షీటీమ్,యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ (ఏహెచ్‌టీయూ), భరోసా కేంద్రాల సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, మహిళలకు షీటీమ్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. పాఠశాలలు,కళాశాలలు,ప్రధాన కూడళ్లు,బస్టాండ్ ప్రాంతాల్లో మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. భరోసా కేంద్రాల్లో లీగల్ అడ్వైజర్, కౌన్సిలర్, వైద్య సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. లైంగిక వేధింపులకు గురైన మహిళలు,బాలికలకు సంబంధించిన కేసులు పోలీస్ స్టేషన్‌లో నమోదు అయిన సమయం నుంచి బాధితులకు అవసరమైన సహాయం అందిస్తూ, వారి మానసిక స్థితి, విద్యా పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరించాలని సూచించారు. పిల్లల అశ్లీల వీడియోలు, అత్యాచారాలు, సామూహిక అత్యాచారాలకు సంబంధించిన వీడియోలను అప్‌లోడ్ చేయడం లేదా డౌన్‌లోడ్ చేయడం ఐటీ చట్టంలోని సెక్షన్ 67(బి) ప్రకారం నేరమని తెలిపారు. మహిళలు, యువతులు అత్యవసర పరిస్థితుల్లో షీటీమ్ నంబర్లకు లేదా డయల్ 100కు కాల్ చేసి నిర్భయంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ షీటీమ్ 63039 23700,పెద్దపల్లి జోన్ : 87126 59384, మంచిర్యాల జోన్ : 87126 59385,ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె.శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్రగౌడ్, ఇన్‌స్పెక్టర్ భీమేష్, పెద్దపల్లి ఏహెచ్‌టీయూ ఎస్ఐ శైలజ, మంచిర్యాల జోనల్ షీటీమ్ ఇన్‌చార్జ్ మహిళా ఎస్ఐ ఉషారాణి, భరోసా కేంద్రం, షీటీమ్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్సీ కార్పొరేషన్ లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు

**బోధన్:** సాలూర మండల పరిధిలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అందించే రుణాలకు శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలను నిర్వహించారు. ఈ మేరకు 41 మంది లబ్ధిదారులు ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు చేసుకోగా నేడు నిర్వహించిన ఇంటర్వ్యూలో 25 మంది లబ్ధిదారులు హాజరు కావడం జరిగిందని ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు.

# బక్రీద్ సందర్భంగా శాంతి సమావేశం

- పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలని పోలీసుల సూచనలు
- చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తాం..గుర్తించిన ప్రదేశాల్లోనే కుర్బాన్ చేయాలి
- సోషల్ మీడియాలో అపోహలు వ్యాప్తి చేయొద్దు : డీఎస్పీ పురుషోత్తం రెడ్డి



**రాయికల్ మే 08 (జనంసాక్షి):** రాయికల్ పోలీస్ స్టేషన్‌లో బక్రీద్ పండుగను పురస్కరించుకుని శాంతి సమావేశం, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో జగిత్యాల డీఎస్పీ పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ.. పండుగలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ప్రజలకు సూచించారు. కుర్బాన్ కార్యక్రమాలు గుర్తించిన ప్రదేశాల్లోనే నిర్వహించాలని, ఎవరూ రెచ్చగొట్టే విధంగా ప్రవర్తించకూడదని స్పష్టం చేశారు. ఏదైనా సమస్యలు తలెత్తితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, చట్టాన్ని ఎవ్వరూ చేతుల్లోకి తీసుకోవద్దని హెచ్చరించారు. లా అండ్ ఆర్డర్‌కు విఘాతం కలగకుండా అందరూ సహకరించాలని కోరారు. అలాగే పనికిరాని, అపోహలు కలిగించే సమాచారా న్ని సోషల్ మీడియాలో ఫార్వర్డ్ చేయవద్దని సూచించారు. బెల్లాల్, బోర్నపల్లి ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. సీఐ సుధాకర్ మాట్లాడుతూ... మున్సిపల్ అధికారులు బక్రీద్ సందర్భం గా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని, మున్సిపల్ అందించే కవర్లను సక్రమంగా వినియోగించాలని ముస్లింలకు సూచించారు. వ్యర్థాలను సక్రమంగా డంపింగ్ యార్డ్‌కు తరలించేందుకు ట్రాక్టర్లు సిద్ధంగా ఉంచాలని అన్నారు.
తహసీల్దార్ నాగార్జున మాట్లాడుతూ సామరస్యంతో సమస్యలను పరిష్కరించుకుని పండుగలను ఆనందంగా జరుపుకోవాలని సూచించారు. మున్సిపల్ చైర్మన్ కటకం రవీందర్ ప్రజలు వ్యక్తిగత కక్షలు మానుకుని ప్రశాంత వాతావరణంలో పండుగలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ కమిషనర్ మనోహర్ గౌడ్ పండుగకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ఏఈ నవీన్ విద్యుత్ సమస్యలు తలెత్తినా వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎస్ఐ సుధీర్ రావు గతంలో జరిగిన ఘటనలు పునరావృతం కాకుండా అందరూ కలిసికట్టుగా పండుగలు జరుపుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు రాకేష్ నాయక్, కల్లెడ చిన్న ధర్మపురి,పుర్రె శ్రీధర్,పల్లికొండ గంగాధర్ ,హిందూ మరియు ముస్లిం మత పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

## పేదోడి సొంతింటి కలను
# నిజం చేస్తున్న ప్రజా ప్రభుత్వం



**మంథని, మే 08 (జనంసాక్షి):** కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఎలక్షన్ ముందు ఇచ్చిన హామీ మేరకు కట్టుబడి పేదోడి సొంతింటి కలను ప్రజా ప్రభుత్వం నిజం చేస్తున్నదని కన్నాల సర్పంచ్ గుడిసె గట్టయ్య, మంథని మున్సిపాలిటీ వైస్ చైర్మన్ ముసుకుల సహేందర్ రెడ్డి, కిసాన్ సెల్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు ముసుకుల సురేందర్ రెడ్డి లు అన్నారు. తెలంగాణ ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, టిపిసిసి ప్రధాన కార్యదర్శి శ్రీను బాబు ప్రత్యేక కృషితో మంథని నియోజక వర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నారని పేర్కొన్నారు. మంథని మండలంలోని కన్నాల గ్రామ పంచాయతీ పరిధిలో శుక్రవారం పెండం శారద, సత్యనారాయణ ఇందిరమ్మ లబ్ధిదారు నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొని వారికి సారేగా నూతన వస్త్రాలను అందించారు. మంథని నియోజకవర్గంలో అర్హులైన లబ్ధిదారులను గుర్తించి నిరుపేదలకు సొంతింటి కలను నిజం చేసే కార్యచరణ చేస్తున్నారు. ఆ కార్యక్రమంలో భాగంగా మొదటగా ఇందిరమ్మ మొదటి విడతలో కట్టుకోవడానికి స్థలం ఉండి ఇంటి నిర్మాణాన్ని చేపట్టడానికి స్తోమత లేని కొంతమంది లబ్ధిదారులను గుర్తించి ఇందిరమ్మ సొంత ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ముసుకుల ప్రశాంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు తోకల మల్లేష్ యాదవ్, కావేటి సందీప్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.




# మంథని ఆర్టీసీ బస్టాండ్‌ను ఆధునికరించాలి

**మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్**

**మంథని, (జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా మంథని ఆర్టీసీ బస్టాండ్ ను ఆధునికరించాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. శుక్రవారం మంథని పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బస్టాండ్‌లో ప్రయాణికులకు కనీస సౌకర్యాలు లేవని, టీవి పనిచేయడంలేదని, నీళ్లు రావడం లేదని, మరుగుదొడ్లు సరిగ్గా లేవని అన్నారు. తాము పరిశీలనకు వస్తున్నామంటే ట్రాక్టర్ పెట్టి బస్టాండ్ ఆవరణను పరిశుభ్రం చేయిస్తున్నారని ఆయన విమర్శించారు. ఆనాడు తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత రూ. 3 కోట్లు వెచ్చించి సుందరీకరణ చేశామని ఈ బస్టాండ్ ద్వారా ప్రయాణించే వారు మా కుటుంబసభ్యులుగా బావించి అనేక వసతులు, సౌకర్యాలు కల్పించామని గుర్తు చేశారు. నియోజకవర్గ ప్రజలు ఓట్లు వేసి అధికారం ఇచ్చిండ్లని, కనీసం బస్టాండ్‌లో కనీస వసతులు కల్పించరా అని ఆయన అసహనం వ్యక్తం చేశారు. మొదటి సారి బీసీ ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత బస్టాండ్‌ల సుందరీకరణ చేపట్టామని, కాటారం, కాళేశ్వరం, మంథని, మహదేవ్‌పూర్ బస్డాండ్‌లను సుందరీకరణ చేసినట్లు ఆయన గుర్తు చేశారు. మంథని బస్టాండ్‌లో పార్క్‌ను ప్రతిపాదించామని, ఇలాంటి పనులపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు.

# ప్రతి ఒక్కరు జనాభా లెక్కలను పక్కాగా తెలుపాలి

**మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డి**




**చేవెళ్ల, మే 08 (జనంసాక్షి) :** మున్సిపాలిటీలు, పట్టణాలు, గ్రామాలు అభివృద్ధి మన చేతుల్లో ఉందని, ప్రతి ఒక్కరు జనాభా లెక్కలను పక్కాగా తెలుపాలని చేవెళ్ల మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమతావెంకట్ రెడ్డి అన్నారు. జనగణన 2027 సెల్ఫ్ ఎన్యుమరేషన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చేవెళ్ల మున్సిపల్ కార్యాలయం నుంచి శంకర్ పల్లి చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్వీయ జనగణన జాతీయ జనగణన కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమత వెంకట్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక మొట్టమొదటి సారి మనమంతా జనాభా లెక్కలు నమోదు చేసుకుంటున్నామని తెలిపారు. దేశ జనాభా లెక్కలు ప్రారంభం కావడంతో ప్రతి ఒక్కరు జనాభా లెక్కలను పక్కాగా తెలపాలని సూచించారు. మన అభివృద్ధితో పాటు మన పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే జనాభా వివరాలను తెలపాలని అన్నారు. పాఠశాలలు ఆసుపత్రులు, ప్రభుత్వ పథకాలు పక్కగా అమలు చేసేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపారు. జనాభా లెక్కలు తెలపడం వల్ల రేషన్ కార్డులకు, తదితర పథకాలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. ప్రతి ఒక్కరు తప్పక సెల్ఫ్ ఎన్యూమరేషన్ చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మాజీ సర్పంచ్ ప్రస్తుత కౌన్సిలర్ బండారి శైలజ ఆగిరెడ్డి, కమిషనర్ యాదగిరి, కౌన్సిలర్లు మద్దెల శ్రీనివాస్, దేవర మనీషా అనంత్ రెడ్డి, కరికె మీనాక్షి సత్య నారాయణ, దేవులపల్లి శ్రీనివాస్ రెడ్డి, చేవెళ్ల మాజీ ఉపసర్పంచ్ టేకులపల్లి శ్రీనివాస్ యాదవ్, మహిళా సంఘాల నాయకురాలు, మున్సిపాలిటీ అధికారులు రాఘవేందర్, సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# గంగ కత్వ కాలువ ఆధునీకరణకు ప్రభుత్వం సమ్మతి

- జగ్గారెడ్డి కోరిక మేరకు రూ.42 కోట్ల విడుదలకు ప్రభుత్వం అంగీకారం
- 3000 ఎకరాలకు గంగ కత్వ ద్వారా సాగునీరు
- దశాబ్దాలుగా ఆధునీకరణ కు నోచుకోని నిజాం కాలం నాటి గంగ కత్వ కాలువ
- నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఆ శాఖ ఉన్నతాధికారులతో సెక్రటేరియట్‌లో సమావేశమైన జగ్గారెడ్డి
- గంగ కత్వ ఆధునీకరణ పనులకు త్వరలో సీఎం రేవంత్ రెడ్డితో శంఖుస్థాపన



**సదాశివపేట, మే 08 (జనంసాక్షి):** సదాశివపేట మండలం సూరారం గ్రామం నుండి మొదలయ్యే నిజాం కాలం నాటి గంగ కత్వ కాలువ ఆధునీకరణకు జగ్గారెడ్డి చొరవతో ఎట్టకేలకు మోక్షం లభించింది. నిజాం కాలంలో నిర్మించిన ఈ కాలువ ఇప్పటివరకు మరమ్మత్తు కు నోచుకోలేదు. దశాబ్దాల పాటు మరమ్మత్తుల కోసం అధికారులు ప్రతిపాదనలు పంపుతున్న పనులకు మోక్షం కలుగలేదు. గంగ కత్వ ఆయకట్టు రైతులు, స్థానిక నేతల కోరిక మేరకు జగ్గారెడ్డి రెండు నెలల క్రితం నీటి పారుదల శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆధునీకరణ పనుల కోసం వెంటనే కొత్త ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులకు సూచించారు. కాలువ ఆధునీకరణ పనులకోసం నీటి పారుదల శాఖ అధికారులు రూ. 42 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపారు. ఆ ప్రతిపాదనలకు ప్రభుత్వం తాజాగా ఆమోదం తెలిపింది. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఉన్నతాధికారులతో సెక్రటేరియట్‌లో జగ్గారెడ్డి సమావేశం అయ్యారు. గంగకత్వ కాలువకు చేపట్టబోయే ఆధునీకరణ పనులపై ఈ సమావేశంలో చర్చించారు.

**ఆధునీకరణ పనులు ఇలా...**

గంగ కత్వ కాలువ సదాశివపేట మండలం సూరారం గ్రామంలో ప్రారంభం అయ్యి 11 గ్రామాలను కలుపుతూ సదాశివపేట మండలంలోని మాచిరెడ్డి పల్లి గ్రామం వరకు సుమారు 15 కిలో మీటర్ల పొడవునా విస్తరించి ఉంది. గంగకత్వ కాలువకు 33 చెరువుల నుండి ఫీడర్ చానల్స్ ఉన్నాయి. ఆధునీకరణ పనుల్లో భాగంగా కాలువకు లైనింగ్ పనులు చేపడతారు. కాలువ పైన అవసరం ఉన్న చోట కొత్త బ్రిడ్జి ల నిర్మాణం, పాత వాటికి మరమ్మత్తు పనులు చేస్తారు. దీనితో పాటు కాలువ పొడవునా తుముల కు రిపేర్లు చేస్తారు. ఈ కాలువ పనులు పూర్తయితే 3000 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించవచ్చు.

**సీఎం రేవంత్ రెడ్డితో శంకుస్థాపన**

... సీఎం రేవంత్ రెడ్డి త్వరలో సంగారెడ్డి కి రానున్న నేపథ్యం లో గంగకత్వ పనులకు సైతం సీఎం తో శంకుస్థాపన చేయించేందుకు జగ్గారెడ్డి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు త్వరత గతిన ఏర్పాట్లు చేసుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమక్షంలో జరిగిన సమావేశం లో అధికారులకు జగ్గారెడ్డి సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, జిల్లా మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఇంచార్జ్ మంత్రి వివేక్ వెంకట స్వామి చేతుల మీదుగా గంగ కత్వ పనులకు శంకుస్థాపన జరుగుతుందని జగ్గారెడ్డి అధికారులకు వివరించారు.

# లంచం తీసుకొని పట్టుబడ్డ తపాలా ఇన్స్‌పెక్టర్

- సినీ ఫక్కీలో అరెస్టు

**వనపర్తి (జనంసాక్షి) :** ఉద్యోగుల నుంచి లంచం తీసుకుని పారిపోయిన వనపర్తి తపాలా శాఖ ఇన్స్‌పెక్టర్ గోపినాథ్‌ను సీబీఐ అధికారులు అరెస్టు చేశారు. ఈ ఘటన గురువారం రాత్రి వనపర్తి జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. సీబీఐ అధికారుల కథనం ప్రకారం... తపాలా సిబ్బంది గ్రామాల్లో అదనపు విధులు నిర్వహించారు. ఇటీవల మూడేళ్లకు సంబంధించిన నిధులు మంజూరయ్యాయి. అవి ఇవ్వాలని ఆ శాఖ ఇన్స్‌పెక్టర్‌ను కోరగా.. రూ. లక్షకు రూ.30 వేలు డిమాండ్ చేశాడు. ఈ మేరకు కొంతమంది ఇచ్చుకున్నారు. పాల్గల్ మండలం చింతకుంటకు చెందిన పోస్ట్‌మ్యాన్ నరేష్ సీబీఐని ఆశ్రయించారు. పథకం ప్రకారం బాధితుడు గురువారం సాయంత్రం వనపర్తి తపాలా శాఖ కార్యాలయానికి చేరుకుని ఇన్స్‌పెక్టర్‌కు డబ్బులిచ్చారు. అనంతరం సీసీ కెమెరాలు పరిశీలించిన ఇన్స్‌పెక్టర్.. అనుమానం రావడంతో ట్రెజరీ జితేంద్రకుమార్‌కు డబ్బులిచ్చి ఆటోలో పారిపోయాడు. అప్పటికే కార్యాలయానికి వచ్చిన సీబీఐ ఇన్స్‌పెక్టర్ సంతోష్‌కుమార్, ప్రకాశ్, పింకిచేతన్, సిబ్బందికి ఇన్స్‌పెక్టర్ కనబడకపోవడంతో ఫోన్‌ట్రేస్ చేసి, మదనాపురం రైల్వేస్టేషన్ వద్ద రాత్రి 10 గంటలకు అదుపులోకి తీసుకున్నారు. వనపర్తి తపాలా శాఖ కార్యాలయానికి తీసుకొచ్చి విచారించారు. శుక్రవారం ఉదయం జైలుకు తరలించారు. ఈ కేసులో మరో అధికారి హస్తం ఉందని, గురువారం అతడు సెలవులో ఉన్నాడని. ఆయనను కూడా విచారిస్తామని అధికారులు చెప్పారు.

# దసరా వరకు పాలమూరును పూర్తి చేయండి

- టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



**మహబూబ్‌నగర్ (జనంసాక్షి) :** పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పేరుతో 33 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసినా ఒక్క ఎకరానికి కూడా సాగునీరు అందలేదని, దసరా లోపు ఈ పథకాన్ని పూర్తి చేయాలని టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు మహబూబ్‌నగర్ జిల్లా లక్ష్మీదేవిపల్లిలో నిర్వహించిన బహిరంగ సభలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రంలోని బీజేపీపై విమర్శనాస్త్రాలు సంధించారు. పాలమూరు గడ్డపై సాగునీటి ప్రాజెక్టుల విషయంలో జరుగుతున్న జాప్యంపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాను పాలమూరు బిడ్డనని చెప్పుకుంటూ ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. గత ఎన్నికల్లో పాలమూరు ప్రజలు కాంగ్రెస్‌కు 12 సీట్లు కట్టబెడితే ఈ రెండున్నర ఏళ్లలో ఒక్క తట్టెడు మట్టి కూడా ఎత్తిపోయలేదని ఎద్దేవా చేశారు. కృష్ణా నది నీళ్లు మన పొలాలకు రాకుండా చేస్తున్న ఈ ద్రోహానికి వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను కిలోమీటర్ లోతులో గొయ్యి తీసి బొందపెట్టడం ఖాయమని హెచ్చరించారు. కృష్ణా నది నుంచి నీటిని మళ్లించే విషయంలో గత ప్రభుత్వం అనుసరించిన తప్పుడు విధానాల వల్లే నేడు ఈ దుస్థితి ఏర్పడిందన్నారు.

# పోలీస్ అధికారి భార్య హత్య

- నేపాలీ గ్యాంగ్‌గా అనుమానం
- క్లూ ఆధారంగా వేగంగా విచారణ
- నగర పోలీస్ కమిషనర్ సజ్జన్నార్ వెల్లడి



**హైదరాబాద్, మే8 (జనంసాక్షి) :** జూబ్లీహిల్స్‌లోని ప్రశాసన్ నగర్‌లో రిటైర్డ్ డీజీ వినయ్ రంజన్ రాయ్ సతీమణి తనుజా (55) హత్యకు గురయ్యారు. ఈ హత్యకు సంబంధించిన వివరాలపై హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ వీసీ సజ్జనార్ మీడియాతో మాట్లాడారు. రిటైర్డ్ డీజీ సతీమణి తనూజ హత్య గావింపబడిందని తమకు మొదటగా సమాచారం వచ్చిందని తెలిపారు. రిటైర్డ్ డీజీ భార్య తనుజాను గురువారం రాత్రి రెండు గంటలకు దుండగులు హత్య చేశారని చెప్పుకొచ్చారు. నేపాలి గ్యాంగ్ పనిగా ప్రాథమికంగా తాము ఒక అంచనాకు వచ్చామని అన్నారు. కొన్ని క్లూస్ లభించాయని.. ఆ క్లూస్ ఆధారంగా ఈ కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. నేపాలి పనివాళ్లపై అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నేపాలి పని మనుషులు ఇంట్లో ఎవరూ లేనప్పుడు నేరాలకు పాల్పడుతున్నారని సీపీ సజ్జనార్ చెప్పుకొచ్చారు. గురువారం రాత్రి రిటైర్డ్ డీజీ ఇంట్లో ఎవరు లేనప్పుడు పనిమనిషి కల్పన అనే మహిళ మరికొందరితో కలిసి ఈ దారుణం చేసిందని తెలిపారు. ఈ ఘటన సమయంలో పిల్లలు ఇద్దరు పై ఫ్లోర్‌లో ఉన్నారని.. తనుజ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్నారని వెల్లడించారు. ఇంట్లో ఉన్న పనిమనిషి కల్పనతో బయట వ్యక్తులు కాంటాక్ట్ పెట్టుకొని ఈ క్రైమ్ చేశారని చెప్పారు. ప్రజలు భయాందోళనకు గురికావొద్దని.. నిందితులను త్వరలో పట్టుకుంటామని తెలిపారు. నేపాలి పనిమనుషులు ఇంట్లో ఏడాది, రెండో ఏడాది పనిచేసిన కూడా వాళ్లపై నిఘా ఉంచాలని సీపీ సజ్జనార్ అన్నారు. ఈ కేసును చాలా సీరియస్‌గా తీసుకుంటున్నామని తెలిపారు. చేతులు కట్టేసి నోట్లో గుడ్డలు కుక్కి ఆమెను ఈ గ్యాంగ్ హత్య చేసిందని చెప్పారు. రిటైర్డ్ డీజీ తల్లి కోసం ఆమె హైదరాబాద్ వచ్చారని తెలిపారు. ఇటీవల రిటైర్డ్ డీజీ తల్లి మరణించారని.. అప్పటి నుంచి తనుజ ఇక్కడే ఉంటున్నారని వివరించారు. ఈ కేసులో ఎంత బంగారం, నగదు పోయిందనే అంశాలపై ఆరా తీస్తున్నామని తెలిపారు. నిందితులు బ్యాక్ గేట్ నుంచి ఇంట్లోకి ప్రవేశించారని.. ఘటన అనంతరం వెనుక నుంచి పారిపోయారని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు.

# బ్యాంక్ ఆఫ్ బరోడా బలమైన వృద్ధి

- 31 మార్చి 2026తో ముగిసిన త్రైమాసికం




**ముంబై (జనంసాక్షి) :** అవసరమైన అనుమతులకు లోబడి 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఒక్కో ఈక్విటీ షేరుపై రూ.8.5 డివిడెండ్‌ను (ఒక్కో షేరు ముఖ విలువ రూ.2లో 425%) బ్యాంక్ బోర్డు సిఫార్సు చేసింది. 31 మార్చి 2026 నాటికి, బ్యాంక్ యొక్క ప్రపంచ స్థాయి వ్యాపారం 30 లక్షల కోట్ల మైలురాయిని అధిగమించింది. బ్యాంక్ తన చరిత్రలోనే అత్యధిక త్రైమాసిక నికర లాభాన్ని రూ.5,616 కోట్లుగా (గత ఏడాదితో పోలిస్తే +11.2%) నమోదు చేసింది. ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన నికర లాభం కూడా రూ.20,000 కోట్ల మైలురాయిని దాటి రూ.20,021 కోట్లుగా నమోదైంది. ఈ త్రైమాసికానికి నిర్వహణ లాభం గత ఏడాదితో పోలిస్తే 11.5% పెరిగి రూ.9,069 కోట్లుగా నిలిచింది. 2026కి నిర్వహణ లాభం రూ.32,259 కోట్లుగా ఉంది.

బ్యాంక్ దేశీయ రుణాల విలువ రూ. 11,69,458 కోట్లకు పెరిగింది, ఇది గత ఏడాదితో పోలిస్తే 14.5% వృద్ధిని సూచిస్తుంది. బ్యాంక్ యొక్క ప్రపంచవ్యాప్త రుణాల విలువ రూ. 14,29,879 కోట్లకు పెరిగింది, ఇది గత ఏడాదితో పోలిస్తే 16.2% వృద్ధి. మార్చి 2026 నాటికి అంతర్జాతీయ రుణాల విలువ గత ఏడాదితో పోలిస్తే 24.4% వృద్ధితో రూ. 2,60,421 కోట్లకు చేరుకుంది. మార్చి 2026 నాటికి దేశీయ డిపాజిట్లు గత ఏడాదితో పోలిస్తే 12.8% వృద్ధితో రూ. 14,01,290 కోట్లకు పెరిగాయి.

ప్రపంచవ్యాప్త డిపాజిట్లు గత ఏడాదితో పోలిస్తే 12.0% వృద్ధితో రూ. 16,48,487 కోట్లకు పెరిగాయి. దేశీయ సీఏఎస్ఏ డిపాజిట్లు గత ఏడాదితో పోలిస్తే 9.8% వృద్ధిని నమోదు చేశాయి; మార్చి 31, 2026 నాటికి వీటి విలువ రూ. 5,45,034 కోట్లుగా ఉంది. మార్చి 2026 నాటికి అంతర్జాతీయ డిపాజిట్లు గత ఏడాదితో పోలిస్తే 7.5% వృద్ధితో రూ. 2,47,197 కోట్లకు చేరుకున్నాయి. ఆటో రుణాలు (20.6%), మార్ట్‌గేజ్ రుణాలు (19.3%), గృహ రుణాలు (14.6%), విద్యా రుణాలు (10.9%) వంటి వివిధ విభాగాలలో నమోదైన బలమైన వృద్ధి కారణంగా, స్వచ్ఛమైన రిటైల్ రుణాల విలువ 17.9% మేర పెరిగింది. వ్యవసాయ రుణాల పోర్ట్‌ఫోలియో గత ఏడాదితో పోలిస్తే 20.7% వృద్ధితో రూ. 1,91,063 కోట్లకు పెరిగింది.

# మానవ సేవే జీవిత పరమార్థంగా భావించాలి

- థలసేమియా చిన్నారుల ధైర్యం సమాజానికి స్ఫూర్తి: గవర్నర్
- రక్తదానం, స్వచ్ఛంద సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి
- ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం లో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా



**హైదరాబాద్, మే 8 (జనంసాక్షి) :** "ఇతరులకు సేవ చేయడమే మనిషి జీవితానికి నిజమైన అర్థం" అని, మానవ సేవనే జీవిత పరమార్థంగా భావించాలని తెలంగాణ గవర్నర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు శివ ప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి తెలంగాణ బ్రాంచ్ ఆధ్వర్యంలో గురువారం లోక్ భవన్ సంస్కృతి కమ్యూనిటీ హాల్ లో ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం, ప్రపంచ థలసేమియా దినోత్సవం నిర్వహించారు. రెడ్ క్రాస్ వ్యవస్థాపకులు హెన్రీ డ్యూనెంట్ చిత్రపటానికి గవర్నర్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని గవర్నర్ ప్రారంభించారు. రక్తదాతలకు సర్టిఫికెట్లు అందించి అభినందించారు. థలసేమియా బాధిత చిన్నారులకు న్యూట్రిషన్ కిట్ లు అందించి వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... "మానవత్వంలో ఐక్యత" అనే ఈ ఏడాది థీమ్ సమాజంలో బాధలో ఉన్నవారితో, అవసరంలో ఉన్నవారితో ఐక్యంగా నిలబడాల్సిన బాధ్యతను గుర్తు చేస్తోందని గవర్నర్ అన్నారు. 1920 నుంచి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మానవ సేవకు అంకితభావంతో పనిచేస్తోందని, తెలంగాణలోని 33 జిల్లాల్లో వేలాది మంది సభ్యులు రక్తదానం, ఆరోగ్య శిబిరాలు, విపత్తు సహాయం, ప్రజా సేవా కార్యక్రమాల్లో విశేష సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. థలసేమియాతో పోరాడుతున్న చిన్నారుల ధైర్యసాహసాలను గవర్నర్ అభినందించారు. నిరంతరం రక్త మార్పిడి అవసరమైన పరిస్థితుల్లోనూ వారు చూపుతున్న ఆత్మవిశ్వాసం సమాజానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆ పిల్లల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు నిశ్శబ్దంగా పోరాడుతున్న అసలైన హీరోలని కొనియాడారు. సీఎస్ఆర్ భాగస్వాముల సహకారం వల్ల గ్రామీణ ప్రాంతాలకు ఆరోగ్య సేవలు చేరుతున్నాయని, రక్తదానంపై అవగాహన పెరుగుతోందని, సహాయక చర్యలు మరింత బలోపేతమవుతున్నాయని గవర్నర్ తెలిపారు. రెడ్ క్రాస్ వాలంటీర్లు, జిల్లా అధికారులు గ్రామాల నుంచి నగరాల వరకూ సేవా స్ఫూర్తిని వ్యాప్తి చేస్తున్నారని ప్రశంసించారు. మహాత్మా గాంధీ సేవా తత్వాన్ని స్ఫూర్తిగా తీసుకుని, సేవను కేవలం బాధ్యతగా కాకుండా జీవితంలో అత్యున్నత విలువగా భావించాలని గవర్నర్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రజలందరూ రక్తదానం చేయాలని, స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. కరుణ, ఐక్యత, సేవా భావంతో సమాజాన్ని మరింత సున్నితంగా, శక్తివంతంగా తీర్చిదిద్దేందుకు అందరూ కృషి చేయాలని గవర్నర్ ఆకాంక్షించారు. దేశంలో టీబీ కేసులు ఎక్కువ ఉన్న దృష్ట్యా టీబీ నివారణకు ప్రధాన మంత్రి మోదీజీ టీబీ ముక్త భారత్‌కు పిలుపునిచ్చారనీ అన్నారు. హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ గా ఉన్న సమయంలో ఆ రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో నిక్షయ మిత్ర లను ఏర్పాటు చేసి టీబీ అరికట్టేందుకు కృషి చేశామని గవర్నర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు.
గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం దాన కిషోర్ మాట్లాడుతూ... గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన వెంటనే శివ ప్రతాప్ శుక్లా రెడ్ క్రాస్ సొసైటీలను బలోపేతం పై దృష్టి పెట్టారు. జిల్లాల్లో రెడ్‌క్రాస్ సొసైటీలో సభ్యత్వం పెంచేందుకు మే 15 నుంచి జూన్ 15 వరకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టనున్నారు. కార్యక్రమంలో గవర్నర్ సంయుక్త కార్యదర్శి శశి కిరణా చారి, రెడ్ క్రాస్ సొసైటి జనరల్ సెక్రటరీ, సీఈవో శ్రీ రాములు, జిల్లాల రెడ్ క్రాస్ సొసైటి ప్రతినిధుల, ఎన్‌జీవో ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

### రెడ్ క్రాస్ సొసైటి కి రూ.4 లక్షల ఆర్థిక సహాయం

రెడ్ క్రాస్ సొసైటి కి రూ.4 లక్షల ఆర్థిక సహాయంను కృష్ణ సాయి ఇంటర్నేషనల్ చారిటబుల్ ట్రస్ట్ అందజేసింది. ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం లోక్ భవన్ లో గవర్నర్ ను ఆ సంస్థ వ్యవస్థాపకులు క్రిష్ణ సాయి కలిసి చెక్కును అందజేశారు.

# తలసేమియా అంటు వ్యాధికాదు

- జన్యుపరమైన లోపంతో వచ్చే వ్యాధి
- బ్లడ్ రిలేషన్ వివాహాలతోనూ సంక్రమించే ఛాన్స్
- వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



**హైదరాబాద్, మే 8 (జనంసాక్షి) :** తలసేమియా అంటువ్యాధి కాదని.. ఇది తల్లిదండ్రుల నుంచి పిల్లలకు సంక్రమించే జన్యుపరమైన వ్యాధి అని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. సమీప బంధువుల మధ్య వివాహాలు జరిగే సందర్భాల్లో ఈ వ్యాధి వచ్చే ప్రమాదం మరింత పెరుగుతుందన్నారు. యువత వివాహానికి ముందు తప్పనిసరిగా స్క్రీనింగ్ చేయించుకోవాలన్నారు. కొత్తగా వివాహమైన దంపతులకు కూడా జన్యుపరమైన, ఇతర వ్యాధులపై అవగాహన అవసరమని వెల్లడించారు. తలసేమియా, ఇతర జన్యుపరమైన వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించేందుకు ప్రత్యేక స్క్రీనింగ్ కార్యక్రమం చేపట్టాలని ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తోందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటికే సికిల్‌సెల్ వ్యాధిపై దాదాపు 11 లక్షల మందికి స్క్రీనింగ్ నిర్వహించామన్నారు. వ్యాధి నిర్ధారణ అయిన రోగులకు ప్రభుత్వ హాస్పిటళ్లలో ఉచితంగా చికిత్స, అవసరమైన మందులు అందిస్తున్నామని తెలిపారు. తలసేమియా బాధితులకు క్రమం తప్పకుండా రక్త మార్పిడి అవసరం అవుతుందన్నారు. ఐరన్ చెలేషన్ థెరపీ వంటి చికిత్సలు కూడా అవసరం అవుతాయన్నారు. కొన్ని తీవ్రమైన సందర్భాల్లో బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ అవసరం అవుతుందని చెప్పారు. ఈ చికిత్సల ఖర్చు కుటుంబాలపై భారీ భారం అవుతుందన్నారు. అందుకే తలసేమియా, ఇతర రక్త సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారికి అన్ని దశల్లో అండగా ఉండడానికి చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ప్రభుత్వ హాస్పిటల్స్‌లో రెగ్యులర్ బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూషన్స్, అవసరమైన మందులు, అధునాతన చికిత్స సౌకర్యాలను బలోపేతం చేస్తున్నామని మంత్రి తెలిపారు. హైదరాబాద్‌లోని నిమ్స్‌లో బోన్ మ్యారో ట్రాన్స్ఎ÷-లాంట్ వంటి అధునాతన చికిత్సలు అందుబాటులో ఉన్నాయన్నారు. తలసేమియా బాధిత చిన్నారులకు నిరంతర సేవలు అందించేందుకు ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, ఖమ్మంలో డే కేర్ సెంటర్లు ఉన్నాయని మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు.

# ప్రేమ వ్యవహారమే అఖిల్ హత్యకు కారణం!

- వారం రోజులు యావన్ కదలికలపై రెక్కీ...
- మర్డర్‌లో యువతి బావ, సోదరుడు.. మొత్తం 8మంది..
- హత్య తర్వాత స్నాప్ చాట్‌లో ఫుల్ మర్డర్ అంటూ.. బావ పోస్టు..
- నిందితులను వదిలేది లేదంటున్న డీసీపీ రక్షిత కృష్ణమూర్తి..



**సికింద్రాబాద్ (జనంసాక్షి) :** నగరంలో కలకలం రేపిన బీటెక్ విద్యార్థి యావన్ అలియాస్ అఖిల్(21) హత్యకు ప్రేమ వ్యవహారమే కారణమని సికింద్రాబాద్ జోన్ అడిషనల్ డీసీపీ నర్సయ్య స్పష్టం చేశారు. ఈ కేసులో ఇప్పటికే ఐదుగురు నిందితులను గుర్తించామని, సాంకేతిక ఆధారాల ద్వారా వారిని ఐడెంటిఫై చేసినట్లు వెల్లడించారు. వీరిలో కొందరిని ఇప్పటికే అదుపులోకి తీసుకోగా, మిగిలిన వారి కోసం గాలిస్తున్నామని తెలిపారు. ప్రాథమిక విచారణలో ఇది పరువు హత్య కాదని, అలాగే ఇందులో ఎటువంటి సుపారీ గ్యాంగ్ ప్రమేయం లేనట్లు తెలుస్తోందని ఆయన మీడియాకు వివరించారు. ఈ హత్యకు సంబంధించి పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని, దోషులు ఎంతటి వారైనా సరే వదిలే ప్రసక్తి లేదని డీసీపీ చెప్పారు. మరోవైపు అఖిల్ హత్యతో ఆగ్రహించిన తండ్రి శ్రీనివాస్, బంధువులు, మిత్రులు పెద్ద ఎత్తున నిందితుల ఇంటిని ముట్టడించారు. తమ బిడ్డ ప్రాణం తీసిన వారిని వెంటనే తమకు అప్పగించాలంటూ నినాదాలు చేస్తూ ఆందోళనకు దిగారు. బీటెక్ చదువుతున్న మా కుమారుడిని పొట్టనబెట్టుకున్న నిందితులు లోపల ఏసీల్లో దర్జాగా కూర్చున్నారు.. మా బిడ్డ ప్రాణాన్ని ఎవరు తిరిగి తెస్తారు...అంటూ బాధితులు పోలీసులను నిలదీశారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో ఈస్ట్ జోన్ అదనపు డీసీపీ నర్సయ్య భారీ పోలీస్ బలగాలతో అక్కడికి చేరుకుని, దాదాపు రెండు గంటల పాటు ఆందోళనకారులకు నచ్చజెప్పారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇవ్వడంతో బాధితులు శాంతించి అక్కడి నుంచి వెళ్లిపోయారు.

### గాంధీ మార్చురీ వద్ద ఉద్రిక్తత...

గాంధీ ఆసుపత్రిలో యావన్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. ఈసందర్భంగా యావన్ కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులతో గాంధీ మార్చురీ ఆవరణలో రద్దీగా మారింది. యావన్ బంధువులు ఈ సందర్భంగా రోదిస్తూ,తమ బిడ్డను అన్యా యంగా, దారుణంగా చంపారని విలపిం చారు. తమ కొడుకు బీటెక్ థర్డ్ ఇయర్ పరీక్షలు కొద్దిరోజుల్లో ఉన్నాయని, తర్వాత ఉద్యోగం వచ్చేదని అన్నారు. యావన్ సొంత ప్రాంతం ఆంధ్రప్రదేశ్ లోని ఏలూర్ నుంచి బంధువులు వచ్చారు. ఏలూరు కు చెందిన ఆయన మేనమామ శివకుమార్, మేనత్త లు మాట్లాడుతూ..నిన్న సాయంత్రం ఎవరో కుర్రాడు వచ్చి 6.30 కి తీసుకువెళ్ళాడు. కత్తులతో దాడిచేసిన తర్వాత 10 సార్లు కాల్ చేసిన అంబులెన్స్ రాలేదని వాపోయారు. మెడపై కత్తులతో నరుకుతుం టూ యావన్ చేతును అడ్డుగా పెట్టుకుంటే వేళ్ళూ తేగి వేలాడుతున్నాయని అంటూ కన్నీళ్ల పర్యంతమయ్యారు. 18 కత్తిపోట్లు శరీరంపై ఉన్నాయి. అత్యంత దారుణంగా చంపేశారని రోదించారు. తమకు న్యాయం జరగాలని, యువతి కుటుంబసభ్యులందరిపై కఠినంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా హత్యకు ముందు వారం రోజులుగా యావన్ కదలికలపై యువతి కుటుంబ సభ్యులు రెక్కీ నిర్వహించినట్లు సమాచారం.

### యువతి,యావన్ ఆడియో కాల్ రికార్డింగ్ వైరల్

యువతి,యావన్ ఇద్దరు మాట్లాడుకున్న ఓ ఫోన్ కాల్ ఆడియో క్లిప్పింగ్ శుక్రవారం సాయంత్రం నుంచి సోషల్ మీడియాలో వైరలయ్యింది. ఇందులో యువతి యావన్ ను జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించింది. తనను కాలేజీ మానేయ్యమని ఇంట్లో చెబుతున్నారు..అలాగే నీపై పోలీస్ స్టేషన్ లో కేసు పెట్టామని ఒత్తిడి తెస్తున్నారని చెప్పింది. మా బావ నీపై చాలా కోపంగా ఉన్నాడు. మన ఇద్దరిని చంపుతా అని బెదిరిస్తున్నాడు అని యువతి పేర్కొంది. అంతా అయిపోయింది కదా..మళ్ళీతనపై కోపం, ఎందుకు మీ వాళ్ళకు అని ప్రశ్నించాడు.

### హత్య కేసులో నలుగురు అరెస్ట్... సీతాఫల్‌మండిలో ఉద్రిక్తత..

చిలకలగూడ పోలీస్‌స్టేషన్‌పరిధిలోని ఇందిరానగర్‌లో యువకుడు యువన్ హత్య కేసు తీవ్ర కలకలం రేపుతోంది. ఈ ఘటనకు సంబంధించి ప్రధాన నిందితుడితో సహా నలుగురిని అరెస్ట్‌చేసినట్లు నార్త్ జోన్ డీసీపీ రక్షిత కృష్ణమూర్తి వెల్లడించారు. నిందితులపై కఠిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేశామని, హత్యకు దారితీసిన కారణాలపై అన్ని కోణాల్లో లోతైన విచారణ జరుపుతున్నామని ఆమె స్పష్టం చేశారు. గాంధీ ఆసుపత్రిలో యువన్‌మృతదేహానికి పోస్టుమార్టం ప్రక్రియ పూర్తి కాగా, భారీ పోలీస్ బందోబస్తు మధ్య మృతదేహాన్ని సీతాఫల్‌మండిలోని అతని నివాసానికి తరలించారు. తర్వాత సీతాఫల్మండి శ్వశాన వాటికలో యావన్ అంత్యక్రియలు జరిగాయి.



# ప్రధాని పర్యటన తరవాత రాజకీయ మార్పులు

- బీజేపీ అధ్యక్షుడు నారపరాజు రామచందర్‌రావు

**హైదరాబాద్, మే8 (జనంసాక్షి) :** ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ నెల 10వ తేదీన తెలంగాణలో పర్యటిస్తున్నారని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు నారపరాజు రామచందర్‌రావు తెలిపారు. ఈ సభ తర్వాత తెలంగాణ రాజకీయాలు మారబోతున్నాయని పేర్కొన్నారు. ఈ సభ ఏర్పాట్లు అన్ని దాదాపు పూర్తి అయ్యాయని చెప్పుకొచ్చారు. పరేడ్ గ్రౌండ్‌లో మోదీ హాజరయ్యే సభ ఏర్పాట్లను శుక్రవారం రామచందర్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.రెండు రోజులపాటు పరేడ్ గ్రౌండ్ పరిసర ప్రాంతాలు అన్ని కేంద్ర బలగాల అధీనంలోకి వెళ్తాయని వెల్లడించారు. గ్రేటర్ ఎన్నికల ముందు మోదీ సభ జరగడం తమ పార్టీకి కలిసి వచ్చే అంశమని తెలిపారు. తెలంగాణ అభివృద్ధిలో మోదీ ప్రాధాన్యం చాలా ఉందని ఉద్ఘాటించారు. రెండు లక్షలకు పైగా మందితో ఈ సభ సక్సెస్ కాబోతుందని అన్నారు. బీజేపీ శ్రేణులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా మోదీ సభ కోసం తరలి వస్తున్నారని తెలిపారు. ఈ సభ కోసం ప్రత్యేక రైళ్లు, బస్సులను ఏర్పాటు చేశామని రామచందర్‌రావు పేర్కొన్నారు.

# మున్సిపల్ ఆస్తులు ధ్వంసం చేసిన వారి అరెస్ట్

**వరంగల్ ఈస్ట్, మే 08 (జనం సాక్షి) :** వరంగల్ నగర పాలక సంస్థ ఆస్తుల ధ్వంసం చేసిన సంఘటనకు సంబంధించిన వారిని అరెస్టు చేసినట్లు మట్టేవాడ ఇన్స్పెక్టర్ శుక్రవారం తెలిపారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన కొంతమంది వ్యక్తులు, ఈనెల 6 న కేటీఆర్ పర్యటన సందర్భంగా రోడ్డుపై ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినారు. అయితే, సంబంధిత అధికారుల అనుమతులు లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయబడినందున, జీడబ్ల్యూఎంసీ అధికారుల ఆదేశాల మేరకు వాటిని తొలగించడం జరిగింది. దీనికి నిరసనగా సంబంధిత వ్యక్తులు జీడబ్ల్యూఎంసీ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించి, అనంతరం అక్రమంగా కార్యాలయ ప్రాంగణంలోకి ప్రవేశించి కార్యాలయంలోని అద్దాలు మరియు ఇతర ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసినారు. ఈ ఘటనకు సంబంధించి జీడబ్ల్యూఎంసీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న అధికారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు తేదీ: 05-05-2026 రోజున మట్టెవాడ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయబడినది. కేసు దర్యాప్తులో భాగంగా ఇప్పటివరకు క్రింది 13 మంది నిందితులను అరెస్ట్ చేసి న్యాయస్థానమునకు హాజరు పరచడం జరిగినది. వారి వివరాలు: బోయినపల్లి రంజిత్ రావు, కొడకండ్ల సదాంత్,మొహమ్మద్ షఫీ అహ్మద్, బొంగు అశోక్ ,చెన్న మధుసూదన్ ,నల్ల సుధాకర్ రెడ్డి ,వడిచర్ల ప్రసాద్ ,కాయత రఘువీర్ రెడ్డి బుస్సా శేఖర్ ,ఎమ్మడి రాజు ,పొడిశెట్టి వాసు, గాదె శేషు పెద్దపల్లి రాజు కేసులో మిగిలిన నిందితులను గుర్తించి త్వరలోనే అరెస్ట్ చేయుటకు చర్యలు కొనసాగుతున్నవి అని ఇన్స్పెక్టర్ తెలిపారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370